

ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

V6 NEWS
ప్రతి దృశ్యం... ప్రజల పక్షం...

ప్రభాత

వెలుగు

02.01.2020
www.v6velugu.com

గురువారం | హైదరాబాద్
సంపుటి: 5 సంచిక: 319 పేజీలు: 12+12+16 | ₹ 5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, WARANGAL, JAGTIAL



తెల్లారేసరికి గడపగడపకు ఎమ్మెల్యే గడియారాలు

సుల్తానాబాద్లో న్యూ ఇయర్ గిఫ్టుల పేరుతో మున్సిపోల్స్ ప్రలోభాలు

సుల్తానాబాద్, వెలుగు: అది పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ టౌన్. బుధవారం న్యూ ఇయర్ కావడంతో ముగ్గులేసేందుకు మహిళలు కొంచెం ముందే నిద్ర లేచారు. ఓ ఇంటావిడ తలుపులు తెరవగానే మెట్ల మీద గులాబీ రంగు గోడ గడియారం కనిపించింది. క్లాక్ లోపల ఓవైపు సీఎం కేసీఆర్, ఇంకోవైపు ఆ సెగ్మెంట్ ఎమ్మెల్యే దాసరి మనోహర్రెడ్డి ఫొటోలు. పక్కన కారు గుర్తు ఉన్నాయి. గడియారాన్ని తీసుకొని 'ఏమండోయ్..' అనే లోపే పక్కింటావిడ చేతిలోనూ అలాంటి గడియారమే చూసి నోరెళ్లబెట్టింది. ఆ రెండు ఇండ్లే కాదు. ఏ క్రిస్మస్ తాతో వచ్చి ఓపిగ్గా పెట్టి వెళ్లినట్టు, ఆకాశం నుంచి గడపగడపన గడియారాల వానేదో కురిసినట్టు.. తెల్లారేసరికి వాడవాడలా అన్ని ఇండ్ల ముందరా ప్రత్యక్షమైన వాల్ క్లాక్లను చూసి సుల్తానాబాద్ జనాలు అవాక్కయ్యారు. ఆ గిఫ్టులు ఎందుకొచ్చాయో కాసేపటికే పసిగట్టారు. ఫ్రీగానే వచ్చాయి గదా అని గోడలకు తగిలించుకున్నారు. సీఎం కేసీఆర్, లోకల్ ఎమ్మెల్యే మనోహర్రెడ్డి ఫొటోలతో పాటు పక్కన కారు బొమ్మ ఉండేలా ఆల్రెడీ తయారు చేయించిన 4 వేల వాల్ క్లాక్లు 40 పెట్టెల్లో పెద్దపల్లి నుంచి మంగళవారం రాత్రి సుల్తానాబాద్ చేరాయి. మిగతా 3లో

'నాకు మేయర్ పదవి ఇస్తామని గ్యారెంటీ ఇవ్వండి. రూ. 3 కోట్ల విలువైన భూమి రాసిస్తా. అట్లనే మొత్తం కార్పొరేటర్లను కూడా గెలిపించుకుంటా'
ఇదీ ఓ మంత్రికి హైదరాబాద్ శివారులోని రియల్టర్ పెట్టిన ప్రపోజల్.

'మున్సిపల్ చైర్మన్ పదవి ఇచ్చేందుకు మీ ఎమ్మెల్యే ఒప్పుకుంటే రూ. కోటిన్నర ఇస్తా'
ఇదీ ఓ ఎమ్మెల్యే సన్నిహితుడి ముందు రియల్టర్ ప్రతిపాదన.

'టికెట్ ఇస్తా. అందుకు రూ. 50 లక్షలు ఖర్చవుతుంది. ప్రచారం ఖర్చు కూడా నువ్వే పెట్టుకో'
ఇదీ టికెట్ ఆశిస్తున్న ఓ వ్యాపారికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ ఎమ్మెల్యే కండిషన్.

మున్సిపల్ టికెట్ల దందా!



రంగంలోకి రియల్టర్లు, వ్యాపారులు.. టీఆర్ఎస్లో తీవ్రంగా పోటీ

- హైదరాబాద్ శివారులో రూ. కోటిన్నర ఆఫర్
- మరో చోట.. 3 కోట్ల విలువైన భూమి ఆఫర్
- పార్టీకి డబ్బిస్తాం, మిగతా వారిని గెలిపిస్తాం
- మేయర్, చైర్మన్ తమకే ఇవ్వాలంటూ ప్రపోజల్స్
- జిల్లాల్లో కౌన్సిలర్ టికెట్ కోసం రూ. 50 లక్షలు
- టికెట్ ఇవ్వకపోతే రెబల్గా దిగుతామని బెదిరింపులు

హైదరాబాద్, వెలుగు: మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ టికెట్ దక్కించుకునేందుకు రియల్టర్లు, వ్యాపారులు పోటీ పడుతున్నారు . మళ్లీ నాలుగైదేండ్ల దాకా ఎన్నిక లు లేకపోవడంతో ఎట్లయినా చేసి బరిలో నిలవాలని ప్రయత్నిస్తున్నారు. టికెట్ ఇప్పిస్తే రూ. కోటి నుంచి కోటిన్నర దాకా ముట్టజెప్తామని కొందరు ఆఫర్ ఇస్తున్నట్లు టీఆర్ఎస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 'టికెట్ ఇచ్చినందుకు కొంత, పార్టీకి మరికొంత' అని లెక్కలు చూపిస్తూ జోరుగా రియల్టర్లు, వ్యాపారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే మేయర్ పదవి కానీ, మున్సిపల్ చైర్మన్ పదవి కానీ ఇవ్వాలని, అట్ల ఇస్తే మరో కోటి ఇస్తామంటూ పలువురు ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ వారు చక్కర్లు కొడుతున్నారు. నేరుగా ఎమ్మెల్యేలను, మంత్రులను సంప్రదించే చాన్స్ లేనివాళ్లు.. ఆయా ఎమ్మెల్యేలు, మంత్రుల సన్నిహితులను అప్రోచ్ అవుతున్నారు. దీంతో ఉద్యమ కాలం నుంచి పార్టీలో ఉన్న నేతల పరిస్థితి ఏంటన్న చర్చ టీఆర్ఎస్ వర్గాల్లో ఉంది.

రియల్టర్ల హవా

హైదరాబాద్ శివారు, కొత్త జిల్లాల కేంద్రాల్లో రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. మిగతా 3లో

మా పరిస్థితేందంటున్న ఉద్యమ లీడర్లు

టికెట్ల కోసం రియల్టర్లు, వ్యాపారుల పోటీ పెరగడంతో ఉద్యమ కాలం నుంచి పార్టీలో ఉంటున్న లీడర్లు ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా మంచి పేరున్న కొందరు నాయకులకు డబ్బులు పెట్టే పరిస్థితి లేదు. ఉద్యమ సమయం నుంచి పార్టీలో ఉన్న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఓ నాయకుడికి టికెట్ ఇవ్వనని స్థానిక ఎమ్మెల్యే నిర్మొహమాటంగా చెప్పినట్లు సమాచారం. 'టికెట్ కోసం మా ఎమ్మెల్యే డబ్బులు అడుగుతుండు. ఏం చేయాలి? ఉద్యమం నుంచి పార్టీలో ఉన్నోళ్లకు ఇట్లనేనా చేసేది?' అని ఆ లీడర్హైదారాబాద్ కు వచ్చి కీలక నేతకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఆ కీలక నేత 'నేను మాట్లాడుతా' అని సముదాయించి పంపించినట్లు సమాచారం.



05

నో పాలిటిక్స్: బిపిన్ రావత్

జనరల్ బిపిన్ రావత్ భారత సేనాధిపతిగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. తాము రాజకీయాలకు దూరంగా ఉంటామని.. ప్రభుత్వ ఆర్డర్ల ప్రకారం పనిచేస్తామని ఈ సందర్భంగా రావత్ చెప్పారు.




06

జనరల్

21 ప్రశ్నలతో ఎన్పీఆర్

కిందటేడాది సెప్టెంబర్లో ఎన్పీఆర్ ట్రయల్స్లో వాడిన మోడల్ పేపర్ ఫైనల్ చేయాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వం.



05

దేశం - విదేశం

ఖబడ్దార్ ఇరాన్

టెహ్రాన్లోని తమ పౌరులు, ఆస్తులకు ఏమైనా జరిగితే ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్న ట్రంప్.

మన్ను గూడా కాదన్నరు..

చేసి చూపించాం

ఆర్టీసీ విలీనంపై ఏపీ రవాణా మంత్రి పేర్ని నాని



- ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన ఆర్టీసీ సిబ్బంది
- ఏపీలో 'థాంక్యూ సీఎం' పేరిట వేడుకలు

అమరావతి, వెలుగు: ఏ రాష్ట్రంలో లేని రీతిలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి చరిత్ర సృష్టించారని ఏపీ రవాణా శాఖ మంత్రి పేర్ని నాని కొనియాడారు. ''ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సాధ్యంకాదని తెలంగాణ సీఎం కేసీఆర్ అక్కడి కార్మికులకు తేల్చి చెప్పారు. మన్ను కూడా కాదంటే మేము చేసి చూపించాం' అని ఆయన అన్నారు. అనుభవం కంటే సంకల్ప బలం గొప్పదని జగన్ నిరూపించారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం సందర్భంగా విజయవాడ డిపోలో ఏర్పాటు చేసిన 'సీఎం జగన్కు కృతజ్ఞత సభ'లో నాని మాట్లాడారు. బుధవారం నుంచి ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారని చెప్పారు. సీఎం జగన్ 54 వేల మంది ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. జనవరి 1 వ తేదీ నుంచి ఏపీ ఆర్టీసీలో ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని, రవాణా శాఖలో కొత్తగా ఏర్పాటు చేసిన పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ విభాగంలో వాళ్లు డ్యూటీ చేస్తారని ఏపీ సర్కారు ఇప్పటికే ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు బుధవారం నుంచి విలీన నిర్ణయం అమల్లోకి రావడంతో ఏపీలోని 128 బస్ డిపోల్లో ఉద్యోగులు థాంక్యూ సీఎం పేరుతో సంబురాలు చేసుకున్నారు.

నమ్మకద్రోహం చేసినోళ్లు బాగుపడరు

- ఎన్నికల ముందు ఒక తీరు.. గెలిచినంక ఇంకో తీరు
- ఈ సారి నేనే బీ ఫామ్ ఇస్త
- క్యాంప్ రాజకీయాలు నావల్ల కాదు
- మంత్రి ఈటల రాజేందర్
- మున్సిపోల్స్ సన్నాహక మీటింగ్లో ఆసక్తికర కామెంట్లు

03

ఈ దశాబ్దం మాదే

2020.. టీఆర్ఎస్ నామ సంవత్సరం

'పోతిరెడ్డిపాడు' లాంటివి భూతద్దంలో చూడొద్దు: కేటీఆర్

- కాంగ్రెస్సే మాకు ప్రధాన ప్రత్యర్థి
- కేసీఆర్ని మించిన హిందువు లేడు
- దేశంలోని హిందువులంతా సీఏఏకు మద్దతిస్తున్నారా?
- ఎమ్మెల్యేలు రెబల్స్ కడుపులో తలపెట్టయినా బుజ్జగించాలి
- సరిగ్గా పనిచేయకపోతే ముందు మా కౌన్సిలర్లపైనే వేటు
- నేను సీఎం అన్న చర్చకు తావులేదు.. కేసీఆరే సీఎం
- మీడియాతో చిట్చాట్లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

రైతు బంధు విషయంలో ఎలాంటి సమస్యలు లేవు. రైతు బంధు అందక ఎవరూ ఇబ్బంది పడటంలేదు. అవస్థపడితే రోడ్డెక్కే వాళ్లు కదా.. అసలు రైతు బంధు ఇవ్వక ముందు రాష్ట్రంలో పరిస్థితి ఏంది?.
- కేటీఆర్



02

వెన్కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్నగర్
92.00	92.00	92.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
92.00	92.00	93.00

డ్రంకెన్ డ్రైవ్ కేసులు 3,148

హైదరాబాద్లోని మాదాపూర్లోనే 233 కేసులు నమోదు

- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 2,100 రిజిస్టర్
- సైబరాబాద్ లో పట్టుబడ్డ ఇద్దరు మహిళలు
- రాష్ట్రవ్యాప్తంగా 239 ప్రాంతాల్లో పోలీసుల స్పెషల్ డ్రైవ్
- న్యూ ఇయర్ సెలబ్రేషన్స్లో పలు చోట్ల గొడవలు
- ఆదిలాబాద్లో ముగ్గురు, సిద్దిపేటలో ఒకరికి కత్తిపోట్లు
- సముద్రంలో ఈతకెళ్లిన ముగ్గురు ఏపీ స్టూడెంట్లు మృతి



04

హైదరాబాద్లోని కోఠిలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టు చేస్తున్న పోలీసులు

చంద్రయాన్ 3.. వచ్చే ఏడాది

వెల్లడించిన ఇస్రో చైర్మన్ కె. శివన్

- ప్రాజెక్టు ఖర్చు రూ.615 కోట్లు.. కేంద్రం ఆమోదం
- గగన్యాన్కు నలుగురు ఆస్ట్రోనాట్ల ఎంపిక
- ఈ నెల మూడో వారం నుంచి రష్యాలో ట్రైనింగ్

వచ్చే ఏడాది చంద్రయాన్ 3 ప్రయోగం చేస్తామని ఇస్రో చైర్మన్ కె. శివన్ తెలిపారు. ప్రయోగానికి రూ.615 కోట్లు ఖర్చవుతుందని, ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపిందని ఆయన చెప్పారు. మొదట ఈ ఏడాదిలోనే ప్రయోగం చేయాలనుకున్నా, వచ్చే ఏడాదికి వాయిదా పడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. మనిషిని అంతరిక్షంలోకి పంపించే గగన్యాన్ ప్రయోగానికి నలుగురు ఆస్ట్రోనాట్లను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ నెల మూడో వారం నుంచి వాళ్లకు రష్యాలో ట్రైనింగ్ మొదలవుతుందన్నారు.



12

క్విక్ బైట్స్



ఏపాటి సాయం తీసుకున్నరు?

- స్వైన్‌ఫ్లూ, డెంగీ నియంత్రణలో ప్రైవేట్ ఆస్పత్రుల భాగస్వామ్యంపై సర్కారుకు హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, వెలుగు: స్వైన్‌ఫ్లూ, డెంగీ వంటి వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ప్రభుత్వం ఏ మేరకు సాయం తీసుకుందో చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ కరుణ వేసిన పిల్‌తో పాటు, లాయర్ రాపోల్ భాస్కర్ రాసిన లేఖను పిల్‌గా స్వీకరించి హైకోర్టు విచారించింది. ఆ వ్యాధుల నివారణ, నియంత్రణకు ప్రైవేటు హాస్పిటల్స్‌ను ఏ మేరకు భాగస్వాములను చేసిందో చెబుతూ కౌంటర్ వేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని చీఫ్ జస్టిస్ ఆర్.ఎస్. చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డిల కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

నీట్ దరఖాస్తు గడువు 6 వరకు పెంపు

హైదరాబాద్, వెలుగు: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) దరఖాస్తు గడువును జనవరి 6 వరకు పొడిగించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) బుధవారం ప్రకటించింది. తొలుత డిసెంబర్ 31తోనే గడువు ముగియగా.. జనవరి 2 నుంచి 6వ తేదీ రాత్రి 11:50 గంటల వరకు అప్లై చేసుకునేందుకు మరో అవకాశం ఇచ్చింది. ఒకేసారి ఎక్కువ మంది దరఖాస్తు చేసేందుకు ప్రయత్నించడంతో, వెబ్‌సైట్ మొరాయించి చాలా మంది అప్లికేషన్ పూర్తిచేయలేకపోయారని, ఈ నేపథ్యంలోనే గడువు పొడిగించామని ఎన్టీఏ పేర్కొంది. ఎగ్జామ్ షెడ్యూల్‌లో మాత్రం ఎలాంటి మార్పులు ఉండబోవని, మే 3న దేశవ్యాప్తంగా 11 లాంగ్వేజీల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది.



నేడు, రేపు వానలు

వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గురు,శుక్రవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు రోజులుగా చలి కాస్త తగ్గింది. ఆదిలాబాద్ జిల్లాలోని భరంపూర్, గుడిహత్నూర్లలో 16.2 డిగ్రీల మినిమమ్ టెంపరేచర్ నమోదైంది. అన్ని జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత 32 డిగ్రీలకు పైనే నమోదైంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. పాతబస్తీ, బహదూర్‌పురా, దూద్‌బౌలి, చార్మినార్, లంగర్‌హౌస్, గోల్కొండ, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, నాంపల్లి, లక్డీకాపూల్, ఖైరతాబాద్, ఉప్పల్, మల్కాజిగిరి, దోమలగూడ ప్రాంతాల్లో పడింది. ఉప్పల్‌లో 2.5, అంబర్‌పేట్‌లో 2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

మరో తొమ్మిది మంది పిల్లల మృతి

- కోటా ఆస్పత్రిలో వందకు చేరిన సంఖ్య

కోట(రాజస్తాన్): కోటా జిల్లాలోని జేకే లాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు రోజుల వ్యవధిలో మరో 9 మంది పసికందులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఆస్పత్రిలో మరణించిన చిన్నారుల సంఖ్య వందకు చేరింది. ఆస్పత్రిలో వసతుల కొరత కారణంగా సీరియస్ కండీషన్‌లో ఆస్పత్రికి తీసుకొచ్చిన పిల్లలను రక్షించలేకపోతున్నట్లు డాక్టర్లు చెప్పారు. ఆస్పత్రిలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో సరిపడా ఆక్సిజన్ సరఫరా ఉండట్లేదని చెప్పారు. పిల్లల పరిస్థితి దాదాపు చేయిదాటిన తర్వాతే ఆస్పత్రికి తీసుకురావడం వల్ల డాక్టర్లు కూడా ఏమీ చేయలేరని పీడియాట్రిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ చెప్పారు. దీంతో ఇక్కడ చిన్నారుల మరణాలు సాధారణమేనని అన్నారు.

ఈ దశాబ్దం మాదే

2020... టీఆర్ఎస్ నామ సంవత్సరం: కేటీఆర్

హైదరాబాద్, వెలుగు: ఇది టీఆర్ ఎస్ నామ సంవత్సరమని, 2020-30 దశాబ్దం టీఆర్ఎస్ దేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. దేశమంతా తెలంగాణ వైపు చూసేలా అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. 2019 ఏడాది టీఆర్ఎస్‌కి మంచి ఆరంభం ఇచ్చిందని, అదేవిధంగా 2020 కూడా మున్సిపల్ ఎన్నికల్లో మంచి విజయంతో ప్రారంభమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. రానున్న రోజుల్లో పార్టీ పరంగా తీసుకునే కార్యక్రమాలు, రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ముచ్చటించారు.

నేను కాదు.. కేసీఆరే సీఎం

మున్సిపల్ ఎన్నికల తర్వాత కేటీఆర్‌ను సీఎం చేస్తారంటూ పార్టీలో, బయట జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు. 'ఇంకో పదేండ్లు సీఎం గా తానే ఉంటానని కేసీఆర్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఇంకా దానిపై ఊహాగానాలు దేనికి? దానిపై ఇంకా చర్చకు తావు లేదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆర్టీసీ సమ్మె సమయంలో తిట్టిన కార్మికులు ఇప్పుడు కేసీఆర్‌కు జేజేలు కొడుతున్నారని కేటీఆర్ అన్నారు. 'అవకాశాన్ని అనుకూలంగా మల్చుకోవడంలో కేసీఆర్ దిట్ట. అందులో ఆయన్ను మించిన వారు ఎవరూ లేరు' అని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలకు ఎత్తు పల్లాలు సహజం అని చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అన్ని ఎంపీ స్థానాలు గెలుస్తామనుకున్నామని, కానీ సాధ్యం కాలేదని అన్నారు.

కాంగ్రెస్సే ప్రధాన ప్రత్యర్థి

రాజకీయంగా టీఆర్ఎస్ పార్టీకి ఎవరూ శత్రువులు లేరని, అంశాల వారీగా మాత్రమే ప్రత్యర్థి పార్టీలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. 'కాంగ్రెస్ పార్టీని ఆషామాషీగా తీసుకోం. ఆ పార్టే మాకు ప్రధాన ప్రత్యర్థి. కాంగ్రెస్‌కు 150 ఏండ్ల చరిత్ర ఉంది. అధికారంలో ఉన్నామని చులకనగా మాట్లాడం' అని చెప్పారు. ఉత్తమ్ పీసీసీ అధ్యక్ష పదవిని వదులుకుంటానని చెప్పడం ఆయన వ్యక్తిగతం అని కేటీఆర్ అన్నారు.

బీజేపీ.. పెద్దగా పెరగలేదు

తన చిన్నప్పుడు బీజేపీ ఎలా ఉందో ఇప్పుడు అలానే ఉందని, పెద్దగా ఏం పెరగలేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆ పార్టీ గాలిలో నాలుగు సీట్లు గెలవగానే గొప్ప పార్టీ కాదని విమర్శించారు. డిఫెన్స్ భూములు ఇవ్వాలంటూ కేంద్రానికి చాలా సార్లు విజ్ఞప్తి చేశామని, కానీ కేంద్రం మాత్రం ఏం స్పందించడం లేదని ఆయన అన్నారు. 'భూములు ఇవ్వాలని అడుగుతాం.. ఇవ్వకపోతే యుద్ధం చేయలేం కదా' అని వ్యాఖ్యానించారు.

కేంద్రం వివక్ష చూపుతోంది

బీజేపీ పాలిత రాష్ట్రాలను ఒక రకంగా ఇతర పార్టీలు ఉన్న రాష్ట్రాలను మరోరకంగా కేంద్రం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం కేంద్రంపై ఉందన్నారు. 'కేంద్రం ప్రగతి శీల రాష్ట్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మంచిది. ప్రతి విషయంలో రాజకీయాలు ఆలోచించడం మంచిది కాదు. కేంద్రం సాయం చేయకున్నా ఐటీలో తెలంగాణ ఫస్ట్‌లో ఉంది' అని కేటీఆర్ తెలిపారు.

సంక్రాంతి తర్వాత పార్టీ ఆఫీసుల ప్రారంభం

మున్సిపల్ ఎన్నికల తర్వాత పూర్తిగా పార్టీ బలోపేతం కోసం దృష్టి సారిస్తానని కేటీఆర్ చెప్పారు. గ్రామ, మండల కమిటీలు పూర్తయ్యాయన్నారు. అన్ని జిల్లాల్లో పార్టీ ఆఫీసుల నిర్మాణం ముగింపు దశలో ఉందని తెలిపారు. సీఎం చేతుల మీదుగా సంక్రాంతి తర్వాత పార్టీ ఆఫీసులను ప్రారంభించుకుంటామన్నారు. 'రాబోయే 11 నెలలు జిల్లాలవారీగా కార్యకర్తలకు ట్రైనింగ్ ఇస్తాం. రాష్ట్రస్థాయిలో కూడా శిక్షణ తరగతులు ఉంటాయి. డిజిటల్ మీడియా, సోషల్ మీడియాను ఉపయోగించుకుంటాం' అని కేటీఆర్ వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రభుత్వం, ప్రజల మధ్య సంధానకర్తలుగా కార్యకర్తలు ఉండేలా తయారు చేస్తామన్నారు.

మున్సిపోల్స్‌పై వారంలో సీఎం భేటీ

మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లను టీఆర్ ఎస్ గెలుచుకుంటుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 'మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీల కంటే మేమే ముందున్నాం. గ్రౌండ్ లెవల్ రిపోర్టు రెండు రోజుల్లో అందుతుంది. ఈ వారంలో సీఎం నేతృత్వంలో సంయుక్త సమావేశం ఉంటుంది' అని చెప్పారు. సీఎం నిర్వహించే సమావేశానికి మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు. మున్సిపోల్స్ లో టీఆర్ఎస్ టికెట్ కోసం పెద్ద ఎత్తున పోటీ ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఒక్కో దగ్గర పది మంది వరకు ఉన్నారని తెలిపారు. 'రెబల్స్‌ను పోటీ నుంచి తప్పించడానికి వాళ్లను బుజ్జగించే బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదే. అవసరమైతే వాళ్ల కడుపులో తలపెట్టి బతిమిలాడాలి. రెబల్స్‌కు ఏదో ఒక పదవి ఇస్తామని చెప్పి బుజ్జగిస్తాం. సిరిసిల్లలో చాలా పోటీ ఉంది. వాళ్లను బుజ్జగించే పనిలో ఉన్నా' అని పేర్కొన్నారు.

మా కౌన్సిలర్లపైనే మొదటి వేటు

2020 కొత్త ఏడాదిలో మున్సిపల్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడమే చాలెంజ్‌గా పెట్టుకున్నట్లు కేటీఆర్ చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ముందుగా చట్టం గురించి తెలుసుకున్నాకే పోటీకి దిగాలని ఆయన సూచించారు. 'విధులు సరిగా నిర్వర్తించపోతే వేటు వేస్తాం. అప్పుడు బాధపడి ప్రయోజనం ఉండదు. పనులు చేయని టీఆర్ఎస్ కౌన్సిలర్లు, చైర్మన్లపైనే మొదటి వేటు ఉంటుంది' అని ఆయన అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన వారందరికీ పార్టీలకతీతంగా శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పారు. ఓ వైపు పల్లె ప్రగతి.. మరోవైపు పట్టణ ప్రగతి సమాంతరంగా కొనసాగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

ఈ ఏడాదే ఫార్మా సిటీ ప్రారంభం

హైదరాబాద్ శివారులో నిర్మిస్తున్న ఫార్మా సిటీని ఈ ఏడాదిలోనే ప్రారంభించుకుంటామని కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే అక్కడ మౌలిక వసతులు కొనసాగుతున్నాయని, పర్యావరణ అనుమతులు కూడా వచ్చాయని చెప్పారు. వచ్చే నాలుగేండ్లలో ఫార్మా, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెడుతామన్నారు. ఈ నెల 3న ముంబైలో జరుగనున్న ఫార్మా సదస్సుకు తాను హాజరుకాబోతున్నట్లు కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత కోసం 'ఈచ్ వన్ టీచ్ వన్' నినాదాన్ని ముందుకు తీసుకెళ్తామని అన్నారు.



బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను సన్మానిస్తున్న మంత్రి ఎర్రబెల్లి తదితరులు

'పోతిరెడ్డిపాడు'ను భూతద్దంలో చూడొద్దు

ఏపీ సీఎం జగన్‌తో దూరం పెరగలేదని, అప్పుడు ఎట్లుందో ఇప్పుడు కూడా అట్లనే ఉందని కేటీఆర్ అన్నారు. పోతిరెడ్డిపాడు కెపాసిటీ పెంచుతామంటూ జగన్ ఏపీ అసెంబ్లీ వేదికగా ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించగా.. 'చిన్న, చిన్న ఇష్యూలు వస్తుంటాయి. అండర్ స్టాండ్‌తో పరిష్కరించుకోవాలి. ప్రతి దాన్నీ భూతద్దంలో పెట్టి చూడొద్దు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కూడా చంద్రబాబుతో సత్సంబంధాలు కొనసాగాయని, తాము యాగం చేసినప్పుడు ఆయన్ను పిలిచామని, ఏపీ రాజధాని శంకుస్థాపనకు ఆయన తమను పిలిచారని చెప్పారు. ఏపీతో కలిపి గోదావరి జలాలను కృష్ణా బేసిన్ లోకి తరలించాలనే విషయం ఆలోచనలో మాత్రమే ఉందని, ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని కేటీఆర్ అన్నారు.

కేసీఆర్‌ను మించిన హిందువు లేడు

సీఏఏ ను హిందువులు కూడా వ్యతిరేకిస్తున్నారని కేటీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్‌ను మించిన హిందువు లేడని, దేశంలోని హిందువులంతా సీఏఏకు మద్దతిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. 'ఎంఐఎం నిజామాబాద్ లో నిర్వహించిన సీఏఏ వ్యతిరేక సభకు మా పార్టీ ఎమ్మెల్యేలు హాజరవడం నెగిటివ్ కాలే. సీఏఏ ను కేవలం ముస్లింలే వ్యతిరేకించడం లేదు. హిందువులు కూడా వ్యతిరేకిస్తున్నరు. నేను హిందువును, నేను కూడా వ్యతిరేకిస్తున్న' అని కేటీఆర్ చెప్పారు. ఎన్పీఆర్, ఎన్నార్సీ విషయంలో పార్టీ నిర్ణయం కంటే ప్రభుత్వం నిర్ణయమే ముఖ్యమన్నారు. వాటిపై అందరితో మాట్లాడినతర్వాతే సీఎం తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. దేశం మంచి కోసం కేంద్రం మళ్లీ ఏదైనా బిల్లు తెస్తే తప్పకుండా సపోర్టు చేస్తామని ఆయన అన్నారు.

మజ్లిస్ మిత్రపక్షమే.. దానితో కలిసి పోటీ చేయం

మజ్లిస్ పార్టీ తమకు మిత్రపక్షం మాత్రమేనని కేటీఆర్ చెప్పారు. ఎన్నికల్లో ఆ పార్టీతో కలిసి పోటీ చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లోని పాతబస్తీకి కూడా మెట్రో రైలు సర్వీసు తప్పకుండా వస్తుందన్నారు.



ఈఎస్ఐ స్కాంలో మరో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, వెలుగు: ఈఎస్ఐ మెడికల్ స్కామ్ కేసులో ఓమిని ఎండీ కంచర్ల శ్రీహరి బాబు అలియాస్ బాబ్జి తో పాటు హెమొక్యూ రీజనల్ మేనేజర్ టంకసాల వెంకటేశ్ (42)ను బుధవారం ఏసీబీ అరెస్ట్ చేసింది. ఐఎంఎస్ మాజీ డైరెక్టర్ దేవికారాణి, జేడీ కలకుంట్ల పద్మల డైరెక్షన్ లో శ్రీహరి బాబు, వెంకటేశ్ ఈ కుంభకోణంలో చక్రం తిప్పినట్లు ఏసీబీ గుర్తించింది. మంగళవారం సోదాలు జరిపి కీలక డాక్యుమెంట్లను ఏసీబీ స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ డాక్యుమెంట్ల ఆధారంగా బుధవారం ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించింది.

క్యువెటిస్ కిట్స్‌పేరుతో దందా

దేవికారాణి ఆదేశాలతో నకిలీ పర్చేసింగ్ ఆర్డర్లు తయారుచేసి ఐఎంఎస్ బడ్జెట్‌ను శ్రీహరిబాబు దారిమళ్ళించినట్లు ఏసీబీ ఎవిడెన్స్ సేకరించింది. లెజెండ్ ఎంటర్ ప్రైజెస్ పేరుతో కొనుగోలు చేసినట్లు చూపించిన డబ్ల్యూబీసీ క్యువెటిస్, గ్లూకోజ్ క్యువెటిస్ కిట్స్ ను హెమొక్యూ కంపెనీ పేరుతో డిస్ట్రిబ్యూటర్లకు సప్లయ్ చేసినట్లు చూపారు. ఒక్కో డబ్ల్యూబీసీ క్యువెటిస్ రూ.11,800, గ్లూకోజ్ క్యువెటిస్ కిట్ రూ.1,950గా పేర్కొన్నారు. ఆ తరువాత ఒక్కో డబ్ల్యూబీసీ క్యువెటిస్ కిట్ విలువ రూ. 19,200, గ్లూకోజ్ క్యువెటిస్ కిట్ రూ.2,250 గా మార్చి పర్చేస్ ఆర్డర్స్ తయారు చేశారు.

రేట్లు పెంచి ఆర్డర్లు

లెజెండ్ ఎంటర్ ప్రైజెస్ నుంచి ఐఎంఎస్ డైరెక్టర్ పేరుతో ఒక్కో డబ్ల్యూబీసీ క్యువెటిస్ కిట్ విలువ రూ.36,800 గా పెంచేశారు. గ్లూకోజ్ క్యువెటిస్ కిట్ ను రూ.6,200లుగా చూపారు. ఇలా రూ.17,600, 3950 అదనంగాప్రిపేర్ చేసి లెజెండ్ ఎంటర్ ప్రైజెస్ నుంచి 6291 డబ్ల్యూబీసీ క్యువెటిస్ కిట్స్, హెమొక్యూ నుంచి 4500 గ్లూకోజ్ క్యువెటిస్ కిట్స్ కొనుగోలు చేసినట్లు లెక్కలు చూపారు. దీంతో 2017-18 ఐఎంఎస్ బడ్జెట్ నిధుల నుంచి డబ్ల్యూబీసీ క్యువెటిస్ కిట్స్ పేరుతో రూ.11,07,21,600, గ్లూకోజ్ క్యువెటిస్ కిట్స్ పేరుతో రూ.1,77,75,000లు ఇలా మొత్తం రూ.12,84,96,600 లను దేవికారాణి అదనంగా విడుదల చేసినట్లు ఏసీబీ గుర్తించింది.

గవర్నర్‌తో సీఎం భేటీ

మూడు గంటల పాటు సుదీర్ఘ చర్చ ■ రెండో విడత పల్లె ప్రగతి ప్రస్తావన



హైదరాబాద్, వెలుగు: సీఎం కేసీఆర్ బుధవారం గవర్నర్ తమిళిసైని కలిశారు. బొకేతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, మూడు గంటల పాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య పలు రాజకీయ, రాజకీయేతర అంశాలు చర్చకు వచ్చాయని సమాచారం. కేంద్రం తీసుకొచ్చిన సీఏఏ, ఎన్ఆర్సీలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి, రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలను గవర్నర్‌అడిగి తెలుసుకున్నారు. గత నెలలో గవర్నర్ కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. ఈ టూరు వివరాలను అడిగి తెలుసుకున్న సీఎం కేసీఆర్.. ప్రాజెక్టు విశేషాలను మరోసారి గవర్నర్‌కు వివరించారు. పల్లె ప్రగతి మంచి ఫలితాలు ఇవ్వడంతో ఈ నెల 2 నుంచి రెండో విడత చేపడుతున్నట్లు వివరించారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఇదిలా ఉండగా గవర్నర్, సీఎం సుమారు 3 గంటలు భేటీ కావడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.



సీఎంకు నేతల న్యూ ఇయర్ గ్రీటింగ్స్

కొత్త సంవత్సరం సందర్భంగా పలువురు నేతలు బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు అజయ్, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ తదితరులు కేసీఆర్‌కు గ్రీటింగ్స్ చెప్పారు. ఎంపీలు నామా, కేకే, వెంకటేశ్ నేత, రంజిత్‌రెడ్డి, సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ చక్రపాణి, విద్యా శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డితో పాటు పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, కార్పొరేషన్ల చైర్మన్లు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. విద్యా శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి హైస్కూల్ స్టూడెంట్లకు ఇచ్చే మోడల్ డిక్షనరీని సీఎంకు అందజేశారు. ఐనవోలు, యాదాద్రి దేవాలయాల క్యాలెండర్లను కేసీఆర్ ఆవిష్కరించారు.



గవర్నరమ్మా.. హ్యాపీ న్యూ ఇయర్

తమిళిసైకి ప్రముఖుల గ్రీటింగ్స్

హైదరాబాద్, వెలుగు: కొత్త సంవత్సరం సందర్భంగా గవర్నర్ తమిళిసైకి బుధవారం పలువురు ప్రముఖులు న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, బీఎస్ రాములు, బ్రహ్మకుమారి తదితరులు గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రజలకు గవర్నర్ అందుబాటులో ఉన్నారు. యువత, చిన్నారులు గవర్నర్‌ను కలిసి విషెస్ చెప్పారు.

ఎస్టీయూ టీఎస్ డైరీ ఆవిష్కరించిన గవర్నర్

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూటీఎస్) రూపొందించిన డైరీని రాజ్‌భవన్‌లో బుధవారం గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టూడెంట్లను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానందంగౌడ్, పర్వత్‌రెడ్డి, ఏవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేజీలో మంచి పనులుండాలి

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రూపొందించిన మీడియా డైరీని గవర్నర్ ఆవిష్కరించారు. డైరీలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రభుత్వ సమాచారాన్ని పరిశీలించి అభినందించారు. డైరీలోని ప్రతి పేజీలో మంచి పనులు, విజయాలు నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐజేయూ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేఖర్, విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



2020 నంబర్‌తో కండ్లద్దాలు పెట్టుకొని ఎంజాయ్ చేస్తున్న వీళ్లంతా జపాన్‌లోని నగోయాకు చెందిన అమ్మాయిలు. చదువుకోవడానికి అమెరికా వచ్చారు. న్యూయార్క్ టైమ్ స్క్వేర్ లో మంగళవారం జరిగిన న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు.



ఫొటోలో కనిపిస్తున్న బేబీలను చూశారుగా. కరెక్టుగా 2020 న్యూ ఇయర్ రోజున ప్రయాగ్ రాజ్‌లో పుట్టారీ చిన్నారులు. కొత్త దశాబ్దంలో పిల్లలను చూస్తూ వాళ్ల బంధువులు మురిసి పోతున్నప్పుడు తీశారీ ఫొటో.

గురువారం | హైదరాబాద్
02.01.2020
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

గడపగడపకూ ఎమ్మెల్యే గడియారాలు

(మొదటి పేజీ తరువాయి)

టీఆర్ఎస్ ఆశావహులు, ఎమ్మెల్యే అనుచరులు, కార్యకర్తలు బుధవారం ఎర్లీ మార్నింగ్ రంగంలోకి దిగారు. 15 వార్డుల్లో తలా కొన్ని పంచుకొని ప్రతి ఇంటి ముందు ఒక్కో క్లాక్ పెట్టొచ్చారు. అప్పటికే లేచున్న వారి చేతుల్లో పెట్టి వెళ్లారు. టీఆర్ఎస్ పట్టణ లీడర్లంతా ఈ పనిలో పాలు పంచుకున్నట్లు తెలుస్తోంది. వెయ్యి క్లాక్‌లు తక్కువ పడగా మరో దఫా పంపిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని కాంగ్రెస్, బీజేపీ లీడర్లు ఆరోపిస్తున్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మున్సిపోల్స్‌లో గెలిచేందుకు..?

పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి తర్వాత సుల్తానాబాద్ రెండో మున్సిపాలిటీ. గతంలో మేజర్ గ్రామపంచాయతీ. ప్రభుత్వం కొత్తగా మున్సిపాలిటీ హోదా ఇచ్చింది. పట్టణంలో 15 వార్డులు, సుమారు 5 వేల ఇండ్లున్నాయి. జనాభా సుమారు 20 వేలు. ఓటర్లు 15 వేలు. పంచాయతీగా ఉన్నప్పుడు కాంగ్రెస్ చేతిలో ఉంది. దీంతో సుల్తానాబాద్ పట్టణాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యతను లోకల్ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తన భుజాలపై వేసుకున్నారు.

కోడ్ ఉల్లంఘనే

ఇంటింటికీ గడియారాలు పంచి టీఆర్ఎస్ పార్టీ లీడర్లు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇలా గిప్టుల ఆశచూపి ఓట్లు పొందాలనుకుంటున్నారు. ఆ పార్టీ ఆగడాలు సాగనివ్వం. బాధ్యులపై ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలె.

- అన్నయ్యగౌడ్, మాజీ సర్పంచ్





గడియారాలు ఏం జేస్కోవాలె?

టీఆర్ఎస్ నేతలు డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామన్నరు. ఇంటింటికీ తాగునీరు ఇవ్వకుంటే ఓట్లే అడుగమన్నరు. కానీ ఎలక్షన్లు అనంగనే ఇప్పుడు ఇట్ల ఇండ్ల ముందు గడియారాలేసి పోయిన్రు. ఎన్నికలప్పుడే లీడర్లకు మాలాంటి సామాన్యులు గుర్తుకొస్తారు. అభివృద్ధి కావాలె గాని ఈ గడియారాలెందుకు?

- న్యాతరి దేవేందర్, సుల్తానాబాద్



బుధవారం గాంధీభవన్‌లో వనపర్తికి చెందిన టీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పీసీసీ చీఫ్ ఉత్తమ్. పక్కన చిన్నారెడ్డి, మల్లు రవి తదితరులు

టీఆర్ఎస్‌లోకి పోయినోళ్లు వెనక్కి రాండ్రి

- అది కుటుంబ పార్టీ.. కేసీఆర్‌ది దోపిడీ పాలన: ఉత్తమ్
- రాజకీయాలను భ్రష్టుపట్టించారు
- హామీల అమలు ఏమైంది?
- రిజర్వేషన్ల ప్రకటన, నామినేషన్స్‌కు టైమివ్వరా అని ప్రశ్న

హైదరాబాద్, వెలుగు: కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి వెళ్లినవాళ్లు వెనక్కి రావాలని పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ కుటుంబ పార్టీ అని, కేసీఆర్‌ది దోపిడీ పాలన అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ మాత్రమే బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. వనపర్తికి చెందిన టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల బుధవారం గాంధీభవన్‌లో ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని, రాజకీయాలను సీఎం కేసీఆర్ భ్రష్టుపట్టించారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ, రైతు బంధు.. ఎటుపోయాయని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలనే తాము ప్రచారాస్త్రాలుగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. "మున్సిపల్ ఎన్నికల గురించి మాట్లాడితే నాపై టీఆర్ఎస్ నేతలు పిచ్చి పిచ్చి విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ భయపడుతోందని అంటున్నారు. కాంగ్రెస్‌కు అలాంటి భయమేంలేదు. నేను ఎన్నో ఎన్నికల్లో విజయం సాధించాను. మున్సిపోల్స్‌ను ఎదుర్కోవడం మాకు సమస్య కాదు" అని ఉత్తమ్ అన్నారు. వనపర్తి టీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ నుంచి వెళ్లి తప్పు చేశానని అన్నారు. తాను టీఆర్ఎస్‌లో ఉన్న మూడేండ్లలో ఏ రోజూ సంతోషంగా లేనని చెప్పారు. టీఆర్ఎస్ పాలనలో ఏ వర్గం కూడా ఆనందంగా లేదన్నారు. పదవులు ఇస్తామని పార్టీలోకి చేర్చుకొని తర్వాత కనీసమైన విలువ కూడా ఇవ్వలేదని, అందుకే ఆ పార్టీని వీడి మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పారు. ఇతర నేతలు వెనక్కు వచ్చేయాలని ఆయన సూచించారు.

మున్సిపోల్స్‌కుW ఎందుకంత హడావుడి?

మున్సిపల్ ఎన్నికల విషయంలో అధికారులు అనవసరమైన హడావుడి చేస్తున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. రిజర్వేషన్ల ప్రకటనకు, నామినేషన్లకు మధ్య కనీసం వారం రోజుల సమయం ఇవ్వాలని ఆయన మీడియా చిట్ చాట్‌లో అన్నారు. ఈ నెల 5న రిజర్వేషన్లు ప్రకటించి, 8వ తేదీ నుంచి నామినేషన్లు వేయమంటున్నారని, ఇది సాధ్యమా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత ఆ జాబితా అంది, అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం, రిజర్వేషన్లకు అనుగుణంగా సర్దుబాట్లకు కొంత సమయం పడుతుందని ఉత్తమ్ తెలిపారు. ఎన్నికలకు తాము భయపడడం లేదని, ప్రక్రియ కరెక్టుగా ఉండాలని మాత్రం కోరుతున్నామన్నారు. రిజర్వేషన్ల ప్రకటన తర్వాత అభ్యర్థి క్యాస్ట్ సర్టిఫికెట్ కూడా తీసుకోవాల్సి ఉంటుందని ఆయన గుర్తు చేశారు. బీ ఫామ్ తీసుకొని నామినేషన్ వేసేందుకు రెండు రోజుల సమయం ఎట్ల సరిపోతుందని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ అధికార పార్టీకి అనుకూలంగా ఉందని ఉత్తమ్ ఆరోపించారు. మున్సిపల్ చట్టంలో ఎన్నికల ప్రక్రియకు తగినంత సమయం ఇవ్వకూడదని ఏమీ లేదు కదా అని అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ మాట విననందున హైకోర్టులో పిటిషన్ వేశామని చెప్పారు. అది గురువారం విచారణకు వస్తుందని వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, దేశవ్యాప్తంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పనైపోయిందంటూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని దుయ్యబట్టారు.

ఎలక్షన్ షెడ్యూల్ తప్పుల తడక

- హైకోర్టులో ఉత్తమ్ పిల్
- రీషెడ్యూల్‌చేసేలా ఆర్డర్‌ఇవ్వాలని విజ్ఞప్తి

హైదరాబాద్, వెలుగు: ఓటర్ల జాబితా సిద్ధం చేయకుండా, రిజర్వేషన్లు ప్రకటించకుండా మున్సిపల్‌ఎన్నికలకు స్టేట్ ఎలక్షన్‌కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్‌చెల్లదని టీపీసీసీ చీఫ్, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం హైకోర్టులో పిల్‌వేశారు. "ఎలక్షన్ కమిషన్ డిసెంబర్ 23న ఇచ్చిన షెడ్యూల్ చెల్లదని ఆదేశించాలి. దాన్ని రీషెడ్యూల్‌చేయాలని ఆర్డర్ ఇవ్వాలి. ముందుగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల చైర్మన్లు, వార్డు మెంబర్ల రిజర్వేషన్లు ఖరారు చేయాలి. చట్ట ప్రకారం అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించాలి. కానీ ఇవేమీ లేకుండా ఎన్నికల షెడ్యూల్‌ను హడావుడిగా విడుదల చేశారు. ఇలా చేయడం రాజ్యాంగ వ్యతిరేకం. ఇవన్నీ తేలే వరకు ఎలక్షన్‌షెడ్యూల్ అమలును నిలిపివేయాలి" అని పిల్‌లో కోరారు. "రాష్ట్రంలో 120 మున్సిపాలిటీల్లో 2,727 వార్డులు, 10 కార్పొరేషన్లలో 385 వార్డులు ఉన్నాయి. వీటిలో ఓటర్ల జాబితా సిద్ధం కాకుండానే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 22న ఎన్నికలు జరిపిస్తామని కూడా సర్కారు ప్రకటించింది. రిజర్వేషన్లు ఖరారు చేయకుండానే షెడ్యూల్ ఎలా వెల్లడిస్తారు. ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ఒక్కరోజు మాత్రమే గడువు ఇచ్చి రిజర్వేషన్లు ప్రకటిస్తామని చెప్పడం అన్యాయం. రిజర్వేషన్ల ప్రకటన తర్వాత ఆయా కేటగిరీల అభ్యర్థులు క్యాస్ట్‌సర్టిఫికెట్ తీసుకునేందుకు కూడా తగినంత గడువు ఉండేలా చూడాలి" అని పిల్‌లో పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ/ డైరెక్టర్, స్టేట్ ఎలక్షన్ కమిషన్‌లను ప్రతివాదులుగా చేర్చారు.

'ఫైర్ సేఫ్టీ'తో నుమాయిష్ షురూ

హైదరాబాద్, వెలుగు: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నుమాయిష్ ఎగ్జిబిషన్ బుధవారం మొదలైంది. హోంమంత్రి మహమూద్ అలీ, మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఈటల రాజేందర్, మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఈసారి చాలా మార్పులు జరిగాయని, భద్రత పరంగా గట్టి ఏర్పాట్లు చేశామని హోంమంత్రి చెప్పారు. సొసైటీ అధ్యక్షుడిగా ఈటల అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. ఈసారి షాపుల సంఖ్య 25 శాతం తగ్గించి భద్రతకు పెద్దపీట వేశామని, గతంలో 2,500 షాపులుంటే ఇప్పుడు 1,500 ఏర్పాటు చేశామని ఈటల తెలిపారు. దీంతో సందర్శకులు ప్రతి స్టాల్‌నూ క్షుణ్నంగా పరిశీలించేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. ఫైర్ సేఫ్టీ కోసం రూ. మూడున్నర కోట్లతో సంపులు, పైపు లైన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుండి బెంగాల్ వరకు వేలాది మంది వ్యాపారులు నుమాయిష్ కోసం ఎదురుచూస్తుంటారని, వాళ్ల ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడానికి ఎగ్జిబిషన్ మంచి వేదికని అన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన డబ్బులను 18 విద్యాసంస్థల్లో చదువుతున్న 30 వేల మంది స్టూడెంట్ల భవిష్యత్తు కోసం వాడుతున్నట్లు తెలిపారు. భద్రతపరంగా 50 సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశామని, ఎక్కడేం జరిగినా తెలుసుకోవడానికి ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ కూడా ఉందని వివరించారు. సందర్శకుల సౌకర్యం కోసం మెట్రో రైళ్లను రాత్రి 11:30 వరకు నడపడానికి అధికారులు అంగీకరించారని, ఎగ్జిబిషన్ గ్రౌండ్ లోనే టికెట్ కౌంటరూ ఏర్పాటు చేశారని చెప్పారు.



నుమాయిష్‌లో టాయ్ ట్రెయిన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని, మహమూద్ అలీ, ఈటల

మున్సిపోల్స్‌లో ఒంటరిపోరే

పట్టున్నచోటే పోటీ.. టీజేఎస్ నిర్ణయం

హైదరాబాద్, వెలుగు: ఈ నెల 22న జరగనున్న మునిసిపల్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు తెలంగాణ జనసమితి (టీజేఎస్) ప్రకటించింది. ఎక్కడెక్కడ పోటీ చేయాలి, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు పార్టీ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. వార్డుల రిజర్వేషన్లు ఖరారు కాగానే ఈ కమిటీ అభ్యర్థులను ప్రకటించనుంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ, టీడీపీతో కలిసి ప్రజాఫ్రంట్‌గా ఏర్పడిన కూటమి టీజేఎస్‌కు చేదు అనుభవాలను మిగిల్చింది. పొత్తులో భాగంగా తమకు కేటాయించిన 8 స్థానాల్లో టీజేఎస్ తన అభ్యర్థులను పోటీకి నిలిపింది. అయితే, పొత్తు ధర్మాన్ని విస్మరించి కాంగ్రెస్ పార్టీ కూడా ఆ స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. ఓట్లు చీలడంతో ఇరు పార్టీల అభ్యర్థులు ఓడిపోయారు. కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందని, సీట్ల కేటాయింపు నుంచి పోలింగ్ దాకా తమకు తీవ్ర అన్యాయం చేసిందని కోదండరాం ఆరోపించారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ టీజేఎస్ ఒంటరిగానే మూడుచోట్ల పోటీ చేసింది. మిగతా చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతిచ్చింది.

ప్లీనరీ తీర్మానం మేరకే..

గత అనుభవాల దృష్ట్యా ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోవద్దని, ఏ ఎన్నికలైనా ఒంటరిగానే పోటీ చేయాలని గతేడాది జూలై 13న జరిగిన పార్టీ ప్లీనరీలో తీర్మానించారు. ఈ తీర్మానంలో మార్పులేదని కోదండరాం వెల్లడించారు.

బీజేపీకి భయపడుతున్న కేటీఆర్

బీజేపీ నేత కృష్ణ సాగర్ రావు

హైదరాబాద్, వెలుగు: 'టీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ఒక్కటే ప్రతిపక్షం' అని కేటీఆర్ అనడం ఆయనకు బీజేపీ అంటే ఉన్న భయాన్ని ఎత్తి చూపిందని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి కృష్ణ సాగర్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర ఆఫీసులో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేవలం గాలివాటం, అదృష్టం కలిసి రావడం వల్లే గత ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలిచిందన్నారు. భావోద్వేగాలను రెచ్చగొట్టడం , మైనార్టీలను బుజ్జగించడం తప్పా ఎన్నికల్లో గెలవడానికి టీఆర్ఎస్ దగ్గర మరో వ్యూహం లేదన్నారు. టీఆర్ఎస్‌కు ఏకైక ప్రత్యామ్నాయం తామేనని స్పష్టం చేశారు. ఇప్పటికే తెలంగాణ ఓటర్లు కాంగ్రెస్‌ను లెక్కల్లోంచి తీసేశారని, ఇక వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను తిరస్కరించడం ఖాయమన్నారు.

కాంగ్రెస్ మున్సిపల్ మేనిఫెస్టో కమిటీ

హైదరాబాద్, వెలుగు: కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్‌సీ కుంతియా బుధవారం ప్రకటించారు. ఈ కమిటీకి మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డిని చైర్మన్‌గా నియమించారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్, పీసీసీ మైనార్టీ సెల్ చైర్మన్ ఎస్ఏ సోహెలి, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ ముదిరాజ్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, మెదక్ మాజీ డీసీసీబీ చైర్మన్ ఎం.జైపాల్ రెడ్డి, పాల్వాయి స్రవంతి, శ్రీరంగం సత్యం, గాలి అనిల్ కుమార్, మల్లాది పవన్‌లను సభ్యులుగా నియమించారు. ఈ నెల 4లోగా మేనిఫెస్టో సిద్ధం చేయాల్సిందిగా కమిటీకి కుంతియా సూచించారు.

నాకు నమ్మకద్రోహం చేసినోళ్లు బాగుపడరు

- ఎన్నికల ముందు ఒక తీరు.. గెలిచినంక ఇంకో తీరు
- క్యాంప్ రాజకీయాలు నాతో కాదు: మంత్రి ఈటల
- మున్సిపోల్స్ సన్నాహక మీటింగ్‌లో ఆసక్తికర కామెంట్లు

హుజూరాబాద్, వెలుగు: కొంతమంది నాయకులు ఎన్నికల ముందు ఒక తీరుగా.. గెలిచిన తరువాత ఇంకో తీరుగా ఉంటరని, నమ్మకం ద్రోహం చేసేటోళ్లు బాగుపడరని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో బుధవారం నిర్వహించిన హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల సన్నాహక మీటింగ్‌లో ఆయన ఈ ఆసక్తికర కామెంట్లు చేసిన్రు. కొంత మంది నాయకులు గెలవక ముందు ఒక తీరుగా. గెలిచిన తరువాత ఇంకో తీరుగా ఉంటరని.. ఇలాంటి వారిని గుర్తించి సరైన వారికే టిక్కెట్లు ఇద్దామన్నరు. నమ్మిన వారు మోసం చేస్తే బాధ అనిపిస్తదని.. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే వారితో మనసు గాయపడింది అన్నరు. అసోంటోళ్లకు షార్ట్‌టైమ్‌ల మేలు జరగొచ్చు... కానీ లాంగ్‌టైమ్‌లో న్యాయమే గెలుస్తదని తెలిపారు. మీలో మీరు కొట్టుకోకుంటే గెలుపు మనదే. ఎమ్మెల్యే, ఎంపీగా కంటే కౌన్సిలర్‌గా గెలుసుడు కష్టమని, నిజాయతీగా పని చేస్తే ప్రజలు పట్టం కడుతరన్నరు. ఈ సారి బీ ఫామ్స్ నేనే ఇస్త. హుజూరాబాద్, జమ్మికుంటలో తిరిగి ఓట్లు అడుగుత.. ఓట్లు అడిగే హక్కుదారుడిని నేనే అన్నరు. క్యాంప్ రాజకీయాలు నాతో కాదన్నరు. మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లలో నా ప్రమేయం ఉండదని, రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ల కేటాయింపు ఉంటుందని వివరించారు.

కసితో పట్టణాలు డెవలప్ చేశా

మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి అప్పట్లో హుజురాబాద్, జమ్మికుంట పట్టణాలకు తాగునీళ్ల కోసం ఫండ్స్ అడిగితే ఇవ్వలేదు. ఆ కసితోనే మంత్రి కాంగనే రెండు పట్టణాలకు ఒక్కోదానికి రూ.40 కోట్ల చొప్పున విడుదల చేసి తాగునీటి సమస్య పరిష్కరించిన అన్నరు. హుజూరాబాద్‌లో కాంగ్రెస్‌కు అడ్రస్ లేదని, 50 ఏండ్ల నుంచి కాంగ్రెస్‌కు ఇక్కడ తావు లేదని తెలిపారు. 'అమ్ముడు పోనిది ఆత్మ గౌరవం మాత్రమే.. ప్రజలు ధర్మం తప్పరు, అట్ల తప్పి ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేటోడిని కాదు, డబ్బులు, లిక్కర్‌కు ఓట్లు పడవు, నిజాయతీకి, పని చేసే వారికే ప్రజలు ఓటేస్తరు' అని అన్నారు.



ఈచ్ వన్ టీచ్ వన్‌కు పెన్షనర్ల సపోర్ట్

- ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ వినోద్ కుమార్‌తో మీటింగ్

హైదరాబాద్, వెలుగు: సీఎం కేసీఆర్ ఇచ్చిన 'ఈచ్ వన్ టీచ్ వన్' ప్రోగ్రామ్ కోసం స్వచ్ఛందంగా సర్వీస్ చేస్తమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ప్రకటించారు. బుధవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్‌ను కలిసి ఈ మేరకు తెలిపారు. సీఎం కేసీఆర్ పిలుపును సక్సెస్ చేసేందుకు వలంటరీగా కృషి చేస్తమని పెన్షనర్ల సంఘం ప్రకటించింది. తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నరసయ్యతో పాటు పలువురు నేతలు వినోద్ కుమార్‌తో సమావేశమయ్యారు. ఈచ్ వన్ టీచ్ వన్ ప్రోగ్రామ్ ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఊర్లు, పట్టణాలు, బస్తీల్లో 3.64 లక్షల మంది పెన్షనర్లం వలంటీర్లుగా పని చేసి కేసీఆర్‌కు అండగా ఉంటామని వినోద్ కుమార్‌కు తెలిపారు. ఎడ్యుకేషన్, హెల్త్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, సోషల్ ప్రాబ్లమ్స్‌పై పనిచేస్తామన్నారు. పెన్షనర్ల సంఘం నిర్ణయాన్ని వినోద్‌కుమార్ అభినందించారు. ఆయన్ను కలిసిన వారిలో ఇనగంటి నవనీత రావు, మహమ్మద్ రఫీ ఉద్దీన్, ఈ. శ్రవణ్ కుమార్, హెచ్. రాములు తదితరులు ఉన్నారు.

టీచర్ల సంఘం మద్దతు

సీఎం కేసీఆర్ నిర్ణయానికి రాష్ట్ర టీచర్ల సంఘం మద్దతు తెలిపింది. టీఎస్టీయూ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల బాధ్యులు బుధవారం ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్‌ను కలిసి మద్దతు తెలిపారు. తర్వాత వినోద్ కుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 'ఈచ్ వన్ టీచ్ వన్' పిలుపు మేరకు ప్రతిఒక్కరూ రాష్ట్రం 100 శాతం అక్షరాస్యత లక్ష్యాన్ని చేరుకునే విధంగా కృషిచేయాలని కోరారు.

మున్సిపల్ టికెట్ల దందా!

(మొదటి పేజీ తరువాయి)

దీంతో కొందరు పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించారు. ఆ డబ్బుతో ఇప్పుడు రాజకీయ అరంగేటం చేసేందుకు సిద్ధమయ్యారు. అధికార పార్టీ టికెట్ దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ కొత్తగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 10 మున్సి పాల్టీలు ఏర్పడ్డాయి. ఇక్కడ్నించి పోటీ చేసేందుకు పెద్ద పెద్ద రియల్టర్లు రెడీగా ఉన్నారు. వాళ్లు టికెట్ కోసం స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కార్పొరేటర్ లేదా కౌన్సిలర్ టికెట్ ఇస్తే కోటి నుంచి కోటిన్నర వరకు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిసింది. మేయర్ లేదా చైర్మన్ పదవి ఇచ్చేందుకు ఒప్పుకుంటే మరింత డబ్బు ముట్టజెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలను, మంత్రులను మచ్చిక చేసుకునేందుకు టికెట్ ఆశించే రియల్టర్లు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల సన్నిహితుల వద్దకు వెళ్లి తమ మనసులోని మాటను బయటపెడుతున్నారు. జిల్లా కేంద్రాల మున్సిపాలిటీల్లో కౌన్సిలర్ టికెట్ కోసం మాత్రం రూ. 50 లక్షలు ఆఫర్ జేస్తున్నట్లు తెలుస్తోంది.

లేదంటే.. రెబల్‌గా

ఇప్పుడు టికెట్ రాకపోతే మళ్లీ ఐదేండ్ల వరకు వేచి చూడాల్సి వస్తుందని, అప్పటివరకు ఓపిక లేదని, ఇప్పుడే అధికార పార్టీ టికెట్ దక్కించుకోవాలని రియల్టర్లు, వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. టికెట్ ఇవ్వకపోతే రెబల్ గా నిలబడుతామని కొందరు రియల్టర్లు బెదరింపులకు దిగుతున్నట్లు సమాచారం. తమ దగ్గర రియల్ దందాలో సంపాదించిన డబ్బు ఉండటంతో ఎట్లయినా గెలుస్తామని కొందరు భావిస్తుంటే.. మరికొందరు గెలవకపోయినా పర్వాలేదని అంటున్నారు. టికెట్ కోసం బెదిరింపులకు కూడా దిగుతున్నారని ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే సన్నిహితుడు చెప్పారు. 'మొన్నటి వరకు మాతో కలిసి తిరిగిండు. ఇప్పుడు టికెట్ ఇవ్వకపోతే.. రెబల్ గా నిలపడుతా అంటున్నడు. గెలవకున్నా పర్లేదంటున్నడు. మా అభ్యర్థిని ఓడిస్తా అంటున్నడు' అని ఆయన వివరించారు.

ఖర్చు మీరే పెట్టుకోండి

మున్సిపోల్స్ లో అభ్యర్థుల ఎంపిక, గెలుపు బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలకు టీఆర్ఎస్ హైకమాండ్ అప్పగించింది. ఎన్నికల ఖర్చులను అడుగొద్దనే కండిషన్ కూడా పెట్టినట్టు తెలిసింది. దీంతో కొందరు ఎమ్మెల్యేలు డబ్బులు ఉన్న నేతలను గుర్తించి టికెట్ ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. టికెట్ ఇచ్చే బాధ్యత తమదేనని, అందుకు రూ. 50 లక్షల దాకా ఖర్చవుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న రియల్టర్‌కు కండిషన్ పెట్టారు.




☰ క్విక్ బైట్స్



రాష్ట్రంలో అందరికీ ‘అ ఆ’లు రావాలి

హైదరాబాద్, వెలుగు: సీఎం కేసీఆర్ ఇచ్చిన ‘ఈచ్ వన్.. టీచ్ వన్’ నినాదం నేపథ్యంలో స్టూడెంట్ల డ్రాపౌట్స్ తగ్గించి, 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు సహకారం అందించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోరారు. టీజీజేఎంఎ సభ్యులు, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీశ్ బుధవారం హైదరాబాద్ లో మంత్రిని కలిసి, పలు అంశాలపై చర్చించారు. ఇంటర్మీడియట్ విద్యలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూనియన్ తరపున తోడ్పాటునందించాలని మంత్రి సబిత వారికి సూచించారు. మంత్రిని కలిసినవారిలో విష్ణువర్ధన్ రెడ్డి, తిప్పారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు ఉన్నారు.



స్టూడెంట్లను తీర్చిదిద్దే బాధ్యత టీచర్లదే

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణలో చుక్కా రామయ్య

హైదరాబాద్, వెలుగు: టీఎస్ యూటీఎఫ్ రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను బుధవారం ఆ సంఘం కార్యాలయంలో విద్యావేత్త చుక్కా రామయ్య, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఆవిష్కరించారు. యూటీఎఫ్ డైరీ.. టీచర్లకు, ఉద్యమ కార్యకర్తలకు కరదీపికలాంటిదని చుక్కా రామయ్య అన్నారు. ఇప్పుడున్న సామాజిక పరిస్థితుల్లో రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించి అందుకనుగుణంగా స్టూడెంట్లను తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపైనే ఉందన్నారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. 2018, 2019 సంవత్సరాలు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు కాకుండానే గడిచిపోయాయన్నారు. కనీసం 2020లో అయినా సీఎం తన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జంగయ్య, చావ రవి, కొండల్‌రావు, ఆంజనేయులు, గాలయ్య, శారద పాల్గొన్నారు.

పంజగుట్ట పీఎస్ ఎదుట

పెట్రోల్ పోసుకున్న మహిళ మృతి

హైదరాబాద్ (ఖైరతాబాద్), వెలుగు: పంజగుట్ట పీఎస్ఎదుట ఆత్మహత్యయత్నం చేసిన లోకేశ్వరి (37) బుధవారం మృతి చెందింది. ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి తనను మానసికంగా, ఆర్థికంగా హింసించాడని చెన్నైకి చెందిన లోకేశ్వరి మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పంజగుట్ట పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్య యత్నం చేసింది. ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. ఆమె శరీరం దాదాపు 70 శాతం కాలిపోగా పంజగుట్ట పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో లోకేశ్వరి బుధవారం ఉదయం కన్నుమూసింది.



సంక్రాంతికి స్పెషల్ ట్రైన్స్

హైదరాబాద్, వెలుగు: సంక్రాంతి పండుగకు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ మార్గాలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. సికింద్రాబాద్ కాకినాడ టౌన్‌కు రెండు సర్వీసులు, కాకినాడటౌన్ సికింద్రాబాద్‌కు ఒక సర్వీస్, రెండు సువిధ స్పెషల్ సర్వీసులు నడపనున్నట్లు చెప్పింది. సికింద్రాబాద్ నర్సాపూర్ రూట్లో 5 సర్వీసులను నడపనున్నట్లు తెలిపింది.

పల్లె ప్రగతిలో

ఏ రోజు ఏం చేస్తరు?

హైదరాబాద్, వెలుగు:

సర్కార్ చేపడుతున్న రెండో దశ పల్లె ప్రగతి గురువారం మొదలైతున్నది. గురువారం నుంచి 11వ తేదీ వరకు ఇది కొనసాగనుంది. గతేడాది సెప్టెంబర్‌లో చేపట్టిన యాక్షన్ ప్లాన్‌లో చేపట్టిన పనులను కొనసాగించి పూర్తి చేయాలని పీఆర్ కమిషనర్ రఘునందన్ రావు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చిన్రు. కలెక్టర్లు, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లకు ఈ ఆర్డర్లు అందాయి. పల్లె ప్రగతిలో టార్గెట్లను వాటిలో వివరించారు. అంతకు ముందే డిసెంబర్ 31న, జనవరి 1న సర్పంచ్‌లు, వార్డు, కో ఆప్షన్ సభ్యులు ఊర్లలలో కాలినడకన తిరిగి సమస్యలు గుర్తించిన్రు. వీటిని పల్లె ప్రగతిలో పరిష్కరించాలని ప్లాన్లు చేస్తున్నరు. చేపట్టిన పనులపై రిపోర్ట్ రెడీ చేయాలని ఆర్డర్లలో పేర్కొన్నరు. ప్రోగ్రామ్ అయిపోయినంక ఏ రోజు ఏ పనులు చేపట్టారో రిపోర్ట్ రెడీ చేసి ఎంపీడీవోలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లు ఆదేశించారు.



- 11వ తేదీ వరకు ప్రోగ్రామ్
- షెడ్యూల్‌పై ఆఫీసర్లకు ఇప్పటికే ఆర్డర్లు

జనవరి 1న

- గ్రామాన్ని శుభ్రంగా ఉంచే పనులు చేపట్టాలి
- పచ్చదనం పెంచేలా కార్యక్రమం చేపట్టడం
- డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు నిర్వహించుట
- ఒక రోజు పూర్తిగా శ్రమదానం చేపట్టాలి
- విరాళాలు ఇచ్చే దాతలను ఎంకరేజ్ చేయాలి.

జనవరి 2న

- అధికారుతో గ్రామసభ నిర్వహించాలి.
- 30 రోజుల ప్లాన్‌లో చేసిన పనులు, ఖర్చయిన నిధులు వెల్లడించాలి.
- ఏప్రిల్ 2019 నుంచి డిసెంబర్ 2019 వరకు ప్రభుత్వం నుంచి వచ్చి ఫండ్స్, వసూలైన పన్నులు, ఆదాయ వ్యయాలు తెలపాలి.
- పంచాయతీల్లో దాతలను గుర్తించాలి.

జనవరి 3, 4వ తేదీలు

- పాడుబడిన ఇండ్లు, కొట్టాలు, సర్కార్ తుమ్మలు, జిల్లేడు చెట్లు తొలగించాలి.
- పాత బావులు, వాడని బోర్లు, నీటిగుంతలను పూడ్చి వేయాలి.
- ఖాళీ స్థలాల్లో చెత్త చెదారం ఉంటే తొలగించాలని ఓనర్లకు నోటీసు ఇవ్వాలి, లేకుంటే ఫైన్ వేయాలి.

జనవరి 5, 6 తేదీలు

- ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించాలి
- డ్రైనేజ్‌లు శుభ్రం చేసి, మురికి కాల్వల్లో చెత్త తొలగించి.. దోమల మందు స్ప్రే చేయాలి
- రోడ్లపై గుంతలు పూడ్చాలి
- ప్లాస్టిక్ సీసాలు, పేపర్లను సేకరించి విడదీయాలి

జనవరి 7న

- శ్రమదానంతో బడులు, దవాఖానాలు, ప్రభుత్వ ఆఫీసులు, సంతలు, మార్కెట్లలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

జనవరి 8న

- డంపింగ్ యార్డు జాగా చూసి, నిర్మించాలి.
- వైకుంఠధామాలకు జాగా గుర్తించి నిర్మించాలి.

జనవరి 9న

- నర్సరీ ఏర్పాటు చేయాలి, చుట్టూ ఫెన్సింగ్, బోర్డు ఉండాలి.
- గ్రామంలో, ఊరు బయట ఖాళీ జాగాల్లో మొక్కలు నాటాలి
- పంచాయతీ బడ్జెట్‌లో 10 శాతం పచ్చదనం పెంచేందుకు ఖర్చువెట్టాలి
- నాటిన మొక్కల్లో 85 శాతం బతికేలా చూడాలి

జనవరి 10న

- పవర్ వీక్‌లో మిగిలిన పనులు పూర్తి చేయాలి
- వదులుగా ఉన్న కరెంట్ వైర్లు సరిచేయాలి
- వంగిన, తుప్పు పట్టిన స్తంభాలు మార్చాలి.
- ఎల్ఈడీ బల్బులు అమర్చాలి, వీధి లైట్ల కోసం సపరేట్ మీటర్, స్విచ్‌లు బిగించాలి
- పగలు వీధి లైట్లు వెలగకుండా చర్యలు చేపట్టాలి

జనవరి 11న

- చివరి రోజు ముగింపు గ్రామ సభ నిర్వహించాలి
- విరాళాలు ఇచ్చిన దాతలను సన్మానించాలి
- పది రోజుల్లో చేసిన పనులపై సమీక్షించి, ఇకపై ప్రతి రోజు ఈ పనులు జరిగేలా చూడాలి.



- ఉద్యోగులు, పేదల ఇబ్బందులు
- ఆరోగ్యశ్రీ ప్యాకేజీలపై మళ్లీ పాత పాటే
- ‘సమ్మె విరమణ’ హామీలు నెరవేర్చని సర్కార్
- పెండింగ్‌లో ఈహెచ్ఎస్ ఫండ్స్

కమిటీ ఎయ్యలె.. పైసలూ ఇయ్యలె

మళ్లీ రూ.500 కోట్లు దాటిన బకాయిలు

హైదరాబాద్, వెలుగు:

ఆరోగ్యశ్రీ బకాయిలు మళ్లీ పేరుకుపోతున్నాయి. నెట్‌వర్క్ హాస్పిటళ్లకు నెల నెల బిల్లులు చెల్లిస్తామన్న ప్రభుత్వ హామీ అమలు కావట్లేదు. నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె తర్వాత కొన్ని నిధులను విడుదల చేసిన సర్కారు, తర్వాత మళ్లీ పాత పాటే మొదలుపెట్టింది. దీంతో హాస్పిటళ్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.500 కోట్లు దాటాయి. దీంతో ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) పేషెంట్లను ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటళ్లు చిన్నచూపు చూస్తున్నాయి. ఆ చిన్నచూపును తట్టుకోలేకే నెలనెలా తమ జీతాల్లో కొంత మొత్తం కంట్రిబ్యూట్ చేసేందుకు ఉద్యోగులు ముందుకొచ్చినా, దాన్ని కూడా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఇక ఆస్పత్రుల సమ్మె విరమణ టైంలో సర్కారు ఇచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోవట్లేదు. ప్యాకేజీల పెంపు, దవాఖానలు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు మధ్య ఉన్న ఒప్పందాన్ని సరళీకరించడం, పదేండ్ల కిందటి ప్యాకేజీలను సవరించడం వంటి హామీలపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

ఈహెచ్ఎస్ కంట్రిబ్యూషన్ ఊసేది?

ప్రభుత్వం టైంకు డబ్బులు విడుదల చేయకపోవడంతో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు పోతున్న ఉద్యోగులకూ చుక్కెదురవుతోంది. ఆరోగ్యశ్రీ పేషెంట్ల మాదిరిగానే వారినీ చిన్నచూపు చూస్తున్నారు. దీంతో చాలా మంది ఉద్యోగులు సొంత డబ్బులతో ట్రీట్‌మెంట్ చేయించుకోవడానికే ఇష్టపడుతున్నారు. రెగ్యులర్ గా హాస్పిటళ్లకు బకాయిలు చెల్లిస్తే ఈ సమస్య ఉండదని భావించి, తమ జీతాల్లో నెలకు కొంత ఈహెచ్ఎస్ స్కీమ్‌కు కంట్రిబ్యూట్ చేయాలని ఉద్యోగులు నిర్ణయించుకున్నారు. ప్రభుత్వానికి ఇప్పటికే చాలా సార్లు వినతిపత్రాలూ ఇచ్చారు. అయితే, ఉద్యోగుల నుంచి పైసలు తీసుకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తొలుత భావించినప్పటికీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కంట్రిబ్యూషన్‌కు ఒప్పుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఫైల్ సీఎం కేసీఆర్ వద్దే పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. అయితే, ప్రభుత్వ తీరుతో రోగుల వద్ద చెడ్డపేరు వస్తోందని ఇటు హాస్పిటళ్లూ వాపోతున్నాయి. ఆరోగ్యశ్రీ పేషెంట్లను వద్దనలేక, మనస్ఫూర్తిగా చేర్చుకోలేక ఇబ్బంది పడుతున్నామని ఓ హాస్పిటల్ యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నప్పటికీ, అందులో సగం మంది కూడా ఈ పథకం కింద లబ్ధి పొందడం లేదని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. పథకంలో చాలా మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు.

ప్యాకేజీల కమిటీ ఏమాయె?

“ఆరోగ్య శ్రీ ట్రస్ట్‌తో హాస్పిటళ్లకు ఉన్న ఎంవోయూ వందల పేజీలతో గందరగోళంగా ఉంది. దీన్ని సరళీకరించేందుకు త్వరలోనే కమిటీ వేస్తాం. వైద్య సేవల ప్యాకేజీలనూ సమీక్షిస్తాం. ప్రతినెలా నిధులు విడుదల చేస్తాం. అటు హాస్పిటళ్లకు, ఇటు రోగులకు ఇబ్బందులు లేకుండా ఆరోగ్యశ్రీని ముందుకు తీసుకెళ్తాం”.. ఆగస్టులో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటళ్ల సమ్మె విరమణ సందర్భంగా మంత్రి ఈటల రాజేందర్ చెప్పిన మాటలివి. 4 నెలలు గడుస్తున్నా ఇందులో ఒక్కటి కూడా నెరవేర్చే దిశగా, అడుగులు పడలేదు. పదేండ్ల కిందటి ప్యాకేజీలకే ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటళ్లు ట్రీట్‌మెంట్ చేస్తున్నాయి. ఆ ప్యాకేజీలను ప్రస్తుత ధరలకు తగ్గట్టు సవరించాలని ప్రైవేటు హాస్పిటళ్లు ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. ప్యాకేజీ కమిటీ వేస్తామని ఈటల రాజేందర్ చెప్పినా, ఇప్పటికీ దాని ఊసే లేదు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు 3,148

వెలుగు నెట్‌వర్క్:

- గ్రేటర్ హైదరాబాద్‌లో 2,100 కేసులు.. ఒక్క మాదాపూర్‌లోనే 233
- సైబరాబాద్ లో పట్టుబడ్డ ఇద్దరు మహిళలు
- రాష్ట్రవ్యాప్తంగా 239 ప్రాంతాల్లో పోలీసుల స్పెషల్ డ్రైవ్
- న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో గొడవలు.. ఏపీలో ముగ్గురు స్టూడెంట్లు మృతి

న్యూ ఇయర్ సందర్భంగా ఫుల్లుగా తాగి వెహికల్స్ నడుపుతున్న మందుబాబులు భారీగా పట్టుబడ్డారు. డ్రంకెన్ డ్రైవర్లకు చెక్ పెట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు నిర్వహించిన చెకింగ్ లో 3,148 కేసులు నమోదయ్యాయి. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఒక్క మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే 233 కేసులు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 239 ప్రాంతాల్లో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సైబరాబాద్ లో డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ ఇద్దరు మహిళలు పట్టుబడ్డారు.

గ్రేటర్‌లో 2,100

రాష్ట్రంలో నమోదైన కేసుల్లో మాదాపూర్ లోనే ఎక్కువ ఉన్నాయి. కూకట్ పల్లిలో 134, తిరుమలగిరిలో 114 సహా మొత్తంగా గ్రేటర్ లోని మూడు కమిషనరేట్లలో 2,100 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత నల్గొండలో 152, కరీంనగర్‌లో 148, వరంగల్‌లో 116, సిద్దిపేటలో 99 కేసులు రిజిస్టర్ అయ్యాయి. అతి తక్కువగా నారాయణ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే ఒక్క కేసు నమోదైంది.

యువకులను చితకబాదిన పోలీసులు

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో యువకులను పోలీసులు చితకబాదారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి సిరిసిల్లలో ఓ పెట్రోల్ బంక్ వద్ద మద్యం మత్తులో కొందరు యువకులు గొడవ పడుతున్నట్లు ఫోన్ వచ్చిందని, పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువర్గాలను చెదరగొట్టారని తెలిసింది. గొడవకు సంబంధించి సోను అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటనర్సయ్య పేర్కొన్నారు. బైక్‌ను సీజ్ చేశామన్నారు. పోలీసులతో దెబ్బలు తిన్న యువకుల వివరాలు బయటికి రాలేదు. ఘటనపై విచారణ జరుపుతున్నామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు.

నిర్మాత నట్టి కుమార్ కొడుకు అరెస్టు.. గొడవ

హైదరాబాద్‌లోని బేగంపేట కంట్రీ క్లబ్‌లో మంగళవారం రాత్రి హైడ్రామా జరిగింది. సినీ నిర్మాత నట్టి కుమార్ కొడుకు క్రాంతిపై పోలీసులు దాడి చేశారు. ‘బ్యూటిఫుల్’ సినిమా ప్రమోషన్‌ను కంట్రీ క్లబ్ లో నిర్వహిస్తామని ఈవెంట్ మేనేజర్ సుమన్ చెప్పాడని, కానీ ప్రమోషన్ చేయలేదని క్రాంతి ఆరోపించారు. ఈ విషయమై సుమన్‌ను కలిసేందుకు కంట్రీక్లబ్ లోకి వెళ్లాలని ప్రయత్నించిన తమను అడ్డుకున్నారని, పార్కింగ్ చేస్తామని కారు కీస్ తీసుకుని ఇవ్వకపోవడంతో డయల్ 100కు ఫోన్ చేశానని చెప్పారు. కంట్రీక్లబ్ దగ్గరకు చేరుకున్న పంజాగుట్ట పోలీసులు.. ‘కారు కనబడకపోతే మాకు ఫోన్ చేస్తావా’ అంటూ తనపై దాడి చేశారని తెలిపారు. తర్వాత క్రాంతిని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కి తీసుకువెళ్లారు. తన కొడుకును పోలీసులు కొట్టారని, గొంతు నులిమి, మెడ, ముఖంపై కొట్టారని నట్టి కుమార్ పంజగుట్ట పోలీస్‌స్టేషన్ లో బుధవారం తెల్లవారుజామున వాగ్వాదానికి దిగారు. తర్వాత పోలీసులు క్షమాపణలు చెప్పారన్నారు. ఈ ఈవెంట్ కు డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ కూడా రావాల్సి ఉందని, డబ్బు తీసుకున్న ఈవెంట్ నిర్వాహకులు తమను మోసం చేశారని ఆరోపించారు. ఈవెంట్ ఆర్గనైజర్ సుమన్ పై కేసు పెట్టాలని నట్టి డిమాండ్ చేశారు. మరోవైపు తమ డ్యూటీకి ఆటంకం కలిగించాడని నట్టి క్రాంతి కుమార్ పై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏపీలో ముగ్గురు స్టూడెంట్ల మృతి

ఏపీలోని నెల్లూరు జిల్లాలో విషాదం జరిగింది. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా సముద్రంలో స్నానానికి దిగి, అలల ధాటికి కొట్టుకుపోయి ముగ్గురు స్టూడెంట్లు చనిపోయారు. మంగళవారం రాత్రి వాకాడు మండలం తూపిలిపాలెం దగ్గర సముద్రతీరంలో ఇద్దరు యువతులు, ముగ్గురు యువకులు కలిసి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ చేసుకున్నారు. కేక్ కట్ చేసిన తర్వాత నలుగురు సరదాగా సముద్రంలోకి వెళ్లారు. అలలు ఉధృతంగా ఉండటంతో కొట్టుకుపోయారు. ఇద్దరు యువతులు, ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు ప్రాణాలతో తీరానికి కొట్టుకువచ్చాడు. మృతులు తిరుపతిలోని జీవకోనకు చెందిన సోనియా, సోనీ, చంద్రగా గుర్తించారు. మధు ప్రాణాలతో బయటపడ్డాడు.



మంగళవారం రాత్రి అసెంబ్లీ దగ్గర డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీస్

ఢిల్లీలో ట్రాఫిక్ జామ్

న్యూ ఇయర్ వేడుకల్లో ఢిల్లీ మునిగిపోయింది. ఢిల్లీతోపాటు సరిహద్దు రాష్ట్రాలు హర్యానా, యూపీ ప్రజలు పెద్ద సంఖ్యల్లో ఇండియా గేట్ కు చేరుకోవడంతో సెంట్రల్ ఢిల్లీ పూర్తిగా స్తంభించింది. దీంతో సెంట్రల్ సెక్రటేరియట్, ఉద్యోగ్ భవన్, ప్రగతి భవన్, ఖాన్ మార్కెట్, మండి హౌజ్ మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేశారు. ట్రాఫిక్ ను కంట్రోల్ చేయలేక పోలీసులు చేతులెత్తేశారు. రేడియోలు, ట్విట్టర్ ద్వారా ట్రాఫిక్ ను దారి మళ్లించారు. బుధవారం లక్ష మంది పైగా సందర్శకులు ఇండియా గేట్ ను సందర్శించినట్లు అధికారులు చెబుతున్నారు.

నలుగురికి కత్తిపోట్లు

న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌లో జరిగిన గొడవల్లో నలుగురు కత్తిపోట్లకు గురయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో ముగ్గురు, సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచలో ఒకరిపై కొందరు కత్తులతో దాడి చేశారు. ఉట్నూరు లోని బోయవాడకు చెందిన కాలేరి రాజశేఖర్, గుమ్ముల రాజు, నైనేని రాజులతోపాటు మరి కొందరు మంగళవారం అర్ధరాత్రి సంబురాలు చేసుకుంటున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఎన్.సాగర్, లక్ష్మణ్, ఉపేందర్, రాకేశ్ లతో వీరికి గొడవ జరిగింది. కత్తులతో దాడి చేయడంతో రాజశేఖర్, గుమ్ముల రాజు, నైనేని రాజులకు గాయాలయ్యాయి. సిద్దిపేట జిల్లా రామంచకు చెందిన బోదాసు మల్లేశం, రఘు, రాజేందర్, శ్రీకాంత్, సంజు, సాయికుమార్ మంగళవారం రాత్రి గ్రామ చావిడి వద్ద పాటలు పాడుకుంటున్నారు. చింటూ, అంజీలు అక్కడికి చేరుకుని డ్యాన్స్ చేయవద్దని మందలించారు. దీంతో గొడవ జరిగింది. ఈ క్రమంలో మల్లేశంపై చింటూ, అంజీలు కత్తులతో దాడి చేశారు. గాయపడ్డ వారిని ఆస్పత్రులకు తరలించారు.



హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ చేయించుకుంటున్న రాజశేఖర్, గుమ్ముల రాజు

3 రోజుల్లో 498 కోట్లు తాగేసిన్రు

31న రూ. 158 కోట్ల మద్యం అమ్మకాలు

హైదరాబాద్, వెలుగు: న్యూ ఇయర్ వేడుకలు రాష్ట్ర ఆబ్కారీ శాఖకు కాసుల పంట పండించినయ్. డిసెంబర్ 30 నుంచి జనవరి ఒకటి వరకు 3 రోజుల్లో రూ. 498 కోట్ల అమ్మకాలు జరిగినట్లు తెలిసింది. సాధారణంగా రోజుకు సగటున రూ.60 కోట్ల మందు అమ్ముడవుతుండగా డిసెంబర్ 30న రూ. 250 కోట్లు, 31న రూ. 158.33 కోట్లు, ఈ నెల ఒకటిన 90 కోట్ల దాకా అమ్ముడైనట్టు సమాచారం. డిసెంబర్ 31న 1,91,900 కేసుల లిక్కర్.. 2,13,269 కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. డిసెంబర్ నెలలో 2,042.33 కోట్ల అమ్మకాలు జరిగాయి. ఇందులో 30,83,204 కేసుల లిక్కర్.. 35,03,707 కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. డిసెంబర్‌లో ఇండియన్ మేడ్ లిక్కర్ అమ్మకాలు తగ్గాయి. 2018 డిసెంబర్‌లో 39 లక్షల కేసుల లిక్కర్ అమ్మకాలు జరగ్గా 2019 డిసెంబర్‌లో 35 లక్షల కేసులే అమ్ముడుపోయాయి. మందు రేట్లు పెరగడమే దీనికి కారణమని తెలుస్తోంది. రేట్లు పెరిగినా ఆదాయం మాత్రం తగ్గలేదు.

బీసీలకు 34% రిజర్వేషన్లు ఎందుకియ్యరు?


14 బీసీ సంఘాలతో సమావేశంలో ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, వెలుగు: వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని, లేకపోతే సుప్రీం కోర్టుకు వెళ్లయినా హక్కులు సాధించుకుంటామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్ లో 14 బీసీ సంఘాల సమావేశం జరిగింది. పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ఏపీలో 34 శాతం, కర్ణాటకలో 36, తమిళనాడులో 50 , మహారాష్ట్రలో 48 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నరని, ఇక్కడ ఎందుకు చేయరని కృష్ణయ్య ప్రశ్నించారు. గతంలో మొదట రిజర్వేషన్ స్థానాలు ప్రకటించి, అభ్యంతరాలు తీసుకుని సరిచేసిన తర్వాతే నోటిఫికేషన్ ఇచ్చేటోళ్లని, బీసీలు ఎదగకుండా చేయడానికే ప్రభుత్వం ఇట్లా చేసిందని ఆరోపించారు. కేంద్రం ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టిన తర్వాతే రిజర్వేషన్ల గరిష్ట పరిమితి 60 శాతానికి చేరుకుందని, దీనివల్ల గతంలో ఉన్న 50శాతం గరిష్ట పరిమితి తొలగిపోయిందన్నారు. ప్రభుత్వ తీరుపై ఊరూ వాడా ప్రచారం చేస్తామన్నారు.


జమ్మూ..



పూరీ..



అమృత్‌సర్..



న్యూ ఇయర్ తొలి రోజైన బుధవారంనాడు దేశంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటికిటలాడాయి. భారీగా మంచు కురుస్తున్నా లెక్కచేయకుండా అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్‌కు సిక్కులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. జమ్మూలోని కాళీమాత దేవాలయానికి భక్తులు క్యూ కట్టారు. పూరిలోని జగన్నాథుడి దర్శనం కోసం వేలాదిగా తరలివచ్చారు.

రెండు ఆవులు, ఒక దూడ

ఇవీ ఏడాదిలో బీహార్ సీఎంకు పెరిగిన ఆస్తులు

- నితీశ్‌కంటే మినిస్టర్లే ధనవంతులు
- లేటెస్ట్ రిపోర్ట్‌లో వెల్లడి

న్యూఢిల్లీ: ఏడాదిగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ స్థిరాస్తుల్లో పెరుగుదల లేదట. చరాస్తుల్లో మాత్రం కొంచెం పెరుగుదల ఉందట. పెరిగిన ఆస్తులు కూడా పశుసంపదేనట. పోయిన ఏడాది ఆయన దగ్గర 8 ఆవులు, 6 దూడలు ఉంటే...ఈ ఏడాది ఆవులు 10, దూడ లు 7కి ఉన్నాయట. ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల ఆస్తుల స్టేట్‌మెంట్‌లో ఈ విషయం వెల్లడైంది. కొన్నేళ్లుగా కేబినెట్ మంత్రులతోపాటు సీఎం ఆస్తిపాస్తుల వివరాలను నితీశ్‌కుమార్ వెల్లడిస్తున్నారు. 2011 నుంచి ఈ లిస్ట్ గవర్నమెంట్ వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. లేటెస్ట్ రిపోర్ట్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ముఖ్యమంత్రి కన్నా కేబినెట్ మంత్రులే ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్నారని ఆ రిపోర్ట్ తెలిపింది.

- సీఎం ఆస్తుల వి షయానికి వస్తే.. ఆయన పశువులశాలలోని పశువులు మాత్రం గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది పెరిగాయి. పోయిన ఏడాది ఆయన దగ్గర 8 ఆవులు, 6 దూడలు ఉండేవి. ఈ ఏడాది ఆవులు 10, దూడలు 7 ఉన్నట్టు రిపోర్ట్ తెలిపింది.
- నితీశ్ మంత్రుల్లో సురేశ్ శర్మ 9 కోట్లతో ఎక్కువ ధనవంతుడుగా ఉన్నారు. నీరజ్ కుమార్‌కు అ తి తక్కువ ఆస్తులున్నాయి. ఆయన దగ్గర 35.87 లక్షల క్యాష్ మాత్రమే ఉంది.
- ముఖ్యమంత్రి నితీశ్ కొడుకు చరాస్తుల విలువ సుమారు కోటీ 39 లక్షలు కాగా, స్థిరాస్తుల విలువ సుమారు కోటీ 48 లక్షలున్నట్టు రిపోర్ట్ తెలిపింది. ఈ ఆస్తులన్నీ తల్లి ద్వారా ఆయనకు వచ్చినవే అని రిపోర్ట్ వెల్లడించింది. నితీశ్‌కుమార్ భార్య గవర్నమెంట్ స్కూల్లో టీచర్‌గా పనిచేసి చనిపోయారు. డిప్యూటీ ముఖ్యమంత్రి సుశీల్ మోడీ ఆస్తులు కోటీ 26 లక్షలు. ఆయన భార్యకు కోటీ 65 లక్షల ఆస్తులున్నాయి.

నితీశ్‌కుమార్ ఆస్తులు

క్యాష్:	పోయిన ఏడాది క్యాష్:	చరాస్తుల విలువ:	స్థిరస్తులు:
రూ.38,039	రూ. 42 వేలు	రూ. 16 లక్షలు	40 లక్షలు



నో పాలిటిక్స్..

రాజకీయాలకు దూరంగా ఉంటం: జనరల్ రావత్.. సేనాధిపతిగా ప్రమాణం

- కేంద్రం ఆదేశాల ప్రకారమే పని చేస్తం
- ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీల సేవలను కలిపి అందిస్తం



దళాల నుంచి గార్డ్ ఆఫ్ ఆనర్ స్వీకరిస్తున్న రావత్

న్యూఢిల్లీ: తాము రాజకీయాలకు దూరంగా ఉంటామని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే పని చేస్తామని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ అన్నారు. ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీల సేవలను కలిపి అందించేందుకు, ఒక జట్టుగా పని చేసేందుకు దృష్టిపెడతామని చెప్పారు. బుధవారం సీడీఎస్ చీఫ్‌గా రావత్ బాధ్యతలు చేపట్టారు. త్రివిధ దళాల నుంచి గార్డ్ ఆఫ్ ఆనర్ స్వీకరించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ, 'ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఒక టీమ్ లాగా పని చేస్తాయని నేను హామీ ఇస్తున్నా. ఈ మూడింటిపై సీడీఎస్ కంట్రోల్ ఉంటుంది. అయితే ఎలాంటి చర్యలైనా టీమ్ వర్క్ ద్వారానే జరుగుతాయి" అని వివరించారు. ఆర్మీ పొలిటికలైజ్ అయిపోతోందన్న విమర్శలపైనా, సీడీఎస్ పోస్టు క్రియేట్ చేయడంపై కాంగ్రెస్ ప్రశ్నలపైనా రావత్ స్పందించారు. "మేం పాలిటిక్స్‌కు దూరంగా ఉంటాం. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా దాని మార్గదర్శకాల ప్రకారమే పని చేస్తాం" అని స్పష్టం చేశారు.

1+1+1= 3 కాదు..

"ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లను ఇంటిగ్రేట్ చేయడమే చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ పని. త్రివిధ దళాల సామర్థ్యాన్ని పెంచేందుకు మేం కృషి చేస్తాం. సీడీఎస్ తన ఆదేశాల మేరకు సిస్టమ్‌ను నడిపేందుకు ప్రయత్నించరు. ఇంటిగ్రేషన్ అవసరం. 1+1+1(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్)= 3 కాదు. మూడూ కలిస్తే బలం 5 లేదా 7కు చేరుతుందని భావించాలి. సమష్టితత్వం, సమగ్రత ద్వారా ఎక్కువ సాధించాలి. ఇది సీడీఎస్ లక్ష్యం" అని వివరించారు. పీఓకేపై త్రివిధ దళాలతో కలిసి ఏమైనా ప్లాన్ చేస్తున్నారా అని మీడియా ప్రశ్నించగా.. "మా ప్లాన్స్‌ను బయటికి చెప్పలేం. దానిపై స్పందించడం నాకు ఇష్టం లేదు" అని చెప్పారు.

తల భారం తగ్గింది..

"నా తలపై భారం తగ్గినట్లుగా అనిపిస్తోంది. ఎందుకంటే 41 ఏళ్లుగా ధరించిన గోర్ఖా టోపీని పెట్టుకోలేదు. ఇప్పుడు నేను పెట్టుకున్న టోపీ సీడీఎస్ అనుసరించబోయే తటస్థ వైఖరిని ప్రతిబింబిస్తోంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లతో సీడీఎస్ ఒకే విధంగా వ్యవహరిస్తారు" అని రావత్ వివరించారు. ఆర్మీ చీఫ్ పదవి నుంచి రిటైరైన రావత్... తొలి సీడీఎస్‌గా సోమవారం నియమితులయ్యారు. ఆ పదవిలో ఆయన మూడేళ్ల వరకు కొనసాగే అవకాశం ఉంది.

మరిచిపోలేనిది, చారిత్రకం: అమిత్‌షా

సీడీఎస్ నియామకం.. చిరస్మరణీయం, చారిత్రకమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. సాయుధ దళాల్లోని సిబ్బంది సంక్షేమం కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఇది మరింత ముం దుకు తీసుకెళ్తుందని కామెంట్ చేశారు. బుధవారం ఈ మేరకు పలు ట్వీట్లు చేశారు. తొలి సీడీఎస్ ఏర్పాటు ద్వారా పెండింగ్‌లో ఉన్న మరో డిమాండ్‌ను ప్రధాని మోడీ నెరవేర్చారని అన్నారు. జనరల్ రావత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన హయాంలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఓ టీమ్ లాగా కలిసి పని చేస్తాయని చెప్పారు.

కాంగ్రెస్.. ఓ అయోమయ పార్టీ: జవదేకర్

సీడీఎస్ నియామకంపై ప్రశ్నిస్తున్న కాంగ్రెస్.. ఓ అయోమయ పార్టీ అని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. సీడీఎస్ అపాయింట్‌మెంట్‌ను రాజకీయం చేసే ఏ చర్య అయినా ఖండించాల్సిందేనన్నారు. "రాహుల్ గాంధీ ట్వీట్లను ఆయన అడ్వైజర్లు పోస్టు చేస్తారు. కానీ కాంగ్రెస్ నేతలు ఆయన ట్వీట్లకు వ్యతిరేకంగా మాట్లాడుతారు. అందుకే కాంగ్రెస్.. ఓ కన్ఫ్యూజ్డ్ పార్టీ" అని విమర్శించారు.

రావత్‌ను పొగిడిన మోడీ

డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలిటరీ అఫైర్స్, సీ డీఎ స్ ఏర్పాటు.. అద్భుత సంస్కరణలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఎంతో ఉత్సాహంతో దేశానికి సేవ చేసిన అత్యుత్తమ అధికారి జనరల్ రావత్ అని పొగిడారు. సైనిక దళాలను మోడ్రనైజ్ చేయడం, 130 కోట్ల మంది ఇండియన్ల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించే బాధ్యతలు సీడీఎస్‌పై ఉన్నాయని అన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారికి మోడీ ఈ సందర్భంగా నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధం తర్వాత సైనిక సంస్కరణలు జరగాలని చాలా చర్చలు జరిగాయని, దాని ఫలితంగానే సీడీఎస్ వైపు బాటలు పడ్డాయని చెప్పారు.

≡ క్విక్ బైట్స్



ఓటరు కార్డులపై క్యూఆర్ కోడ్‌లు

ఢిల్లీలో అమలుకు కసరత్తు

న్యూఢిల్లీ: ఢిల్లీలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు టెక్నాలజీని పెద్ద ఎత్తున ఉపయోగించనున్నారు. ఈ మేరకు ఓటర్లకు క్యూఆర్ కోడ్ ఉన్న ఓటర్ కార్డులు ఇవ్వనున్నారు. దీని వల్ల పోలింగ్ ప్రాసెస్ త్వరగా పూర్తవుతుందని, ఓటర్‌ను త్వరగా గుర్తించ వచ్చని సీనియర్ ఎలక్షన్ ఆఫీసర్ అన్నారు. " ఈ పద్ధతిని ప్రవేశపెడితే దేశంలోనే పోలింగ్ స్టేషన్‌లో బూత్ యాప్‌ను వాడిన మొదటి సిటీ ఢిల్లీ అవుతుంది. లైన్‌లో ఎంత మంది ఉన్నారనే విషయాన్ని బూత్‌యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.. దీని ద్వారా ఏ టైంకి రావాలనేది డిసైడ్ చేసుకోవచ్చు" అని ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ చెప్పారు. ఓటర్లు మొబైల్‌లను బూత్‌లకు తీసుకెళ్లేందుకు అనుమతించే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది.

ఇండోనేషియాలో వరదలు.. 9 మంది మృతి

జకార్తా: ఇండోనేషియాను వరదలు ముంచెత్తాయి. దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో బుధవారం 9 మంది చనిపోయారు. లోతట్టు ప్రాంతాలన్నీ నీటితో మునిగిపోయాయి. కరెంటు లేక ప్రజలు తీవ్ర కష్టాలు పడ్డారు. దీంతో వాళ్లంతా న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ట్రైన్లు క్యాన్సిల్ అయ్యాయి. కొన్ని ఏరియాల్లో ఎయిర్‌పోర్ట్‌లను కూడా క్లోజ్ చేశారు. చాలా ఏరియాల్లో జనం ఇళ్లలో చిక్కుకుపోయారని, చనిపోయిన వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

ఖబడ్దార్.. ఇరాన్

బాగ్దాద్ ఎంబసీపై దాడిని సీరియస్‌గా తీసుకున్న ట్రంప్



- మరిన్ని బలగాలను పంపిస్తున్నట్లు వెల్లడి
- అమెరికా తీరుపై ఇరాన్ విదేశాంగ శాఖ ఫైర్

బాగ్దాద్: ఇరాన్‌లోని తమ పౌరులకు గానీ, ఆస్తులకు గానీ ఏం జరిగినా టెహరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇది వార్నింగ్ కాదు.. థ్రెట్ అని ట్రంప్ ట్వీట్ చేశారు. న్యూ ఇయర్ విషెస్ చెబుతూ చేసిన ట్వీట్‌లో ఆయన ఈ విషయాన్నీ ప్రస్తావించారు. మిడిల్ ఈస్ట్ రీజియన్‌కు మరిన్ని బలగాలను పంపుతున్నట్లు డిఫెన్స్ సెక్రెటరీ మార్క్ ఈస్పర్ ప్రకటించిన తర్వాత ట్రంప్ ఈ ట్వీట్ చేశారు. పారామిలిటరీ గ్రూప్ లీడర్ అబు మహది అల్ ముహందిస్ మరో పదిమంది అనుచరులు, వందలాదిగా ప్రజలతో కలిసి ఎంబసీపై దాడి చేశారని ట్రంప్ ఆరోపించారు. హై సెక్యూరిటీ ఉండే చోట ఇలాంటి దాడి జరిగే అవకాశమే లేదని, ఇరాన్ దీనికి బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. మరోవైపు, మిడిల్ ఈస్ట్‌కు మరో 750 మంది ర్యాపిడ్ రెస్పాన్స్ యూనిట్ బలగాలను పం పిస్తున్నట్లు ఈస్పర్ మీడియాకు వెల్లడించారు. బాగ్దాద్ ఎంబసీపై దాడి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా బలగాలను మోహరిస్తున్నట్లు ఆయన వివరించారు.

అసలేం జరిగింది?

కాటెబ్ హెజ్బొల్లా పారామిలిటరీ గ్రూపును టార్గెట్ చేసి ఇరాన్, ఇరాక్‌లలోని పలుప్రాంతాల్లో అమెరికా మిస్సైల్ అ టాక్ చేసింది. ఆదివారం జరిగిన ఈ దాడిలో సుమారు 25 మంది చనిపోయారు. దీనిపై ఇరాన్, ఇరాక్‌లలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. బా గ్దాద్‌లోని అమెరికా ఎంబసీపై నిరసనకారులు దాడిచేసి, ఆఫీసును ధ్వంసం చేశారు. దీనిపై అమెరికా సీరియస్‌గా స్పందించింది. వెంటనే తన బలగాలను అక్కడికి పంపించింది.

దాడి టెర్రరిస్టుల పనే..

ఎంబసీపై దాడి టెర్రరిస్టులు చేసిందేనని యూఎస్ డిఫెన్స్ సెక్రటరీ మైక్ పాంపియో ఆరోపించారు. అయితే, ఈ విషయంలో తప్పంతా అమెరికాదేనని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అబ్బాస్ మౌసావి ఆరోపించారు. ఇరాన్ భూభాగంపై దాడులు జరిపి అమెరికా, తమ సావరిన్ పవర్‌కు భంగం కలిగించిందని విమర్శించారు. యూఎస్ దాడిలో తమ పౌరులు కనీసం 25 మంది చనిపోయారని చెప్పారు. ఈ ఘటనతో వెల్లువెత్తిన ప్రజాగ్రహం అమెరికా ఎంబసీపైకి మళ్లిందని మౌసావి వివరించారు.



'న్యూక్లియర్'పై కీలక సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్న ఇండియా, పాక్

న్యూఢిల్లీ/ ఇస్లామాబాద్: న్యూక్లియర్ స్థావరాలకు సంబంధించిన లిస్ట్‌లను మన దేశం, పాకిస్తాన్ బుధవారం ఇచ్చిపుచ్చుకున్నాయి. న్యూక్లియర్ స్థావరాలపై ఒక దేశం మరొక దేశం దాడి చేసుకోకుండా డిసెంబర్ 31, 1988లో రెండు దేశాలు అగ్రిమెంట్ చేసుకున్నాయి. జనవరి 1, 1992 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. రెండు దేశాలు దీనిని 1992 నుంచి కొనసాగిస్తున్నాయి. ఈ అగ్రిమెంట్ లో భాగంగా తమ దేశంలోని న్యూక్లియర్ స్థావరాల లిస్ట్‌ను ఇస్లామాబాద్‌లోని మన హైకమిషన్ ప్రతినిధికి అం దజేసినట్టు పాకిస్తాన్ బుధవారం తెలిపింది. మనదేశంలో ఉన్న న్యూక్లియర్ స్థావరాల లిస్ట్‌ను కూడా న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌కు అందజేసినట్టు ఫారెన్ మినిస్ట్రీ ప్రతినిధి చెప్పారు. రెండు దేశాలు ఒకే రోజు తమ దగ్గరున్న న్యూక్లియర్ ఇన్‌స్టలేషన్స్ సమాచారాన్ని పంచుకున్నాయి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

ఫస్ట్ నాడూ నిరసనలే

హాంకాంగ్‌లో రోడ్ల మీదకు వచ్చిన జనం

హాంకాంగ్: హాంకాంగ్‌లో టెన్షన్లు కొనసాగుతున్నాయి. న్యూ ఇయర్ రోజునా ఆందోళనలు కొనసాగాయి. బుధవారం హాంకాంగ్ ఫైనాన్షియల్ హబ్ అయిన వాన్ చాయ్ జిల్లాలో ప్రోడెమోక్రసీ నిరసనకారులు గొడుగులు పట్టుకుని వేలాది సంఖ్యలో రోడ్లమీదికి వచ్చి తమ నిరసన తెలిపారు. యువకులు, మహిళలు, తమ ముఖాలకు సర్జికల్ మాస్కులు వేసుకుని ప్రదర్శనలో పాల్గొన్నారు. 2019 నుంచి తాము చేస్తున్న డిమాండ్లను 2020 లోనూ కొనసాగించాల్సిరావడం విచారకరమని ర్యాలీ ప్రారంభంలో జిమ్మీ షామ్ అనే నిరసనకారుడు చెప్పారు. ర్యాలీ ప్రారంభమైన కొద్దిసేపటికే పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో టెన్షన్లు చోటు చేసుకున్నాయి. సిటీలోని కొన్ని ప్రాంతాల్లో నిరసనకారులు టెంపరరీ బారికేడ్లకు నిప్పంటించారు. షాపులు, మాల్స్ మూతపడ్డాయి. నిరసనకారులను అదుపుచేసేందుకు పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ కెనాన్స్, పెప్పర్ స్ప్రేలు ప్రయోగించారు. ర్యాలీకి సివిల్ హ్యూమన్ రైట్స్ ఫ్రంట్ పర్మిషన్ ఉన్నప్పటికీ గొడవలు ప్రారంభం కావటంతో వెంటనే ముగించాలని పోలీసులు ఆదేశించారు.

చైనా ఆధిపత్యం తొలగేవరకు పోరాడుతం

నేరస్థుల అప్పగింత పేరిట ప్రజల హక్కులను కాలరాసేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలపై భయాందోళన వ్యక్తం చేస్తున్న హాంకాంగ్ వాసులు.. కిందటేడాది జూన్ నుంచి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. హాంకాంగ్ పై చైనా ఆధిపత్యం పూర్తిగా తొలగిపోవాలని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని ప్రారంభమైన నిరసనలు తిరుగుబాటుగా మారాయి. తమ ప్రాంతంపై చైనా ఆధిపత్యం తొలగిపోయేంతవరకు ఆందోళనలు కొనసాగిస్తామని వారు అంటున్నారు. నిరసన కార్యక్రమాల్లో ఇప్పటివరకు అరెస్టయిన 6500 మందిని విడుదల చేయాలని, స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలని, పోలీసులు ఓవర్ యాక్షన్ పై చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు.



ఆఫ్గన్‌లో తాలిబన్ల ఎటాక్

26 మంది సైనికులు మృతి

కాబూల్: ఆఫ్గనిస్తాన్ సైనికులను టార్గెట్ చేస్తూ తాలిబన్లు వరుస ఎటాక్‌లకు పాల్పడుతున్నారు. నార్త్ ఆఫ్గనిస్తాన్‌లో దాడులను ముమ్మరం చేశారు. బుధవారం ఉదయం సెక్యూరిటీ ఫోర్స్‌ను టార్గెట్ చేస్తూ చేసిన దాడిలో 26 మంది చనిపోయారని అధికారులు చెప్పారు. దాడులన్నీ తామే చేస్తున్నామని తాలిబన్లు ప్రకటించారు. సైనికులు, ప్రభుత్వ అధికారులను టార్గెట్ చేస్తూ ఎటాక్స్ చేస్తున్నామని చెప్పారు. మంగళవారం రాత్రి నార్త్ ఖుందుజ్ ప్రావిన్స్‌లో జరిగిన దాడిలో 10 మంది ఫోర్స్ చనిపోగా.. నలుగురు గాయపడ్డారు. బల్ఖ్ ప్రావిన్స్‌లో జరిగిన దాడిలో 9 మంది సైనికులు చనిపోయారు. మంగళవారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు సెక్యూరిటీ ఫోర్స్ చనిపోయారు. 10 మంది తాలిబన్లు కూడా చనిపోయారని గవర్నర్ ప్రకటించారు. పోయిన వారం సెక్యూరిటీ ఫోర్స్ చాలా జిల్లాల్లో తాలిబన్లను హతమార్చారని, ఈ నేపథ్యంలో దాడులు చేస్తున్నారన్నారు.

క్విక్ బైట్స్



ఏఎండీ డైరెక్టర్‌గా డీకే సిన్హా

హైదరాబాద్, వెలుగు: అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్(ఏఎండీ) డైరెక్టర్‌గా డాక్టర్ డీకే సిన్హా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆయన ఇదే డైరెక్టరేట్‌లో అడిషనల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. మధ్యప్రదేశ్ సాగర్‌లోని హరిసింగ్ గౌర్ యూనివర్సిటీ నుంచి అప్లైడ్ జియాలజీలో ఎంటెక్ చేసిన సిన్హా నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం నుంచి 1993 లో భూగర్భ శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. యురేనియం అన్వేషణలో విశేష పరిజ్ఞానం ఉన్న ఆయన.. 1984 లో ఏఎండీలో ఉద్యోగంలో చేరారు.

ఎల్వోసీ దగ్గర గన్‌ఫైట్ ఇద్దరు సైనికులు మృతి

- కాల్పులకు తెగబడ్డ పాక్ చొరబాటుదారులు

జమ్మూ: జమ్మూకాశ్మీర్‌లోని ఎల్వోసీ వెంబడి పాకిస్తాన్ చొరబాటుదారులు బుధవారం కాల్పులు జరపడంతో మన ఆర్మీ జవాన్లు ఇద్దరు చనిపోయారు. ఖరీ తార్మత్ అడవి నుంచి భారీ ఆయుధాలతో మన దేశంలోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించగా గుర్తించిన ఆర్మీ జవాన్లు వారిని అడ్డుకున్నారు. దీంతో ఎదురుకాల్పులు చోటు చేసుకోగా ఇద్దరు చనిపోయారని పీఆర్వో లెఫ్టినెంట్ కల్నల్ దేవేంద్ర ఆనంద్ చెప్పారు. టెర్రరిస్టులు చొరబడేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం రావడంతో కార్డన్ సెర్చ్ చేశామని అన్నారు.

కోరేగావ్‌ను సందర్శించిన 5 లక్షల మంది

పుణె: మహారాష్ట్ర పుణె జిల్లా పెర్నె గ్రామం దగ్గర ఉన్న జయస్తంభ్ (విక్టరీ పిల్లర్)కు లక్షలాదిమంది నివాళులు అర్పించారు. కోరేగావ్ భీమా యుద్ధం జరిగి బుధవారానికి 202 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గట్టి భద్రత మధ్య జనం అమరవీరులకు నివాళులు అర్పించారు. 5 లక్షల మంది దీనికి తరలివచ్చారని అధికారులు చెప్పారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలె, ప్రకాశ్ అంబేద్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండేళ్ల కిందట జరిగిన గొడవల్లో ఒకరు చనిపోయారు. చాలా మందికి దెబ్బలు తగిలాయి. దీంతో ఈ సారి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భీమా కోరేగావ్ సహా పుణెలో ఇంటర్నెట్‌పై బ్యాన్ విధించారు.



పేరెంట్స్ స్వస్థలం సహా..

21 ప్రశ్నలతో ఎన్‌పీఆర్

- క్వశ్చన్ పేపర్ రెడీ చేసిన కేంద్రం
- మోడల్ పేపరే ఫైనల్ చేసే ఆలోచన

న్యూఢిల్లీ: నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పీఆర్) అప్‌డేషన్ కోసం ప్రశ్నాపత్రం సిద్ధమైంది. గతేడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన ట్రయల్ లో అధికారులు ఉపయోగించిన మోడల్ పేపర్‌నే ఫైనల్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పైలట్ ప్రాజెక్టులో మొత్తం 74 జిల్లాల్లోని 30 లక్షల మంది వివరాలు సేకరించారు. దీనికి ప్రజల స్పందన బాగుందని, పెద్దగా అభ్యంతరాలు వ్యక్తంకాలేదని సమాచారం. దీంతో ఏప్రిల్‌లో సెన్సస్ తో పాటే చేపట్టనున్న ఎన్‌పీఆర్‌లో ఇదే పేపర్‌ను వాడాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ పేపర్‌లో.. తల్లిదండ్రుల పుట్టిన ప్రదేశం సహా మొత్తం 21 ప్రశ్నలు పొందుపరిచారు. ఆధార్ కార్డు(ఆప్షనల్), ఓటర్ ఐడీ, మొబైల్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ నంబర్‌తదితర వివరాలను కూడా సేకరిస్తారు.

పదేళ్ల క్రితం సేకరణ

పాపులేషన్ రిజిస్టర్ కోసం 2010లో వివరాలు సేకరించినట్లు అధికారులు చెప్పారు. అప్పట్లో కేవలం 15 అంశాలకు సంబంధించిన వివరాలనే సేకరించినట్లు తెలిపారు. తర్వాత ఆ రిజిస్టర్‌ను 2015లో అప్‌డేట్ చేశామన్నారు. ఈసారి 21 అంశాలపై వివరాలు సేకరించనున్నట్లు వివరించారు.

ఏమేం ప్రశ్నలు ఉంటయ్

పేరు, కుటుంబ యజమానితో బంధుత్వం, తల్లిదండ్రుల పేర్లు, భార్య/భర్త పేరు, జెండర్, పుట్టిన రోజు, ప్రదేశం, వైవాహిక స్థితి, జాతీయత, చిరునామా, ఎప్పట్నుంచి ఉంటున్నారు.. శాశ్వత చిరునామా, ఆక్యుపేషన్, విద్యార్హతలకు సంబంధించి మొత్తం 21 ప్రశ్నలు

ముందే చెప్పి వెళతాం

ఎన్‌పీఆర్‌లో భాగంగా సమాచార సేకరణకు వెళ్లే ముందే ఇన్ఫర్మేషన్ ఇస్తామని అధికారులు చెప్పారు. ఒక కుటుంబంలో 15 మంది, అంత కు మించి సభ్యులు ఉంటే ముందు నోటీసు ఇచ్చి ఆ తర్వాతే వెళతామన్నారు. దీని వల్ల అవసరమైన డాక్యుమెంట్లను వారు సిద్ధం చేసుకునేందుకు వీలుంటుందని వివరించారు. ఆ డాక్యుమెంట్లను ఎన్యుమరేటర్ పరిశీలిస్తారని చెప్పారు.

ఏపీకి అసలైన ద్రోహి జగనే



- కులం అంటగట్టి అభివృద్ధిని చంపుతున్నరు
- చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు
- రైతులకు మద్దతుగా అమరావతిలో పర్యటన

అమరావతి, వెలుగు: ఆంధ్రాకు అసలైన ద్రోహి సీఎం జగనే అని మాజీ సీఎం, టీడీపీ చీఫ్ చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్వార్థం కోసమే అమరావతిని తరలించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అమరావతి కి 33 వేల ఎకరాలు భూమిలిచ్చిన రైతులను రోడ్డుమీదకు లాగేశారని మండిపడ్డారు. అమరావతి తరలింపునకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు టీడీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రబాబు.. తన భార్య భువనేశ్వరితో కలిసి బుధవారం అమరావతిలో పర్యటించారు. యర్రబాలెం, మందడం, తుళ్లూరు, కృష్ణాయపాలెం గ్రామాల్లో రైతుల దీక్షా శిబిరాలు, ధర్నాల ప్రాంగణంలో సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి "ఓ చేతకాని వాడు, దద్దమ్మ, సీఎం పదవికి అర్హుడు కాదు. దిగిపో"అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం సీట్లో ఉన్నాననే అహకారంతో రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్నారని, అమరావతిలో తాను కట్టిన భవనాల్లో కూర్చొని పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో కూల్చడం తప్ప.. ఒక్క బిల్డింగ్ కూడా కట్టింది లేదన్నారు. రాజధానిని మార్చే అధికారం ఆయనకు లేదన్నారు. ఆంధ్రాకు 3 రాజధానుల నిర్ణయంతో జగన్ తుగ్లక్‌ను మించిపోయారని ఎద్దేవా చేశారు.

జగన్‌వి అడ్డగోలు నిర్ణయాలు

జగన్ చేతిలో అధికారం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని, అడ్డగోలు నిర్ణయాలతో ఏపీకి రావాల్సిన పెట్టుబడులు తెలంగాణకు తరలిపోతున్నాయని ఫైర్ అయ్యారు. మాజీ సీఎం వైఎస్‌రాజశేఖర్ రెడ్డి తనను గౌరవించేవారని, కానీ జగన్ ఓ మూర్ఖుడిలా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజధానికి కులం అంటగట్టి అభివృద్ధిని చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో ఆ ఒకే సామాజిక వర్గం ఉందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. కానీ, ఇక్కడ వెనుకబడిన కులాలు కూడా ఉన్నాయని అన్నారు. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ పేరుతో తనను పట్టుకునేందుకు జగన్ కొండను తవ్వి ఎలుకను కాదు కదా.. ఎలుక బొచ్చు కూడా పట్టుకోలేదన్నారు. జీవితంలో ఒక్కసారైనా సీఎం కావాలన్న జగన్ కోరిక తీరిందని త్వరలోనే పులివెందులకు పారిపోతారని చంద్రబాబు అన్నారు.

విరాళంగా భువనేశ్వరి చేతి గాజులు

తన భార్య భువనేశ్వరి సూచన మేరకే కొత్త సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నానని చంద్రబాబు చెప్పారు. "రైతులు బాధల్లో ఉంటే మనకు వేడుకలు తగదని భువనేశ్వరి చెప్పడంతో రైతులకు అండగా నిలిచేందుకు ఆందోళనల్లో పాల్గొంటున్నా" అని చెప్పారు. ఎర్రబాలెం గ్రామంలో మహిళా రైతులతో కలిసి దీక్షలో కూర్చున్న చంద్రబాబు భార్య భువనేశ్వరి తన చేతి గాజులను అమరావతి రైతుల పోరాటానికి విరాళంగా ఇచ్చారు. భూములు కోల్పోయిన మహిళా రైతులు పడుతున్న బాధను సాటి మహిళగా అర్థం చేసుకోగలనని ఆమె అన్నారు.

పాపులేషన్ ఎక్కువ ఇచ్చే పైసలు తక్కువ

గ్రామ పంచాయతీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం ఫండ్స్

రాష్ట్రంలో పంచాయతీలను ఎట్లా నడపాలో తెలీక సర్పంచ్‌లు సతమతమవుతున్నరు. గ్రామాభివృద్ధి, మెయింటనెన్స్, పారిశుధ్య పనులు, ట్రాక్టర్లు, ట్రాలీలు, వాటర్ ట్యాంకర్ల కొనుగోలు, కార్మికుల జీతాలు... ఇలా అన్నీ చేయాలని చెబుతున్నారు కానీ ఫండ్స్ ఇవ్వడం లేదు. 2011 జనాభా ఆధారంగా నిధులిస్తుండడంతో ఇప్పటి అవసరాలకు అవి ఏమాత్రం సరిపోవట్లేదు. 8 ఏళ్లలో ఒక్కో గ్రామంలో 30% కంటే ఎక్కువ జనాభా పెరగగా ఖర్చులు అంతే స్థాయిలో పెరిగాయి. ట్రాక్టర్లు కొనుగోలు చేశాక ఇన్‌స్టాల్‌మెంట్‌కు ఈజీఎస్ డబ్బులు వాడుకోవాలని సర్కారు జీవో జారీ చేసినా అది ఉపయోగపడేలా లేదు.



- 8 ఏండ్లలో ముప్పై శాతం కంటే ఎక్కువ పెరిగిన జనాభా
- ఈ నిధులతో డెవలప్‌మెంట్, మెయింటనెన్స్, జీతాలిచ్చేదెట్లా?
- తమ వల్ల కాదంటున్న సర్పంచ్‌లు

హైదరాబాద్, వెలుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా గ్రామ పంచాయతీలకు రూ.339 కోట్లను విడుదల చేస్తోంది. వీటిలో కేంద్ర ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు ఉన్నాయి. మొత్తం 12,751 పంచాయతీలు ఉండగా, 2011 జనాభా లెక్కల ఆధారంగా జిల్లా అధికారులు ఫండ్స్ రిలీజ్ చేస్తున్నారు. దీంతో చాలా గ్రామాలకు పాపులేషన్ ఆధారంగా రూ.20 వేల లోపు నుంచి 6 లక్షల వరకు వస్తున్నాయి. అయితే ఈ ఫండ్స్‌సరిపోవడం లేదని సర్పంచ్‌లు వాపోతున్నారు. కేవలం హౌస్ ట్యాక్స్ తప్పా ఏ ఇతర ఇన్‌కం సోర్స్ లేదంటున్నారు. ఇప్పటివరకు గ్రామాభివృద్ధికే ఫండ్స్ ఖర్చు చేస్తుండగా రెండు నెలల నుంచి పంచాయతీ కార్మికుల జీతాలు, ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్లు కొనడం లాంటివి ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు మహబూబ్ నగర్ జిల్లాలోని ఓ గ్రామ జనాభా 3800 కాగా ప్రభుత్వం నెలకు రూ.2,80,000 వరకూ ఇస్తోంది. ఇప్పటివరకు సెప్టెంబర్, అక్టోబర్ ఫండ్స్ రిలీజ్ అయ్యాయి. నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన పైసలు ఇవ్వలేదు. ఖర్చులు, కార్మికుల జీతాలు, ట్రాక్టర్ మెయింటనెన్స్, పైప్‌లైన్స్‌డ్యామేజీ, కరెంట్ బిల్లులు , లైట్ల మరమ్మతులు పోను అదనపు ఖర్చు రూ.లక్ష వరకూ అవుతోంది.

ఈజీఎస్ నిధులు వాడుకున్నా కష్టాలే...

సర్కారు ట్రాక్టర్ తో పాటు మొక్కలకు నీళ్లు పోసేందుకు వాటర్ ట్యాంకర్, ట్రాలీ కొనాలని ఆదేశాలు జారీ చేసింది. ఏ కంపెనీ ట్రాక్టర్ తీసుకోవాలన్నా కనీసం రూ.5లక్షలకు పైనే ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా ట్రాక్టర్ల కొనుగోలు ప్రక్రియ మెల్లగా సాగుతోంది. మొత్తం 12,751 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటి వరకు 3వేల గ్రామాల్లో కూడా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో పూర్తి డబ్బులు ముందుగానే కట్టి కొంటుండగా, మరికొందరు కొంత అడ్వాన్స్ కట్టి ట్రాక్టర్లు తీసుకుంటున్నారు. కిస్తీలకు ఈజీఎస్ డబ్బులు వాడుకోవచ్చని చెప్పినా కష్టాలు తీరేలా లేవు. ఇన్‌స్టాల్‌మెంట్ కట్టినా ట్రాక్టర్ మెయింటనెన్స్‌కూ ఖర్చు అవుతుందంటున్నారు. అయినా చిన్న గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్ అవసరమే ఉండదంటున్నారు. ప్రభుత్వం కొనాలని బలవంత పెడుతోందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

రూ.50 వేలు ఇస్తున్నరు

మాది చాలా చిన్న గ్రామ పంచాయతీ. రూ.50 వేలు ఇస్తున్నరు. ట్రాక్టర్ ఇన్‌స్టాల్‌మెంట్‌కు ఈజీఎస్ డబ్బులు కట్టినా మాకు ఇచ్చేవి ఏమాత్రం సరిపోవు. మెయింటనెన్స్, డ్రైవర్ జీతాలకే రూ.20 వేల దాకా అయితది. మా మండలంలో 39 గ్రామాలుంటే 2 గ్రామాలే ట్రాక్టర్లు కొన్నాయి.

- కుమార్, సర్పంచ్, అచ్చంకుంట తండా, దేవరకొండ మండలం, నల్గొండ జిల్లా

760 మందికి రూ.34 వేలు

మా గ్రామంలో 760 మంది ఉన్నరు. ప్రభుత్వం నెలకు రూ. 34 వేలు ఇస్తోంది. వీటిని ఎట్లా ఖర్చు పెట్టాలో అర్థం కావట్లేదు. కార్మికుల జీతాలు కూడా ఇందులోంచే ఇవ్వాలట.. 34 వేలతో ఏం జేస్తం. మా గ్రామం కంటే చిన్నగా ఉన్న పంచాయతీలకు రూ.21 వేలే ఇస్తున్నరు. వాళ్ల పరిస్థితేందో!

- లక్షణ్, సర్పంచ్, జటావత్ తండా, నల్గొండ జిల్లా

ఊర్లను తాకట్టు పెట్టాల్సిందే

తక్కువ ఫండ్స్ఇస్తూ కార్మికులకు జీతాలు ఇవ్వాలని, ట్రాక్టర్లు, ట్యాంకర్లు కొనాలని, ఇతర పనులు చేయాలని ప్రభుత్వం చెబుతోంది. 500 జనాభా దాటిన కాలనీలు, తండాలను పంచాయతీలుగా చేశారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఎస్సీ కాలనీలను జనాభా తక్కువున్న పంచాయతీలుగా చేసుకున్నారు. కొత్త పంచాయతీలకు ఆదాయం లేనప్పుడు జీతాలు, డెవలప్‌మెంట్, నిర్వహణ ఎలా సాధ్యమైతది. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలె.

- ప్రణీల్ చందర్, రాష్ట్ర సర్పంచ్ ల సంఘం ప్రధాన కార్యదర్శి

అణ్వాస్త్ర పరీక్షలు చేస్తం

- త్వరలో కొత్త వెపన్‌ను పరీక్షిస్తం: కిమ్

సియోల్: అణ్వాయుధాలు, క్షిపణుల ప్రయోగాలపై ఇప్పటిదాకా విధించుకున్న సొంత నియంత్రణకు ఇక స్వస్తి పలుకుతున్నట్లు నార్త్ కొరియా లీడర్‌కిమ్ జోంగ్ ఉన్ బుధవారం ప్రకటించారు. త్వరలోనే కొత్త వ్యూహాత్మక ఆయుధాన్ని పరీక్షిస్తామని స్పష్టం చేశారు. అమెరికాతో చర్చల కోసం కొంతకాలంగా అణ్వాయుధాలను పరీక్షించడంపై స్వీయ నియంత్రణ పాటిస్తున్నట్లు ఆయన చెప్పారు. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌తో ఇప్పటికే మూడుసార్లు భేటీ అయినా చర్చల్లో చెప్పుకోదగ్గ పురోగతి కనిపించడం లేదని కిమ్ చెప్పారు. అమెరికా తన సొంత ప్రయోజనాల కోసమే చర్చలకు అడ్డుపుల్లలు వేస్తోందని కిమ్ ఆరోపించారు. ఈ క్రమంలో అణ్వాయుధ పరీక్షలను ఆపేయడంలో ఎలాంటి అర్థంలేదని చెప్పారు.



అసెంబ్లీకి హక్కుల్లేవా?

సీఏఏ వ్యతిరేక తీర్మానంపై విజయన్

తిరువనంతపురం: అసెంబ్లీలకు కొన్ని ప్రత్యేక హక్కులుంటాయని కేరళ సీఎం విజయన్ అన్నారు. సీఏఏను రద్దు చేయాలంటూ మంగళవారం కేరళ అసెంబ్లీ తీర్మానించింది. దీనిని కేంద్రంలోని బీజేపీ సర్కారు తప్పుబట్టింది. కేరళ సర్కారుకు, సీఎం పినరయి విజయన్‌కు ఓ మంచి లీగల్ అడ్వైజర్ అవసరం ఉందంటూ కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ ఎగతాళి చేశారు. సీఏఏను ఏ రాష్ట్ర అసెంబ్లీలోనైనా పాస్‌చేయించే పవర్ పార్లమెంట్‌కు ఉందన్నారు. ఈ విషయంలో న్యాయ సలహా తీసుకోవాలంటూ విజయన్‌కు సూచించారు.



వణికిపోతున్న ఢిల్లీ

- మినిమమ్ టెంపరేచర్ 2.4 డిగ్రీలు
- నార్త్ అంతటా పడిపోయిన టెంపరేచర్లు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని చలి వదలడం లేదు. బుధవారం మినిమమ్ టెంపరేచర్ 2.4 డిగ్రీలుగా రికార్డయిందని, వారంలో ఈ టెంపరేచర్ రికార్డ్ అవ్వడం ఇది రెండోసారని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. తెల్లవారుజామున కురిసిన భారీ పొగమంచు కారణంగా 29 రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఎయిర్ క్వాలిటీ సివియర్ కేటగిరీలోనే ఉంది.

రాజస్థాన్‌లోనూ చలి

జైపూర్: రాజస్థాన్‌లో కూడా బుధవారం టెపరేచర్లు భారీగా పడిపోయాయి. 1.5 డిగ్రీల సెల్సియస్‌తో గంగానగర్.. రాష్ట్రంలోనే కోల్‌డెస్ట్ ప్లేస్‌గా నమోదైంది. జైసల్మేర్, పిలానీ, బికనీర్, సికర్, బర్మేర్‌లో మినిమమ్ టెంపరేచర్ 2.8 నుంచి 5.8 మధ్యలో నమోదైందని అధికారులు చెప్పారు.

కాశ్మీర్‌లో స్నోఫాల్

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో బుధవారం మినిమమ్ టెంపరేచర్ భారీగా పడిపోయింది. మంచు వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శ్రీనగర్‌లో రాత్రి టెంపరేచర్ మైనస్ 4.4 డిగ్రీలుగా నమోదైందని, ఈ నెల 4 వరకు భారీగా మంచు కురిసే అవకాశం ఉందని అన్నారు. స్కై రిసార్ట్ గుల్మర్గ్‌లో రాత్రి టెంపరేచర్లు తగ్గాయి.

ఆగని చలిగాలులు

చండీగఢ్: పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో చలిగాలులు కొనసాగుతున్నాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోందని అధికారులు చెప్పారు. అతి తక్కువగా లూధియానాలో 0.3 డిగ్రీల టెంపరేచర్ నమోదైంది. అమృత్‌సర్, పాటియాలాలో 2.4, 1.6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. హర్యానాలోని అంబాలాలో 2.4, హిసార్‌లో 1 డిగ్రీ, కర్నాల్‌లో 0.6 ఉష్ణోగ్రత నమోదైంది. పంజాబ్‌లోని పటాన్‌కోట్, భటిండా, ఫరీద్‌కోట్, గురుదాస్‌పూర్‌లో టెంపరేచర్లు భారీగా పడిపోయాయి. పొగమంచు కారణంగా రోడ్లు కనిపించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చెక్‌డ్యాంలు కడ్తమంటరు టెండర్లే పిలుస్తలేరు

చెక్‌డ్యాంల నిర్మాణంపై సీఎం హామీలు.. ఆచరణలోకి వచ్చేసరికి పట్టించుకోని పరిస్థితి

హైదరాబాద్, వెలుగు:

"ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అతి పొడవైన నది మానేరు. అప్పర్, లోయర్, మిడ్ మానేరు నుంచి గోదావరిలో కలిసే వరకు 181 కిలోమీటర్లు ఉంటది. గతంలో దీన్ని ఎవరూ పట్టించుకోలె. మంత్రి ఈటల రాజేందర్ అడిగితే కొన్ని చెక్‌డ్యాంలు ఇచ్చినం. అవి పూర్తయినయ్. మానేరు మీద 29, మూలవాగు మీద పది చెక్ డ్యాంలు నిర్మిస్తం. వచ్చే జూన్‌లో ఈ చెక్ డ్యాంలు నిండాలే. రూ.530 కోట్లతో వెంటనే టెండర్లు పిలిచి పూర్తి చేయాలె" ఉమ్మడి కరీంనగర్ జిల్లా టూర్‌లో సీఎం కేసీఆర్ చెప్పిన మాటలివి.

"చెరువులను ప్రాజెక్టుల నీళ్లతో నింపేందుకు కాలువలపై తూములు.. ఉప నదులు, వాగులపై నీటి నిల్వ పెంచేందుకు చెక్ డ్యాంలు నిర్మించాలి. మిషన్ కాకతీయ తరహాలో చెక్ డ్యాంలు, తూముల నిర్మాణాలు పూర్తి చేయాలి. వర్షపు నీళ్లు, ఆయా బేసిన్లలో ఉపయోగించిన పడుబాటు నీళ్లు పరుగులెత్తకుండా ఎక్కడికక్కడ భూమిలో ఇంకేందుకు చెక్ డ్యాంలు పనిచేస్తాయి" గతేడాది వివిధ ప్రాజెక్టులపై సమీక్షల సందర్భంగా సీఎం కేసీఆర్ చేసిన కామెంట్లు ఇవీ. ప్రాజెక్టులను సందర్శించిన, ఇరిగేషన్ పై రివ్యూలు చేసిన చాలా సందర్భాల్లో సీఎం కేసీఆర్ చెక్‌డ్యాంల నిర్మాణంపై హామీలు కురిపించారు. కానీ ఆచరణలోకి వచ్చేసరికి వాటిని పట్టించుకోవడం లేదు. 1,230 చెక్‌డ్యాంల నిర్మాణానికి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చిన సర్కారు.. టెండర్ల దగ్గరకు వచ్చేసరికి చేతులెత్తేసింది. ఆర్థిక మాంద్యం, బడ్జెట్ పరిమితుల పేరుతో ఇప్పటికిప్పుడు నిధులివ్వలేమని సీఎం కూడా గతంలో తేల్చిచెప్పేశారు. కానీ, కరీంనగర్ టూర్ సందర్భంగా మరోసారి చెక్‌డ్యాంల నిర్మాణంపై మరోసారి హామీలు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.



- జూన్ నాటికి చెక్ డ్యాంలు నింపుతామని కేసీఆర్ ప్రకటన
- 1,230 చెక్ డ్యాంలకు ఇప్పటికే అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్

సైడ్‌ట్రాక్‌లోకి చెక్ డ్యాంలు

రెండోసారి సీఎం అయిన తర్వాత కేసీఆర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌ను తన వద్దే పెట్టుకున్నారు. ఉప నదులు, వాగుల్లో నీటి నిల్వ పెంచేందుకు చెక్ డ్యాంలు నిర్మించాలని చాలా సందర్భాల్లో ఇరిగేషన్ అధికారులను సీఎం ఆదేశించారు. ఒక వర్క్‌షాప్ ఏర్పాటు చేసి విధివిధానాలు రూపొందించాలని సూచించారు. దీంతో గతేడాది మార్చి 23న జలసౌధలో ఇరిగేషన్ ఇంజనీర్లు వర్క్‌షాప్ నిర్వహించి చెక్ డ్యాంల నిర్మాణాలపై చర్చించారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో 1,230 చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. ఇందుకు రూ.3,790 కోట్లు అవసరమవుతాయని, ఒక్కో చెక్ డ్యాంకు రూ.3 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ పనులకు ప్రభుత్వం అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ కూడా ఇచ్చింది. మే మొదటి వారంలో టెండర్లు పిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. నిధుల కోసం సీఎం దగ్గరకు వెళ్లాక కొన్నాళ్లు వెయిట్ చేయమన్నారు. పలు సందర్భాల్లో టెండర్ల ముచ్చట ముందు పెట్టినా మాంద్యం, నిధుల లేమి, బడ్జెట్ లేదంటూ సైడ్ ట్రాక్ పట్టించారు.

మిగతా వాటిని పట్టించుకోవాలె

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మానేరు, మూల వాగుల చెక్ డ్యాంల నిర్మాణంతోనే సరిపెట్టేలా సీఎం మాట్లాడారని, మానేరు నదిని లైవ్ చేయడానికి పైసలు ఖర్చు పెడితే మంచిదే కాని, మిగిలిన చెక్ డ్యాంల నిర్మాణానికీ ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం తమ నియోజకవర్గాల్లోని చెక్ డ్యాంల పనులపై మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లను ఆరా తీస్తున్నారు. సీఎంను కలిసినప్పుడు ఇదే అడుగుతున్నా ఆయన నుంచి హామీ లభించడం లేదని సమాచారం. కరీంనగర్ లో మాదిరిగానే మిగతా ఉప నదులు, వాగులపై చెక్ డ్యాంల పనులు మొదలు పెట్టాలని ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

జూన్‌లోగా ఎట్ల అవుతయ్

మిడ్ మానేరు సందర్శనకు వెళ్లిన సీఎం జూన్‌లోగా 39 చెక్ డ్యాంల నిర్మాణాలు పూర్తి చేసి వరద నీటిని ఆపుతామని చెప్పారు. ఇంజనీర్ల వర్క్‌షాప్‌లో ఒక్కో చెక్ డ్యాం నిర్మాణానికి 9 నెలల టైం పడుతుందని లెక్కగట్టారు. చిన్నవైతే ఆరేడు నెలల్లో కట్టొచ్చని, మానేరుపై నిర్మించే వాటికి యేడాది టైం పడుతుందని, అలాంటప్పుడు జూన్‌లోగానే నిర్మించాలనే ముచ్చట వట్టిదేనని కొట్టి పారేస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులు లేవని, వచ్చే బడ్జెట్ నాటికి పరిస్థితులు అనుకూలిస్తే చెక్ డ్యాంలకు నిధులు ఇచ్చే అవకాశముందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదంతా అయ్యే సరికి నాలుగైదు నెలలు పడుతుందని, వర్షాకాలం ముగిస్తే గాని నిర్మాణాలు మొదలు పెట్టలేమని చెప్తున్నారు. నవంబర్‌లో పనులు మొదలు పెడితే వచ్చే ఏడాది జులై నాటికి చెక్ డ్యాంలను పూర్తి చేసే అవకాశముందని అంటున్నారు.



పరశురామావతారం

భద్రాచలం, వెలుగు: భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీవైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులకు పరశురామావతారంలో దర్శనం ఇచ్చారు. ఉత్సవమూర్తులను పరశురామావతారంలో అలంకరించిన అనంతరం ఊరేగింపుగా ప్రాకార మండపానికి తీసుకొచ్చారు. అక్కడ విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం, ఆరాధన తర్వాత చతుర్వేద విన్నపాలు, నాళాయర దివ్యప్రబంధ పారాయణం, ఇతిహాసాలు, క్షేత్రమహత్యం తదితరాలు నిర్వహించారు. మిథిలా ప్రాంగణంలో వేదిక పైకి స్వామిని తీసుకొచ్చి భక్తుల దర్శనార్థం ఉంచారు. సాయంత్రం తిరువీధి సేవ జరిగింది. గురువారం స్వామి నిజరూపం శ్రీరామావతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.



మూడు నెలలు.. రూ. 500 కోట్ల పనులు

గత ఏడాది డిసెంబర్ 31 నాటికి కూలీలకు 9.99 కోట్ల పనిదినాలు కల్పించి రూ.1501.94 కోట్లను కూలి రూపంలో ఇచ్చారు. కూలీలకు మూడు నెలల్లో మరో రూ.500 కోట్ల పనులు కల్పిస్తేగానీ రూ.1300 కోట్లు మెటీరియల్ వర్క్స్కు వచ్చే పరిస్థితి లేదు. టార్గెట్ చేరుకోలేకపోతే మెటీరియల్ వర్క్స్ చేపట్టినవారు బిల్లుల కోసం మరో ఏడాది వేచి చూడాల్సిందే.

‘ఉపాధి’ పనులు పెరగట్లే

ఫండ్స్ రావట్లే

ఈజీఎస్ లో ఎక్కువవుతున్న మెటీరియల్ వర్క్

- లోపిస్తున్న 60:40 నిష్పత్తి
- ‘పల్లె ప్రగతి’లోనూ మెటీరియల్ పనులకే ప్రాధాన్యం
- కాంపొనెంట్ మ్యాచ్ కాక విడుదలవని బిల్లులు

హైదరాబాద్, వెలుగు: ఉపాధి హామీ పథకంలో కూలీలకు కల్పించే పని దినాలకు, ఈ స్కీమ్లో చేపట్టే మెటీరియల్ వర్క్స్కు మధ్య పొంతన లేకుండా పోతోంది. గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో చేపట్టే వైకుంఠధామాలు, సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, గోదాములు, ఆట స్థలాల నిర్మాణానికయ్యే వ్యయానికి అనుగుణంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఓలు కూలీలకు పని దినాలు కల్పించకపోతున్నారు. దీంతో మెటీరియల్ వర్క్స్కు నిధుల మంజూరుకు సాంకేతికంగా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పనులు చేసిన సర్పంచ్లు, చిన్న కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలోని రూల్స్ ప్రకారం 60 శాతం నిధులు కూలీల వేతనాలకు, 40 శాతం నిధులను మెటీరియల్ వర్క్స్కు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఉదాహరణకు కూలీలు వారు చేసిన పని దినాలకు రూ.150 కోట్లు(60 శాతం) వేతనంగా పొందినప్పుడే.. మెటీరియల్ వర్క్స్ చేయడానికి అదే రేషియోలో రూ.100 కోట్లు(40 శాతం) మంజూరవుతాయి. ఈ నిధులను కూలీలతో సంబంధం లేకుండా మౌలిక వసతుల కల్పనకు వినియోగించవచ్చు. ఇలా కూలీలకు ఎంత ఎక్కువ పని దినాలు కల్పిస్తే మెటీరియల్ వర్క్స్కు అంత ఎక్కువ నిధులు మంజూరయ్యే అవకాశముంది. ఒకవేళ కూలీలకు తక్కువ పని దినాలు కల్పించి మెటీరియల్ వర్క్స్ ఎక్కువగా చేస్తే ఆ పనులకు నిధులు విడుదలయ్యే అవకాశం లేదు.

రూ. 1300 కోట్లు మించనున్న పల్లె ప్రగతి వర్క్స్

గత ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ ద్వారా కూలీలకు రూ.1,759.33(60.2 శాతం) కోట్లు వ్యయం కాగా మెటీరియల్ పనుల కోసం రూ.1163.21(39.8 శాతం) నిధులు మజూరయ్యాయి. వాస్తవానికి సీసీ రోడ్లు, జీపీ భవనాల భవనాల నిర్మాణం తదితర మెటీరియల్ పనులు 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఇంతకంటే ఎక్కువగా జరగడంతో ఆ వర్క్స్ చేసిన మాజీ సర్పంచ్లకు ఇప్పటికీ నిధులు విడుదల కాలేదు. ఈసారి పల్లె ప్రగతి కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 12,750 గ్రామాల్లో వైకుంఠధామాల నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది. ఒక్కో వైకుంఠధామానికి రూ.12 లక్షల చొప్పున ఈజీఎస్ నిధులను వినియోగించాలని నిర్ణయించింది. ఈ లెక్కన ఈసారి కేవలం శ్మశానవాటికలకే రూ.వెయ్యి కోట్లు వ్యయం దాటే అవకాశముంది. ఈజీఎస్ నిధులతోనే జీపీ భవన నిర్మాణాలు, డంపింగ్ యార్డుల నిర్మాణాలకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ లెక్కన మొత్తం మెటీరియల్ వర్క్స్కు రూ.1300 కోట్లు వ్యయం దాటనుంది.



యాదాద్రిలో భక్తుల రద్దీ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం బుధవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. ధర్మదర్శనానికి 7 గంటలు, ప్రత్యేక దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. భక్తులు భారీగా తరలిరావడంతో బస్టాండ్ నుంచి ఘాట్ రోడ్డు వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది.

\- యాదగిరికొండ, వెలుగు

నేను తలచుకుంటే

రామన్నకు టికెట్ కూడా రాదు

- ఎంపీ సోయం బాపూరావు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీ సోయం

ఆదిలాబాద్ అర్బన్, వెలుగు: తాను తలచుకుంటే జోగు రామన్నకు టీఆర్ఎస్లో ఎమ్మెల్యే టికెట్ కూడా దక్కదని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరించకుంటే తమ భూములు తమకివ్వాలంటూ సీసీఐకి భూములిచ్చిన రైతులు పది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. బుధవారం పార్టీ నేతలతో కలిసి శిబిరాన్ని సందర్శించిన ఎంపీ వారి దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పక్కా రాజకీయ నాయకుడిగా మారితే జోగురామన్న ఆదిలాబాద్లో కాదు కదా ఇంట్లో నుంచి కూడా బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుందన్నారు. 24 గంటలు తనను విమర్శించడమే పనిగా పెట్టుకున్నాడని, ఇలాగే విమర్శలు చేస్తూ ఉంటే టీఆర్ఎస్లో ఎమ్మెల్యే టికెట్ కూడా రాకుండా చేసే సత్తా తనకుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. లాభాల బాటలో ఉన్న సీసీఐ అప్పటి రాజకీయ నేతలకు సోయి లేని కారణంగానే మూతపడిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలప్పుడే తాను సీసీఐ పునరుద్ధరణపై ప్రజలకు మాటిచ్చానని, ఆరు నెలల వ్యవధిలో పార్లమెంట్లో మూడుసార్లు దీనిపై కేంద్రాన్ని అడిగానన్నారు. ఫ్యాక్టరీని ఏడాదిలోగా పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చారు.

కాంగ్రెస్కు కటకం

రాజీనామా

కరీంనగర్, వెలుగు: కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కటకం మృత్యుంజయం బుధవారం ఆకస్మికంగా తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి ఫ్యాక్స్ ద్వారా పంపించారు. కటకం రాజీనామా వెనక పార్టీలో జరుగుతున్న అంతర్గత కలహాలే కారణమని బలంగా వినిపిస్తున్నాయి. కటకం మృత్యుంజయం గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సేవలందించారు. పార్టీకి కాకుండా వ్యక్తి విధేయత చూపిస్తున్నారని కటకం గతంలో బహిరంగంగానే విమర్శించారు.

రాష్ట్రంలో నంబర్ 1..

దేశంలో 165

- ‘స్వచ్ఛ సర్వేక్షన్’లో రామగుండం ర్యాంకులివి

గోదావరిఖని, వెలుగు: స్వచ్ఛ సర్వేక్షణ్ 2019-2020 మొదటి త్రైమాసికంలో రామగుండం కార్పొరేషన్ దేశవ్యాప్త నగరాలతో పోటీ పడి 165 ర్యాంకు సాధించి రాష్ట్రంలోని నగరాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రామగుండం కార్పొరేషన్ ముందు వరుసలో నిలవడంపై రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ర్యాంకు సాధించడానికి కృషి చేసిన నగర పాలక సంస్థ, మెప్మా సిబ్బందికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2020 తుది ఫలితాల్లో రామగుండం నగరం దేశంలోనే అత్యుత్తమ ర్యాంకు సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

భూముల్ని దొరలు గుంజుకుంటున్నరు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

యాదగిరిగుట్ట/ఆలేరు, వెలుగు: తెలంగాణ సాయుధ పోరాటంలో ఆరుట్ల కమలాదేవి చూపించిన ప్రతిభ, తెగువ ప్రతి కమ్యూనిస్టుకు ఆదర్శమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి 18వ వర్ధంతి సందర్భంగా యాదాద్రి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ దున్నేవారిదే భూమి అనే నినాదంతో 10 లక్షల ఎకరాలు పంచితే, తిరిగి దొరలు ఆ భూములును గుంజుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ పోరాట స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నారని, ఈ తరుణంలో కమ్యూనిస్టులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు 9 మందిని ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం యాదగిరిగుట్ట పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని మతాల మధ్య చిచ్చు పెట్టి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందన్నారు. తెలంగాణలో చట్టాన్ని అమలు చేయబోమని కేసీఆర్ ప్రకటించకపోవడం సరికాదన్నారు. కేసీఆర్, బీజేపీలు పూర్తిగా ప్రజావ్యతిరేక పాలన చేస్తున్నాయన్నారు. కేసీఆర్దేవుడి పట్ల దొంగ భక్తిని చూపిస్తున్నాడని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన, ఎన్నార్సీ చట్టంపై నిరసనగా ఈ నెల 8న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని, దీనిలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఆసిఫాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు బ్లాంకెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు

బొకేలకు బదులు బ్లాంకెట్లు

ఆదిలాబాద్, ఆసిఫాబాద్, వెలుగు: నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసే అధికారులు, ఇతరులు ఎవరైనా సరే బొకేలకు బదులు బ్లాంకెట్లు ఇవ్వాలన్న ఆదిలాబాదు జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్, కుమ్రంభీం ఆసిఫాబాద్జిల్లా కలెక్టర్రాజీవ్ గాంధీ హనుమంతు సూచనకు మంచి స్పందన వచ్చింది. కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్లకు బ్లాంకెట్లు, దుప్పట్లు, స్వెటర్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇలా వచ్చిన వాటిని వృద్ధులు, నిరుపేదలు, అనాథ ఆశ్రమాలకు అందించనున్నట్లు కలెక్టర్ దివ్య దేవరాజన్ తెలిపారు. ఆసిఫాబాద్లో కలెక్టర్కు అందించిన బ్లాంకెట్లను పట్టణంలోని పీటీజీ గురుకుల స్కూల్లో స్టూడెంట్లకు అందజేశారు.




ఆదిలాబాద్ కలెక్టర్ దివ్య దేవరాజన్కు బ్లాంకెట్లు, దుప్పట్లు అందిస్తున్న అధికారులు


రాత్రిపూట ఎత్తుకెళ్లి చిన్నారిపై అఘాయిత్యం


మహాముత్తారం, వెలుగు: నాలుగేళ్ల చిన్నారిపై పెద్దనాన్న వరుసయ్యే వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కోణంపేట గిరిజన గ్రామంలో జరిగింది. పోలీసులు, చిన్నారి తల్లి, గ్రామస్థుల వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి ఇంట్లో చిన్నారి, తల్లి, అమ్మమ్మ కలిసి 9 గంటలకే పడుకున్నారు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో భూపాలపల్లి మండలం నాగారం గ్రామానికి చెందిన రాస కొంరయ్య ఇంట్లోకి చొరబడి నిద్రలో ఉన్న చిన్నారిని ఎత్తుకెళ్లాడు. సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసి అక్కడే వదిలేసి పరారయ్యాడు. 3 గంటల ప్రాంతంలో తల్లి కూతురు లేదని గమనించి ఊరంతా వెతికింది. తెల్లవారుజామున 7 గంటల సమయంలో చిన్నారి ఏడ్చుకుంటూ అటవీ ప్రాంతం నుంచి వచ్చింది. విషయం చెప్పడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు చిన్నారిని పరీక్షల కోసం హాస్పిటల్కు తరలించారు.

పెద్దనాన్న వరుస..

చిన్నారి తల్లి నాలుగేళ్ల క్రితం భూపాలపల్లి మండలం నాగారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో సహజీవనం చేసింది. ఈ క్రమంలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. కొన్ని రోజుల తర్వాత ఆ వ్యక్తి మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తి సోదరుడే రాస కొంరయ్య. మంగళవారం రాత్రి కొంరయ్య కోణంపేటలో కనబడినట్లు గ్రామస్థుల ద్వారా తెలిసింది. నిందితుడిని పట్టుకునేందుకు నాలుగు టీంలను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ బోనాల కిషన్ తెలిపారు.







ఓటరు లిస్టులో ‘బహగదజడప, తెలంగాణ తెలంగాణ, రకగబహ’ అంటూ తప్పులతడకగా ఉన్న పేర్లు

ఓటరు లిస్టులో అన్నీ తప్పులే!

- హుస్నాబాద్లో నేతల నిరసన

హుస్నాబాద్, వెలుగు: హుస్నాబాద్ మున్సిపాలిటీలోని ఓటర్ లిస్టులో పేర్లు తప్పుల తడకగా ఉన్నాయని పలు రాజకీయ పార్టీల నేతలు అన్నారు. ఓటర్ లిస్టులో దొర్లిన తప్పులపై సవరణలు చేసేందుకు మున్సిపల్ అధికారులు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులు ఉండగా ఇటీవల అధికారులు వార్డుల విభజన ప్రక్రియను యాంటీ క్లాక్ పద్ధతిలో చేపట్టారని అన్నారు. గతంలో ఉన్న వార్డులోని ఒక కుటుంబానికి చెందిన ఓటర్ల వివరాలు మరో వార్డులో వచ్చాయని, కొన్ని పేర్లు గల్లంతయ్యాయని పేర్కొన్నారు. ఓటర్ల పేర్లు, ఫొటోలు తప్పుగా వచ్చాయన్నారు. సంవత్సరం క్రితం చనిపోయిన వారి పేర్లను తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తప్పులతడకగా ఉన్న జాబితా వల్ల రిజర్వేషన్ల ఖరారులో అన్యాయం జరిగే ప్రమాదముందన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు సవరించిన తర్వాతే రిజర్వేషన్లు ఖరారు చేయాలంటూ సమావేశాన్ని బహిష్కరించి కమిషనర్కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, డీసీసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లేశ్, బీజేపీ పట్టణాధ్యక్షులు శంకర్బాబు, టీడీపీ, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం అందజేస్తున్న వివిధ పార్టీల నాయకులు






సరళాసాగర్ ఖాళీ

వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని సరళాసాగర్ రిజర్వాయర్ ఖాళీ అయిపోయింది. ప్రాజెక్టు కింద 4,200 ఎకరాల ఆయకట్టు ఉంది. రెండ్రోజుల క్రితం వరకు నిండుకుండలా ఉన్న ఈ ప్రాజెక్టుకు మంగళవారం గండిపడిన విషయం తెలిసిందే. బుధవారానికి మొత్తం ఖాళీ అయింది. ప్రజలు తరలివచ్చి ప్రాజెక్టు గుంతల్లో నిలిచిన నీటిలో చేపలు పట్టారు.

\- వనపర్తి, వెలుగు

కాశ్మీర్ పేరు వినగానే టూరిజం గుర్తుకువస్తుంది. కాశ్మీర్ అందాలు టూరిస్టులను కళ్లు తిప్పుకోనివ్వవు. అందానికి అందమైన కాశ్మీర్ లో సినిమా షూటింగ్‌లు కూడా ఎక్కువే. అయితే కొద్దికాలంగా అక్కడి పరిస్థితులు మారిపోయాయి. సినిమా షూటింగ్‌లు తగ్గిపోయాయి. దీంతో సినిమా ఇండస్ట్రీ వాళ్లను మళ్లీ ఆహ్వానించారు కాశ్మీర్ గవర్నర్ సలహాదారుడు ఫరూఖ్ ఖాన్. ఎంచక్కా షూటింగ్ లు చేసుకోండన్నారు.



సిన్మావాళ్లను కాశ్మీర్ పిలుస్తోంది!

కాశ్మీర్ అంటేనే పచ్చదనానికి మరో పేరు. ఎటు చూసినా ప్రకృతికి చీరకట్టినట్లు ఉంటుంది. కాశ్మీర్ అందాలకు టూరిస్టులే కాదు సినిమా వాళ్లు కూడా ఫిదా అవుతుంటారు. దీంతో షూటింగ్‌ల కోసం కాశ్మీర్ కు వస్తుంటారు. కాశ్మీర్ లోయలో ఎప్పుడు చూసినా ఏదో ఒక సినిమా షూటింగ్ జరుగుతూనే ఉంటుంది. అయితే ఇదంతా గతం. జమ్మూ కాశ్మీర్ లో టెర్రరిస్టు యాక్టివిటీస్ పెరగడంతో సినిమా వాళ్లు అక్కడకు వెళ్లడం మానేశారు. ఆ తరువాత జమ్మూ కాశ్మీర్ కు ప్రత్యేక అధికారాలు కట్టబెట్టే ఆర్టికల్ 370 రద్దుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. రకరకాల భయాలు, అపోహలతో సినిమా వాళ్లు షూటింగ్ ల కోసం రావడం తగ్గిపోయింది. ఎక్కడా సినిమా వాళ్ల సందడే లేదు. ఈ పరిస్థితుల్లో గవర్నర్ ఎల్జీ ముర్ము కు సలహాదారుడిగా ఉన్న ఫరూఖ్ ఖాన్ రంగంలోకి దిగారు. లేటెస్ట్ గా జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఎప్పటిలాగానే కాశ్మీర్ కు వచ్చి షూటింగ్ లు చేసుకోవాల్సిందిగా సినిమా వాళ్లను కోరారు.

టూరిజమే ప్రధాన రాబడి

కాశ్మీర్ కు ప్రధాన రాబడి టూరిజం నుంచే వస్తోంది. ఒకప్పుడు టూరిస్టులతో, షూటింగ్ లకు వచ్చే సినిమా వాళ్లతో కాశ్మీర్ ప్రాంతం అంతా సందడిగా ఉండేది. ఆర్టికల్ 370 రద్దు తరువాత టూరిస్టుల సంఖ్య బాగా తగ్గింది. కొంతకాలం పాటు కాశ్మీర్ అంతటా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల్లో సినిమా వాళ్లు రావడం మానేశారు. దీంతో రాబడి లేకపోవడంతో కాశ్మీర్ ఖజానా ఖాళీ అయ్యే పరిస్థితులు వచ్చాయి. కాశ్మీర్ ను టెర్రరిస్టు హబ్ గా కాకుండా భూమ్మీద స్వర్గంగా చూడాలంటున్నారు.

గుల్‌మార్గ్ అందాలు

హిందీ సినిమాలు చూసేవాళ్లకు గుల్‌మార్గ్ అందాలు కొత్త కావు. 'బాబీ', 'హైదర్', 'జబ్ తక్ హై జాన్'. 'ఆప్ కీ కసమ్' వంటి అనేక సినిమాల్లో గుల్ మార్గ్ అందాలను అద్భుతంగా చూపించారు.

లడఖ్ లోనూ

సహజంగా సినిమా షూటింగ్ లన్నీ కాశ్మీర్ లోనే ఎక్కువగా జరుగుతాయి. కాశ్మీర్ లోయలోనే కాదు, లడఖ్ లోనూ అందమైన లొకేషన్లు ఉన్నాయి. అమీర్ ఖాన్ నటించిన 'త్రీ ఇడియట్స్' సినిమా కొంతభాగం షూటింగ్ లడఖ్ లోనే జరిగింది.

పాటలంటే కాశ్మీర్ వెళ్లాల్సిందే

బాలీవుడ్ సినిమాల్లో ఎక్కువగా సాంగ్స్ పిక్చరైజేషన్ ను కాశ్మీర్‌లోనే షూట్ చేసేవారు. కొన్ని సినిమాలైతే పూర్తిగా కాశ్మీర్ లోనే షూటింగ్ జరుపుకున్నాయి. వీటిలో ప్రముఖంగా చెప్పుకోవాల్సింది 'నోట్ బుక్' సినిమాను. ఈ ఏడాది రిలీజైన 'నోట్ బుక్' ను టోటల్ గా కాశ్మీర్ లోయలోనే షూట్ చేశారు. కిందటేడాది రిలీజైన 'రాజి' సినిమా షూటింగ్ కూడా కాశ్మీర్ లోయలోనే జరిగింది. కాశ్మీర్ బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా తీశారు. ఇందులో అలియా భట్....ఒక కాశ్మీరీ అమ్మాయిగా నటించింది. 2016లో విడుదలైన 'ఫితూర్' సినిమా ను కూడా కాశ్మీర్ లోని డాల్ సరస్సు చుట్టుపక్కల షూట్ చేశారు. అలాగే పహల్ గావ్ అందాలను సిల్వర్ స్క్రీన్ పై అద్భుతంగా చూపించిన సినిమా 'హై వే'. పహల్ గావ్ లోని ట్రెక్కింగ్ స్పాట్లలో ఈ సినిమా మెజారిటీ పార్ట్ ను షూట్ చేశారు.



'త్రీ ఇడియట్స్' షూటింగ్ దృశ్యం

డాల్ సరస్సు బ్యాక్ డ్రాప్‌లో పిక్చరైజేషన్

కాశ్మీర్ లోని రెండో అతి పెద్ద సరస్సు...డాల్ లేక్. 26 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ సరస్సు శ్రీనగర్ లోని మేజర్ టూరిస్టు స్పాట్ లలో ఒకటి. కాశ్మీర్ కు వచ్చిన టూరిస్టులు డాల్ సరస్సులో పడవ ఇళ్లల్లో ప్రయాణం చేసి గొప్ప థ్రిల్ ఫీలవుతుంటారు. అద్భుతమైన ప్రకృతి సౌందర్యం, అందమైన డాల్ లేక్ బ్యాక్ డ్రాప్ లో అనేక సినిమా సాంగ్స్ ను పిక్చరైజ్ చేశారు.

గుళ్లు, గోపురాలు

కాశ్మీర్ లో సరస్సులే కాదు అనేక చారిత్రక గుళ్లు, గోపురాలు కూడా ఉన్నాయి. వీటిలో జమ్మూలోని వైష్ణోదేవి ఆలయం ముఖ్యమైనది. వేల ఏళ్ల కిందట ఈ గుడిని నిర్మించారని చెబుతారు. భైరవ్ అనే ఓ బ్రహ్మ రాక్షసుడిని వైష్ణోదేవి హతమార్చిందని చరిత్ర చెబుతోంది. ఆ సమయంలో ఆ రాక్షసుడి తల తెగి అక్కడి లోయలో పడిందని చెబుతారు. కురుక్షేత్ర యుద్ధం జరగడానికి ముందు వైష్ణోదేవిని పూజించాలని అర్జునుడికి శ్రీకృష్ణుడు సూచించాడట. దీంతో వైష్ణోదేవిని అర్జునుడు పూజించి యుద్ధానికి బయల్దేరాడని చరిత్రకారులు అంటారు.

జమ్మూలో రఘునాథ మందిరం

జమ్మూ ప్రాంతంలో కూడా అనేక చూడదగ్గ ప్రదేశాలున్నాయి. వీటిలో ముఖ్యమైంది రఘునాథ్ మందిరం. జమ్మూ నగరానికి మధ్యలో ఉంటుంది. 1822లో మందిర నిర్మాణం ప్రారంభమైతే 1860కు కానీ పూర్తి కాలేదు. విశాలమైన ముఖద్వారం, లోపల పాలరాతి నేల చూడగానే ఆకట్టుకుంటుంది రఘునాథ ఆలయం. బయటి ద్వారంపై రంగురంగుల దేవతల బొమ్మలు ...గుడి అందాలకు ఎవరైనా సరే ఫిదా కావలసిందే. వాస్తవానికి ఇది ఒక మందిరం కాదు, మందిర సముదాయం. ఈ ప్రాంగణంలో మొత్తం ఏడు మందిరాలున్నాయి.



'జంగ్లీ'లో ఒక సన్నివేశం

బాలీవుడ్‌కు ఫేవరేట్

'యాహూ....చాహె కోయి ముఝే జంగ్లీ కహే...' అంటూ జంగ్లీ సినిమాలో (1961) షమ్మీ కపూర్ వెరైటీగా డ్యాన్స్ చేసింది కాశ్మీర్ లోనే. కాశ్మీర్ తో సినిమా ఇండస్ట్రీ రొమాన్స్ ఇవాళ్టిది కాదు. చాలా ఏళ్లుగా ఈ రొమాన్స్ కొనసాగుతోంది. అలనాటి షర్మిలా ఠాగూర్ నుంచి ఈతరం హీరో షారూఖ్ ఖాన్ వరకు అందరూ .....కాశ్మీర్ పై మనసు పారేసుకున్న వాళ్లే. ఇక్కడ రొమాంటిక్ పాటలు పాడినవాళ్లే. కాశ్మీర్ బ్యాక్ డ్రాప్‌లో 'కాశ్మీర్ కీ కలి' పేరుతో ఏకంగా ఒక సినిమానే వచ్చింది. డాల్ సరస్సులో ఈ సినిమాలోని పాటలను షూట్ చేశారు. చుట్టూ కొండలు...ఆ కొండల మధ్య గలగలాపారే సెలయేరు... ఈ అందమైన లొకేషన్ లో 'సిల్ సిలా', 'జబ్ జబ్ ఫూల్ ఖిలే' వంటి బోలెడన్ని బాలీవుడ్ సినిమాల షూటింగ్ లు జరిగాయి.


అవంతీపూర్ ఆలయం



జమ్మూలోని ప్రముఖ ఆలయాల్లో అవంతీపూర్ ఒకటి. అవంతీరామన్ ఈ ప్రాంతాన్ని పాలించిన సమయంలో ఈ గుడి కట్టినట్టు చరిత్రకారులు చెబుతారు. మౌలికంగా ఇది విష్ణువు ఆలయం. 18వ శతాబ్దంలో ఈ ఆలయం నుంచి అనేక విగ్రహాలను బ్రిటిష్ వాళ్లు ఇంగ్లాండ్ లోని మ్యూజియమ్ లకు తరలించినట్లు చెబుతారు. ప్రస్తుతం ఈ గుడి శిథిలావస్థలో ఉంది.

టాలీవుడ్ ఫిదా

కాశ్మీర్ అందాలకు టాలీవుడ్ కూడా ఫిదా అయింది. అనేక తెలుగు సినిమాల పాటలను ఇక్కడ షూట్ చేశారు. 90ల వరకు సాంగ్స్ తీయడానికి విదేశాలకు వెళ్లే అలవాటు తెలుగు దర్శకులకు పెద్దగా ఉండేది కాదు. అందమైన లొకేషన్ లో పాట తీయాలంటే ప్రొడ్యూసర్లకు వెంటనే గుర్తుకువచ్చేది కాశ్మీరే. తెలుగులో టాప్ హీరోలందరి సినిమాలు దాదాపుగా కాశ్మీర్ లో షూటింగ్ జరుపుకున్నవే. వీటిలో 'రౌడీ రాముడు కొంటె కృష్ణుడు ', ' చీకటి వెలుగులు', 'శ్రీవారి ముచ్చట్లు' 'రాక్షసుడు', 'స్వర్ణ కమలం', 'పసివాడి ప్రాణం' వంటి అనేక సినిమాలు ఉన్నాయి. 'పసివాడి ప్రాణం' సినిమాలోని 'కాశ్మీర్ లోయలో కన్యాకుమారిలో ....' అనే పాటను కాశ్మీర్ అందాల బ్యాక్ డ్రాప్ లో తీశారు. 1995 తరువాత కాశ్మీర్ లో టాలీవుడ్ సినిమాల షూటింగ్ కొంతమేర తగ్గింది. అయితే ఈమధ్య మళ్లీ టాలీవుడ్ డైరక్టర్స్ కాశ్మీర్ బాట పడుతున్నారు. లేటెస్ట్ గా 'వెంకీ మామ' 'సరిలేరు నీకెవ్వరు' సినిమాను కూడా కాశ్మీర్ లో షూట్ చేశారు.



'సరిలేరు నీకెవ్వరు'లో మహేష్ బాబు

ఏమన్నారంటే..



బీజేపీ అడ్డుపడింది

స్కూల్ పిల్లల ఎగ్జామ్ ఫీజు కట్టాలని మేం నిర్ణయించాం. బీజేపీ అడ్డుపడి ఆ పథకాన్ని పట్టాలు తప్పించింది.

– మనీశ్ సిసోడియా, ఢిల్లీ డిప్యూటీ సీఎం



ఆయనా లీడరేనా?

టీడీపీ అపొజిషన్ పార్టీయేనా? చంద్రబాబు కూడా ఒక లీడరేనా?. ఆయన వాన్‌పిక్ భూములపై చర్యలెందుకు తీసుకోలేదు?

– తమ్మినేని సీతారాం, ఏపీ స్పీకర్



కర్ణాటకలో కలపండి

మంత్రాలయం సెగ్మెంట్‌ని కర్ణాటకలో కలపాలి. ఈ ప్రాంతం పేరుకే ఏపీలో ఉంది. కల్చర్ మొత్తం కర్ణాటకదే. గతంలోనూ ఆ రాష్ట్రంలోనే ఉండేది.

– తిక్కారెడ్డి, టీడీపీ నేత



ఎవరు నడిచారిక్కడ?

ఖోజీలు... సరిహద్దుల వెంట గస్తీ కాసే మనుషులు. పాత రోజుల నాటి ఇన్‌ఫార్మర్ వ్యవస్థకు గుర్తులుగా మిగిలారు. సరిహద్దులు దాటి ఎవరైనా మన భూభాగంలోకి ఎంటరైతే వెంటనే పసిగట్టేస్తారు. చీకటితోనే ఖోజీల వేట మొదలవుతుంది. ఇసుకలో బూట్ల ముద్రలు కనబడితే చాలు. వాళ్ల గుట్టుమట్లన్నీ కనిపెట్టి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కి అందజేస్తారు. కాలి గుర్తులు ఒంటెవా, మనిషివా అన్నది చిన్నప్పట్నుంచే ఎడారిలో తిరిగేవాళ్లకు తెలుస్తుంది. దేశానికి ఇంతగా సేవలు చేసే ఖోజీలు ఇప్పుడు కనిపించకుండా పోతున్నారు.



ఎడారి ప్రాంతం అంటే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఎటు చూసినా ఇసుక తిన్నెలే తప్ప మనిషి అనేవాడే కనిపించడు. అలాంటి ఎడారిలోకి పరాయి దేశం నుంచి అక్రమంగా ఎవరైనా ఎంటరైతే...? ఎడారి అంటే ఇసుకే కదా...అలాంటి ఇసుకలోకి బయటి దేశపోడు ఎంట్రీ ఇచ్చినా ఎవరూ పసిగట్టలేరని అనుకుంటాం. అయితే అది అపోహ మాత్రమే. ఇసుకలో బూట్ల ముద్రలను చూసి (కొన్ని సందర్భాల్లో పాదముద్రలుకూడా) వచ్చిన వాళ్ల జాడ కనిపెట్టడం ఒక విద్య. ఆ విద్య చాలా కొద్దిమందికే తెలుసు. వాళ్లే...ఖోజీలు! రాజస్థాన్ ఎడారుల్లో ఇండో-పాకిస్థాన్ సరిహద్దుల్లో గస్తీ కాస్తుంటారు వీళ్లు. ఖోజీ పని చేయడానికి మామూలు తెలివితేటలు సరిపోవు. హై లెవెల్ ఇంటెలిజెన్స్ ఉండాలి. కేవలం బూట్ల ముద్రలు చూసి ఆ వ్యక్తి వయసు, బరువు వంటి అనేక విషయాలను నిర్ధారించగల టాలెంట్ ఉండాలి. ఖోజీల పని అంతా పరిశీలన మీదే ఆధారపడి ఉంటుంది. ఖోజీలుగా ఉద్యోగంలో తీసుకున్నవారికి ఇందుకు సంబంధించి కొంతకాలం ట్రైనింగ్ ఇస్తారు. ఆ తరువాత రాజస్థాన్ ఎడారుల్లో పోస్టింగ్ ఇస్తారు. 'బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)' కంట్రోల్‌లో ఈ ఖోజీలు పనిచేస్తుంటారు. ఇక్కడి ఇండో-పాకిస్థాన్ వెంట ఉన్న 471 కిలోమీటర్ల సరిహద్దు ప్రాంతంలో వీళ్లు గస్తీ కాస్తుంటారు. తొలి రోజుల్లో ఈ పని చేయడానికి వందలాది మంది ఖోజీలు ఉండేవారు. అయితే ప్రస్తుతం వీళ్ల సంఖ్య పాతికకు మించడం లేదు.



తెల్లవారుజామునే డ్యూటీకి 'ఖోజీ'

'ఖోజీ'ల డ్యూటీ తెల్లవారుజామునే మొదలవుతుంది. తెలతెలవారుతుండగానే ఎడారి ఇసుకలో ఖోజీలు వేట మొదలెడతారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఎడారి ఇసుకను పరిశీలిస్తూ ముందుకు సాగుతుంటారు. ఖోజీల నడక కూడా చాలా ఫాస్ట్ గా ఉంటుంది. రెండున్నర గంటల్లో ఒక్కో ఖోజీ దాదాపు పది కిలోమీటర్లు శత్రువులకోసం ఇసుకలో వెయ్యి కళ్లు వేసి మరీ నడుస్తారు. అలా అని పరుగెత్తుకుంటూ పోరు. ఇసుక తిన్నెలను భూతద్దం పెట్టినట్టు అణువణువూ వెతుకుతారు. డేగ కళ్లతో ఆసాంతం పరిశీలిస్తారు. ఎక్కడైనా బూట్ల ముద్ర కనిపిస్తే టక్కున అక్కడ ఆగిపోతారు. బూట్ల ముద్ర ఆధారంగా ఆ వ్యక్తి వయసు ఎంతుంటుందో అంచనా వేస్తారు. బూట్ల ముద్రల వెంట నడుచుకుంటూ వెళ్తారు. వీలు చూసుకుని పై అధికారులకు బయటి దేశపోడు జొరబడ్డ విషయాన్ని చేరవేస్తారు.

చిన్నప్పటి నుంచే...

ఎడారులకు దగ్గర్లో ఉండే గ్రామాలకు చెందినవాళ్లే ఎక్కువగా ఖోజీలుగా పనిచేస్తుంటారు. ఎడారుల్లో ఒంటెలు ప్రయాణించే తీరును చిన్నప్పటి నుంచే పరిశీలిస్తుంటారు. దీంతో మనిషి బూటు ముద్రకు, ఒంటె లేదా ఇతర జంతువు పాదముద్రకున్న తేడా ఇట్టే పట్టేస్తారు. ఈ విద్యలో మెజారిటీ ఖోజీలకు గులాబ్ సింగ్ ట్రైనింగ్ ఇచ్చారు. గులాబ్ సింగ్ రెండేళ్ల కిందటి వరకు బీఎస్ఎఫ్‌లో పనిచేసి రిటైరయ్యారు. బీఎస్ఎఫ్‌కు ఖోజీలను ఒక ప్లస్ పాయింట్ అని ఆయన అంటారు.

ఎంటరైతే పట్టుకోవడం ఈజీనే

సరిహద్దులు దాటి రాజస్థాన్ ఎడారుల్లోకి ఎవరైనా ప్రవేశిస్తే పట్టుకోవడం ఈజీనే అంటున్నారు బీఎస్ఎఫ్ అధికారులు. ఎందుకంటే, సరిహద్దు ప్రాంతం నుంచి దగ్గరలోని పట్టణం దూరం కనీసం 50 కిలోమీటర్ల పైనే ఉంటుంది. ఎడారిలో నడుచుకుంటూ అక్కడి దగ్గర్లోని టౌన్‌కు చేరుకునేటప్పటికే బలగాలకు సమాచారం అందుతుంది. ఎటు నుంచి వచ్చినా వల పన్ని చొరబడ్డ వ్యక్తిని పట్టుకుంటారు.



సరిహద్దుల వెంట హై సెక్యూరిటీ

ఇండో–పాకిస్థాన్ సరిహద్దుల వెంట ఉన్న రాజస్థాన్ ఎడారులు మన దేశ భద్రతకు సంబంధించి కీలకమైన ప్రాంతం. రెండు దేశాల సైనికుల మధ్య కాల్పులు జరిగిన దాఖలాలు కూడా కొన్నేళ్లుగా లేవు. అయితే డిఫెన్స్ పరంగా కీలక ప్రాంతం కావడంతో రాజస్థాన్ ఎడారులపై కేంద్ర ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. సరిహద్దుల వెంట రాత్రిపూట ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసింది. ఫెన్సింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేసింది. రాత్రింబవళ్లు నిఘా పెట్టింది. దీంతో ఈ సరిహద్దుల నుంచి మన దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారి సంఖ్య బాగా తగ్గింది. కొన్నేళ్ల కిందటి వరకు బంగారం, మత్తుపదార్థాల స్మగ్లింగ్ జరుగుతుండేది. అయితే సాయుధ బలగాలు పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో ఈ స్మగ్లింగ్ కూడా ఆగిపోయింది.



చిలిపి భీష్ముడు

భీష్మ.. టైటిల్‌తోనే బోలెడంత ఆసక్తిని రేపాడు నితిన్. ఆ తర్వాత ఫస్ట్ లుక్, టీజర్లతో ఇంప్రెస్ చేశాడు. ఇటీవలే సింగిల్స్ యాంథమ్ రిలీజై మ్యూజిక్ ప్రియులను అలరించింది కూడా. ఇప్పుడు న్యూ ఇయర్ కానుకగా రిలీజైన పోస్టర్‌లో నితిన్ లుక్ యూత్‌కి కనెక్టయ్యేలా ఉంది. బ్లాక్ డ్రెస్ వేసుకుని చేతిలో ఎర్ర గొడుగు పట్టుకుని రష్మిక వెంటపడుతున్నాడు నితిన్. ఎల్లో డ్రెస్ వేసుకుని, గాగుల్స్ పెట్టుకుని స్టైల్‌గా నిల్చుంది రష్మిక. పోస్టర్ అయితే ఇంట్రెస్టింగ్‌గా ఉంది. మరి ఈ భీష్ముడు రష్మికను ఎలా ఇంప్రెస్ చేస్తాడో, తన చిలిపి వేషాలతో ప్రేక్షకులను ఇంకెంత మెస్మరైజ్ చేస్తాడో.

సమ్మర్‌లో క్రాక్

రవితేజ, గోపీచంద్ మలినేని కాంబోలో తెరకెక్కనున్న చిత్రం ‘క్రాక్’. డాన్ శీను, బలుపు చిత్రాల తర్వాత వీరి కలయికలో ఇది మూడో చిత్రం. న్యూ ఇయర్ సందర్భంగా ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. పోలీస్ ఆఫీసర్ గెటప్‌లో రవితేజ మాస్ లుక్‌లో ఉన్నాడు. యూనిఫామ్, ఇంటెన్స్ లుక్, చేతిలో గోలీసోడా పట్టుకుని డిఫరెంట్‌గా కనిపిస్తున్నాడు. చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. నిజ జీవితంలో సంఘటనలను ఆధారంగా చేసుకుని అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా గోపీచంద్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఈ ఏడాది సమ్మర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బి.మధు నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం సమకూరుస్తున్నాడు. మెర్సల్, బిగిల్ చిత్రాలలో విజువల్ బ్యూటీ అందించిన జి.కె.విష్ణు సినిమాటోగ్రాఫర్. రవితేజ సరసన శృతిహాసన్ నటిస్తుండగా... సముద్రఖని, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.





టీజర్ వస్తోంది

విజయ్ దేవరకొండ హీరోగా క్రాంతి మాధవ్ దర్శకత్వంలో కె.ఎస్. రామారావు నిర్మాతగా ‘వరల్డ్ ఫేమస్ లవర్’ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. రాశీఖన్నా, క్యాథరీన్ థ్రెసా, ఇజబెల్లె లీట్‌ల పోస్టర్స్ సినిమాపై క్రేజ్‌ని పెంచాయి. షూటింగ్ తుది దశకు చేరుకుంటున్న సందర్భంగా టీజర్, ట్రైలర్‌లతో సినిమాపై అంచనాలు పెంచే పనిలో పడ్డారు టీమ్. జనవరి 3న టీజర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ‘అర్జున్ రెడ్డి’ సినిమాతో తన నటనలో ఉన్న సత్తాని ప్రేక్షకులకు పరిచయం చేశాడు విజయ్. ఇప్పుడు ‘వరల్డ్ ఫేమస్ లవర్’గా ఎంతమందిని ఆకట్టుకోనున్నాడో టీజర్‌తో స్పష్టమవుతుంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న సినిమా రిలీజ్ కానుంది.




అజయ్ కథుర్వర్, డింపుల్ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం ‘విశ్వక్’. వేణు ముల్కల దర్శకత్వంలో తాటికొండ ఆనందం బాలక్రిష్ణన్ నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అజయ్ వెనుక పేపర్ కటింగ్స్ ఓ బోర్డ్‌కు పిన్ చేసినట్లున్నాయి. ప్రపంచ వాణిజ్యాన్ని శాసించే స్టార్టప్ కంపెనీల కథాంశంతో ‘విశ్వక్’ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇండియాలో ప్రారంభమైన కొన్ని స్టార్టప్ కంపెనీలు, వాటిని ఏర్పాటు చేసిన యువత ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు అనే అంశంపై ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. త్వరలోనే టీజర్‌ను విడుదల చేయడానికి యూనిట్ ప్లాన్ చేస్తోంది. సత్యసాగర్ సంగీతం, ప్రదీప్ దేవ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.



నిశ్శబ్ద సౌందర్యం

అనుష్క ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం ‘నిశ్శబ్దం’. న్యూఇయర్ కానుకగా ఈ చిత్రానికి సంబంధించిన అనుష్క పోస్టర్‌ను విడుదల చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మాధవన్, అంజలి, షాలినీ పాండే, సుబ్బరాజు తదితరులు కీలకపాత్రలు పోషించారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన వచ్చింది. త్వరలో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించడానికి దర్శక నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. భాగమతి తర్వాత అనుష్క ప్రధాన పాత్రలో రాబోతున్న ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి.



ఫస్ట్ గ్లింప్స్ వచ్చింది

నాని సమర్పణలో విశ్వక్ సేన్ హీరోగా రూపొందుతున్న చిత్రం ‘హిట్’. ‘ది ఫస్ట్ కేస్’ అనేది ట్యాగ్ లైన్. శైలేష్ కొలను దర్శకత్వంలో ప్రశాంతి త్రిపురనేని నిర్మిస్తున్నారు. రుహానీ శర్మ హీరోయిన్. విశ్వక్ సేన్ ఇందులో విక్రమ్ రుద్రరాజు అనే ఐపీఎస్ ఆఫీసర్‌గా నటిస్తున్నాడు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ‘ఒకసారి ఇలాంటి ఇన్సిడెంటే నీ లైఫ్‌లో జరిగినప్పుడు యు లాస్ట్ సమ్ వన్ యు లవ్డ్. ఇప్పుడు మళ్లీ అలాంటి సిట్యుయేషనే వచ్చింది. వాట్ యు వాంట్ టు డు అబౌట్ ఇట్’ అనే డైలాగ్‌తో సినిమాపై ఆసక్తి ఏర్పడింది. అలాగే పోలీస్ ఆఫీసర్ అయిన విశ్వక్ సేన్ ఎవరినో వెతుక్కుంటూ ఓ ఇంట్లోకి వెళ్లే సన్నివేశాన్ని చూడొచ్చు. వివేక్ సాగర్ సంగీతం.. మణికందన్ సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రధాన ఆకర్షణ. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఫిబ్రవరి 28న విడుదల.




రూటే సెపరేటు

అంతగా సినిమాలు చెయ్యకపోయినా గుర్తింపు తెచ్చే పాత్రలే చేస్తూ బ్యాలెన్స్‌డ్‌గా కెరీర్‌ని ప్లాన్ చేసుకుంటోంది రెజీనా. అ, సెవెన్, ఎవరు లాంటి సినిమాలు ఆమెకి మంచి పేరు తెచ్చిపెట్టాయి. మళ్లీ ఇప్పుడో డిఫరెంట్ పాత్రలో కనిపించనుంది. తమిళ దర్శకుడు కార్తిక్ రాజు డైరెక్షన్‌లో మొదలవనున్న కొత్త చిత్రంలో ఓ వెరైటీ రోల్ చేస్తోంది. ఫిమేల్ సెంట్రిక్ కథ అయిన ఈ సినిమాలో రెజీనా ఆస్ట్రాలజర్‌గా కనిపించనుందట. ఇదిలా ఉండగా చిరంజీవి 152వ చిత్రంలో కూడా కనిపించనుందనే వార్త గుప్పమంది. కొరటాల శివ తియ్యబోయే ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌లో మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనుందట. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు కాబట్టి అదెంత నిజమో తెలియదు కానీ మొత్తానికి రెజీనా రూటే సెపరేటు అని మాత్రం తెలుస్తోంది.

మాస్టర్ ప్లాన్ వేశాడు

కోలీవుడ్‌లో విజయ్ సినిమా రిలీజయ్యిందంటే పెద్ద సంచలనమే. పోయినేడు దీపావళి కానుకగా విడుదలైన ‘విజిల్’ మూడు వందల కోట్లు సాధించి విజయ్ కెరీర్‌లోనే అతి పెద్ద హిట్స్‌లో ఒకటిగా నిలిచింది. ఆ సందడిలోనే లోకేష్ కనకరాజ్‌తో కలిసి దళపతి 64వ సినిమా ప్లాన్‌ను వెల్లడించాడు. ఆల్రెడీ ఈ సినిమా శాటిలైట్ హక్కులను సన్ టీవీ సొంతం చేసుకున్నట్లు ప్రకటించింది కూడా. కొత్త సంవత్సరం అభిమానులకు ట్రీట్‌గా పోస్టర్‌ని రిలీజ్ చేశారు. దాన్ని బట్టి ఈ మూవీకి ‘మాస్టర్’ అనే టైటిల్ ఫిక్స్ చేసినట్టు తేలింది. విజయ్ ముదురు నీలం రంగు షర్ట్ వేసుకుని, టేబుల్‌పై చేతి కడియాన్ని తిప్పుతూ సీరియస్ లుక్కుతో కళ్లు మాత్రమే స్పష్టంగా కనిపించేలా ఉండి మిగతా చిత్రమంతా బ్లర్‌గా ఉంది. చూసే వాళ్లకి ఏదో మాస్టర్ ప్లాన్ వేస్తున్నాడు కొంచెం కేర్‌ఫుల్‌గా ఉండమని హెచ్చరిస్తున్నట్టుగా ఉంది. పోస్టర్‌తోనే ఇంత అలజడి సృష్టిస్తున్నాడంటే తెరమీదకొచ్చాక ఇంకెంత రచ్చ చేస్తాడో అంటున్నారు ఫ్యాన్స్. మాళవికా మోహనన్, ఆండ్రియా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ మూవీలో విజయ్ సేతుపతి విలన్ పాత్ర చేస్తున్నాడు.





జీఎస్టీ వసూళ్లు మళ్లీ లక్ష కోట్ల పైనే

- వెల్లడించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ : జీఎస్టీ కలెక్షన్లు వరుసగా రెండో నెల కూడా లక్ష కోట్ల మార్క్‌ను క్రాస్ చేశాయి. డిసెంబర్ నెలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.03 లక్షల కోట్ల జీఎస్టీ రెవెన్యూలను వసూలు చేసినట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఓ వైపు ఎకానమీ నెమ్మదించడంతో, మార్కెట్‌లో వినియోగాన్ని, లిక్విడిటీని పెంచుతోన్న ప్రభుత్వానికి జీఎస్టీ వసూళ్లు పెరగడం కాస్త ఊరటనిచ్చినట్టయింది. అంతకుముందు ఏడాది డిసెంబర్ నెలతో పోలిస్తే, 2019 డిసెంబర్ నెలలో జీఎస్టీ వసూళ్లు 9 శాతానికి పైగా పెరిగాయి. దేశీయ లావాదేవీల నుంచి వచ్చిన జీఎస్టీ రెవెన్యూలు 2018తో పోలిస్తే 2019లో 16 శాతం గ్రోత్‌ను నమోదు చేశాయి. దిగుమతుల నుంచి వసూలైన ఐజీఎస్టీని కూడా పరిగణలోకి తీసుకుంటే, మొత్తంగా జీఎస్టీ రెవెన్యూలు 2019 డిసెంబర్‌లో 9 శాతం పెరిగినట్టని ఆర్థిక మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. ఈ నెలలో దిగుమతి చేసిన వస్తువులపై ఐజీఎస్టీ (-)10 శాతం వృద్ధిని నమోదు చేసింది. కానీ గత నెలతో(-13 శాతంతో) పోలిస్తే కాస్త మెరుగుపడిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. మొత్తంగా డిసెంబర్ నెలలో వసూలైన రూ.1,03,184 కోట్ల వసూళ్లలో... సీజీఎస్టీ రూ.19,962 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూ.26,792 కోట్లు, ఐజీఎస్టీ రూ.48,099 కోట్లు, సెస్ రూ.8,331 కోట్లు ఉన్నాయి. డిసెంబర్ చివరి నాటికి 81 లక్షల సమ్మరీ ట్యాక్స్ రిటర్న్‌లను ఫైల్ చేశారని తెలిపింది. జీఎస్టీ రిసీప్ట్స్ గత కొన్ని నెలలు నుంచి తగ్గడంతో, కేంద్ర, రాష్ట్రాల మధ్య టెన్షన్స్ నెలకొన్నాయి. కేంద్రం నుంచి కొన్ని రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారాల చెల్లింపు కూడా జాప్యమైంది. దీంతో జీఎస్టీ పరిహారాలను త్వరగా చెల్లించాలని రాష్ట్రాలు, కేంద్రాన్ని కోరాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం పలుమార్లు రేట్లకోతను, మినహాయింపులను చేపట్టింది. కన్జూమర్ గూడ్స్‌పై ఎక్కువగా పన్ను కోతలను చేపట్టడంతో, వ్యాపార సంస్థలు తమ ఫినిష్డ్ ప్రొడక్ట్‌లపై కంటే ముడిసరుకులపై ఎక్కువ పన్నులను చెల్లించాల్సి వచ్చేది. దీంతో కంపెనీలు ఎక్కువ రీఫండ్స్‌ను కోరేవి. గత నెల 18న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ భేటీలో ట్యాక్స్ రేట్లను, శ్లాబులను మార్చడంపై, మార్చిన తర్వాత రెవెన్యూలు వసూళ్లు ఎలా ఉంటాయి అనే దానిపై పలు సూచనలను స్వీకరించింది. అయితే ఎకానమీలో ప్రస్తుతం స్లోడౌన్ ఉన్న నేపథ్యంలో, కౌన్సిల్ ట్యాక్స్ రేట్ల మార్పుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 28 శాతం శ్లాబులో ఉన్న కొన్ని ఉత్పత్తులపైనే సెస్‌ను కౌన్సిల్ పెంచింది. జీఎస్టీ శ్లాబులు, రేట్లను మార్చడంపై బడ్జెట్ తర్వాతే కేంద్రం, రాష్ట్రాలు నిర్ణయం తీసుకోనున్నాయి. జీఎస్టీ కారణంగా తమ రెవెన్యూలు పడిపోయాయని, కేంద్రం సహాయం చేయాలని రాష్ట్రాలు కోరుతున్న విషయం తెలిసిందే.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	డజన్‌కు
హైదరాబాద్	₹464	₹72
వరంగల్	₹467	₹72

సెన్సెక్స్ 52 41,306

నిఫ్టీ 14 12,182

5% వృద్ధి కష్టమే

న్యూఢిల్లీ: ఈ ఏడాది దేశ జీడీపీ వృద్ధి రేటు 5 శాతానికి చేరుకోవడం అంత సులువు కాదని అమెరికన్ ఆర్థిక వేత్త స్టీవ్ హంక్ అన్నారు. వ్యవస్థలో క్రెడిట్ సంక్షోభం ఉందని, ఇది సైక్లికల్ సమస్యని తెలిపారు. దీంతో గత కొన్ని



క్వార్టర్లలో వృద్ధి రేటు భారీగా పడిపోయిందన్నారు. మోడీ ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సంస్కరణలను ముందుకు తీసుకు వెళ్లడంలోనూ, కఠినమైన ఆర్థిక చర్యలను తీసుకోవడానికి మోడీ ప్రభుత్వానికి ఆసక్తి లేదని ఆరోపించారు. ఇండియా కూడా ప్రొటెక్షనిస్ట్ ధోరణినే పాటిస్తోందని విమర్శించారు. అప్పుల సంక్షోభంతో ఈ ఏడాది 5 శాతం జీడీపీ గ్రోత్ కష్టమేనని వ్యాఖ్యానించారు. ఇటీవలి కాలం దాకా ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న దేశంగా నిలిచిన ఇండియా ఇప్పుడు వృద్ధి సాధించడానికి అష్టకష్టాలు పడుతోంది. పెట్టుబడులు తగ్గడంతో వినియోగం పడిపోయి ఆర్థిక వ్యవస్థ ఇబ్బందులు ఎదుర్కొంటోందని హంక్ పేర్కొన్నారు. ప్రస్తుతం హంక్ జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ(యూఎస్‌ఏ) లో అప్లైడ్ ఎకనమిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఆయన యుఎస్ ప్రెసిడెంట్ రొనాల్డ్ రీగన్ కౌన్సిల్‌లో ఎకనామిక్ ఎడ్వైజర్‌గా పనిచేశారు.

7 లక్షల ఉద్యోగాలు వస్తాయ్!

న్యూఢిల్లీ :

కొత్త ఏడాదిలో నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పబోతున్నాయి ప్రైవేట్ రంగ కంపెనీలు. 2020లో ఈ రంగంలోని కంపెనీలు ఏడు లక్షల ఉద్యోగాలను సృష్టించబోతున్నాయని తాజా సర్వే చెప్పింది. అంతేకాక న్యూఇయర్‌లో మొత్తంగా జీతాలు కూడా 8 శాతం వరకు పెంపు ఉంటుందని పేర్కొంది. మైహైరింగ్‌క్లబ్ డాట్ కామ్, సర్కారీ నౌకరి డాట్ ఇన్ఫో ఎంప్లాయిమెంట్ ట్రెండ్ సర్వే(ఎంఎస్ఈటీఎస్) 2020లో ఈ విషయం వెల్లడైంది. చాలా కంపెనీలు తమ నియామకాల ప్లాన్స్‌పై ఆశావాదంతో ఉన్నట్టు పేర్కొంది. 'కొత్త క్యాలెండర్ ఇయర్ 2020లో సుమారు 7 లక్షల ఉద్యోగాలను ప్రైవేట్ కంపెనీలు జనరేట్ చేయనున్నాయి. వీటిలో ఎక్కువగా స్టార్టప్స్ ఉంటాయి. ప్రతి రంగంలో కూడా చాలా ఉద్యోగాలను ఇవి క్రియేట్ చేస్తాయి' అని మైహైరింగ్ క్లబ్ డాట్ కామ్, సర్కారీ నౌకరి డాటా ఇన్ఫో సీఈవో రాజేష్ కుమార్ చెప్పారు. ఈ సర్వే 42 మేజర్ సిటీల్లోని 12 ఇండస్ట్రీ సెక్టార్లలో ఉన్న 4,278 కంపెనీలను కవర్ చేసింది. 5,14,900 ఉద్యోగాలను సృష్టించడంలో బెంగళూరు, ముంబై, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్, పుణేలు టాప్ ప్లేస్‌లో ఉన్నాయి. మిగిలిన ఉద్యోగాలను కంపెనీలు టైర్ 2, టైర్ 3 నగరాల్లో కల్పిస్తాయి. 'ఖర్చును అదుపులో ఉంచుకోవడానికి కంపెనీలు వారి కార్యాలయాలను మెట్రోల నుంచి ఇతర నగరాలకు మార్చుతుండటంతో, టైర్



- న్యూ ఇయర్‌లో కంపెనీల గుడ్‌న్యూస్
- తాజా సర్వేలో వెల్లడి
- జీతాల పెంపు 8 శాతం

2, 3 నగరాల్లో మరిన్ని ఉద్యోగాలు క్రియేట్ అవుతున్నాయి. 2020లో ఇతర స్కిల్స్ కంటే టెక్నాలజీ లేదా టెక్నాలజీ స్కిల్స్‌కు ఎక్కువ డిమాండ్ ఉంటుంది' అని రాజేష్ పేర్కొన్నారు. 2019లో 5.9 లక్షల ఉద్యోగాలు క్రియేట్ చేస్తాయని అంచనా వేయగా.. 6.2 లక్షల ఉద్యోగాలను కంపెనీలు అందించాయి.

రిటైల్, ఈకామర్స్‌లదే ముందంజ....

2020లో 1,12,000 ఉద్యోగాల కల్పనతో రిటైల్, ఈకామర్స్ రంగాలే ముందంజలో ఉంటాయి. ఆ తర్వాత ఐటీ అండ్ ఐటీఈస్ రంగాల్లో 1,05,500 ఉద్యోగాలు, ఎఫ్ఎంసీజీలో 87,500, మానుఫ్యాక్చరింగ్‌లో 68,900, బీఎఫ్ఎస్ఐలో 59,700, హెల్త్‌కేర్‌లో 98,300 ఉద్యోగాలు వస్తాయని సర్వే పేర్కొంది. 2020లో కూడా సౌత్ జోనే ఉద్యోగాల కల్పనలో నెంబర్ వన్ పొజిషన్‌లోఉండనుంది. ఇక్కడ 2,15,400 ఉద్యోగాలు వస్తాయని తెలిపింది. ఆ తర్వాత నార్త్‌లో 1,95,700 ఉద్యోగాలు, వెస్ట్‌లో 1,65,700 ఉద్యోగాలు, ఈస్ట్‌లో 1,25,800 ఉద్యోగాలు వస్తాయని పేర్కొంది. సర్వే ప్రకారం, జీతాలు, బోనస్‌లు సింగిల్ డిజిట్‌లోనే పెరుగుతాయి. మొత్తంగా జీతాల ఇంక్రిమెంట్ 8 శాతంగా ఉండబోతుందని సర్వే అంచనావేసింది. ఇంక్రిమెంట్స్ 8 శాతం, బోనస్‌లు 10 శాతం పెరుగుతాయని తెలిపింది. గతేడాదితో పోలిస్తే... బోనస్‌లు, ఇంక్రిమెంట్ల పర్సంటేజ్ మొత్తం మీద 1 శాతం పాయింట్స్ పెరిగే అవకాశం ఉందని కుమార్ చెప్పారు.

రీస్కిలింగ్ అవసరం...

2020లో ప్రస్తుత ఉద్యోగులకు రీస్కిలింగ్ అనేది చాలా ముఖ్యమైనదని షైన్ డాట్ కామ్ సీఈవో జైరస్ మాస్టర్ చెప్పారు. స్కిల్ కొరతను ఎత్తి చూపించిన మాస్టర్, ఆర్గనైజేషన్ స్ట్రక్చర్స్‌లో మారుతోన్న రోల్స్‌ను ఎంత త్వరగా అయితే అడాప్ట్ చేసుకుంటారో వారిపైనే రిక్రూటర్లు ఎక్కువగా ఫోకస్ చేశారని తెలిపారు. పెద్ద మొత్తంలో డేటాను ఎవరైతే, రీడ్ చేసి, అనాలసిస్ చేస్తారో ఆ ప్రొఫెషనల్స్‌పైనే ఎక్కువగా కంపెనీలు మొగ్గుచూపుతాయని పేర్కొన్నారు.

ఐపీఓ కోసం రెండు కంపెనీలు

- సెబీ వద్ద డ్రాఫ్ట్ పేపర్స్ దాఖలు

న్యూఢిల్లీ : కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టిన వెంటనే రెండు కంపెనీలు మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాయి. హాస్పిటాలిటీ రంగంలో ఉన్న పార్క్ హోటల్స్, రియల్ ఎస్టేట్ స్పేస్‌లో ఉన్న మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ ఆర్‌ఈఐటీ ఐపీఓ కోసం సెబీ వద్ద డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేశాయి. పార్క్ హోటల్స్ ఐపీఓ ద్వారా రూ. వెయ్యి కోట్లను సేకరిస్తుండగా... మైండ్‌స్పేస్ కూడా వెయ్యి కోట్ల కోసం ఫ్రెష్ ఇష్యూ జారీ చేస్తోంది. తాజా ఇష్యూతో కలిపి మొత్తంగా మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ ఆఫర్ సైజు రూ. 4 వేల కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. పార్క్ హోటల్స్ ఐపీఓకు లీడ్ మేనేజర్లుగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్, యాక్సిస్ క్యాపిటల్, జేఎం ఫైనాన్సియల్ ఉన్నాయి. మైండ్‌స్పేస్ బిజినెస్ మార్క్స్ ఆర్‌ఈఐటీ పబ్లిక్ ఆఫర్‌కు మోర్గాన్ స్టాన్లీ ఇండియా, యాక్సిస్ క్యాపిటల్, డీఎస్‌పీ మెరిల్ లంచ్, సిటీ గ్రూప్ గ్లోబల్ మార్కెట్స్, జేఎం ఫైనాన్స్, కొటక్ మహింద్రా క్యాపిటల్, సీఎల్ఎస్ఏ ఇండియా, నోమురా ఫైనాన్సియల్ అడ్వయిజరీ అండ్ సెక్యూరిటీస్ ఇండియా, యూబీఎస్ సెక్యూరిటీస్ ఇండియా, అమిత్ క్యాపిటల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ సెక్యూరిటీస్ అండ్ ఐసీఐసీఐ సెక్యూరిటీలు లీడ్ మేనేజర్లుగా ఉన్నాయి.

ఆటో అమ్మకాలు అంతంత మాత్రమే!

కొద్దిగా పెరిగిన మారుతి, ఎం అండ్ ఎం సేల్స్.. పడిన హ్యుండాయ్, టయోటా అమ్మకాలు

న్యూఢిల్లీ :

ఆఫర్లను అధికంగా ఇచ్చినప్పటికీ గతేడాది చివరి నెలలో ఆటో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. డిసెంబర్ నెలకు సంబంధించిన ఆటో సేల్స్ డేటా బుధవారం వెలువడింది. ఇండియా మార్కెట్‌లో అతిపెద్ద కార్ల కంపెనీ అయిన మారుతి సుజుకీ అమ్మకాలు 2.4 శాతం పెరగగా, మహింద్రా అండ్ మహింద్రా అమ్మకాలు ఒక శాతం పెరిగాయి. అయితే హ్యుండాయ్ సేల్స్ 10 శాతం, టయోటా అమ్మకాలు 38 శాతం తగ్గాయి. జూలై 2019లో ఇండియా మార్కెట్‌లో అడుగుపెట్టిన ఎంజీ మోటర్స్ అమ్మకాలు మాత్రం పర్వాలేదనిపించాయి. 2019 డిసెంబర్‌లో తమ కార్ల అమ్మకాలు 2.4 శాతం పెరిగాయని మారుతి సుజుకీ ఎక్స్చేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ నెలలో కంపెనీ 1,24,375 వాహనాలను విక్రయించగా, డిసెంబర్ 2018లో కంపెనీ 1,21,479 వెహికిల్స్‌ను అమ్మింది. ఇతర ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చర్స్ (ఓఈఎం)కు విక్రయించిన అమ్మకాలను కూడా కలుపుకుంటే, కంపెనీ సేల్స్ మొత్తంగా 3.9 శాతం పెరిగి 1,33,296 వెహికిల్స్‌గా ఉన్నాయి. మారుతి సుజుకీ ఆల్టో సేల్స్ 13.6 శాతం పడిపోయి 23,883 వాహనాలుగా నమోదయ్యాయి. అయినప్పటికి న్యూ వేగన్ ఆర్, స్విఫ్ట్, సెలరియో, డిజైర్ వంటి కాంపాక్ట్ కార్ల అమ్మకాలు పెరిగి 65,673 యూనిట్లకు చేరుకున్నాయి. మిడ్‌సైజ్ సియాజ్ సేల్స్ 62.3 శాతం పడిపోయి 1,786 వాహనాలుగా ఉన్నాయి.

ఎంజీ మోటర్స్

గతేడాదే ఇండియా మార్కెట్‌లోకి అడుగుపెట్టిన ఎంజీ మోటర్స్ విక్రయాలు పర్వాలేదనిపించాయి. కంపెనీ స్పోర్ట్ యుటిలిటీ వెహికిల్ హెక్టార్ అమ్మకాలు 2019 డిసెంబర్‌లో 3,021 యూనిట్లుగా ఉన్నాయని కంపెనీ తెలిపింది. 2019లో ఎంజీ మోటర్స్ అమ్మకాలు 15,930 యూనిట్లకు చేరుకున్నాయి.



38% పడిన టయోటా సేల్స్....

టయోటా సేల్స్ 2019 డిసెంబర్‌లో 38 శాతం పడిపోయాయి. కంపెనీ అమ్మకాలు డిసెంబర్ నెలలో 7,769 వాహనాలుగా ఉన్నాయని టయోటా కిర్లోస్కర్ మోటర్(టీకేఎం) ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ 2018 డిసెంబర్‌లో 12,489 వాహనాలను విక్రయించిందని పేర్కొంది. ఇండియా మార్కెట్లో టయోటా అమ్మకాలు గత నెలలో 6,544 వాహనాలుగా ఉన్నాయని, ఇవి 2018 డిసెంబర్‌లో అమ్ముడైన 11,836 యూనిట్ల కంటే 45 శాతం తక్కువని కంపెనీ తెలిపింది. 2019 డిసెంబర్‌లో కంపెనీ ఎగుమతులు 1,225 యూనిట్లుగా ఉండగా, 2018 డిసెంబర్‌లో 653 వాహనాలను మాత్రమే ఎగుమతి చేసింది. మొత్తంగా 2019లో ఇండియా మార్కెట్‌లో టయోటా అమ్మకాలు 1,26,701 వాహనాలుగా ఉన్నాయి. ఇది 2018 లో అమ్ముడైన 1,51,480 వాహనాల కంటే 16.36 శాతం తక్కువ.

పెరిగిన ఎం అండ్ ఎం సేల్స్..

2019 డిసెంబర్‌లో ఎం అండ్ ఎం విక్రయాలు ఒక శాతం పెరిగాయి. కంపెనీ కమర్షియల్ వెహికిల్స్ అమ్మకాలు తగ్గినప్పటికీ, ప్యాసింజర్, యుటిలిటీ వాహనాల అమ్మకాలు పెరిగాయి. గత నెలలో కంపెనీ 37,081 వెహికిల్స్‌ను అమ్మిందని, 2018 డిసెంబర్‌లో 36,690 వాహనాలను మాత్రమే విక్రయించినట్టు కంపెనీ బీఎస్‌ఈ ఫైలింగ్‌లో తెలిపింది. కంపెనీ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 4 శాతం పెరిగి 15,691 యూనిట్లుగా, యుటిలిటీ వాహనాల అమ్మకాలు 10 శాతం పెరిగి 15,225 వాహనాలుగా ఉన్నాయని పేర్కొంది. కానీ కంపెనీ కమర్షియల్ వాహనాల అమ్మకాలు 5 శాతం తగ్గి 16,018 వాహనాలుగా ఉన్నాయని తెలిపింది. ఎం అండ్ ఎం ఎగుమతులు గత నెలలో 30 శాతం తగ్గి 2,149 వాహనాలకు పడిపోయింది. గతేడాది ఏప్రిల్-డిసెంబర్ మధ్యన ఎంఅండ్ ఎం వాహనాల విక్రయాలు 11 శాతం పడిపోయి 3.6 లక్షలుగా ఉన్నాయి. ప్రస్తుతం కంపెనీ స్టాక్ లెవెల్స్‌పై సంతృప్తిగా ఉన్నామని ఎం అండ్ ఎం సేల్స్, మార్కెటింగ్ చీఫ్ విజయ్ రామ్ నక్రా అన్నారు.

తగ్గిన హ్యుండాయ్ అమ్మకాలు..

హ్యుండాయ్ మోటర్స్ ఇండియా అమ్మకాలు మొత్తంగా 2019 డిసెంబర్‌లో 9.9 శాతం మేర పడిపోయాయి. కంపెనీ అంతకుముందు ఏడాది 55,638 వాహనాలను విక్రయించగా, 2019 డిసెంబర్‌లో 50,135 వాహనాలను మాత్రమే అమ్మగలిగింది. కంపెనీ అమ్మకాలు దేశీయంగా అయితే 9.8 శాతం పడిపోయి 37,953 వాహనాలుగా ఉన్నాయి. డిసెంబర్ 2018 లో దేశీయంగా ఈ కంపెనీ 42,093 వాహనాలను అమ్మింది. కంపెనీ ఎగుమతులు గత నెలలో 10.06 శాతం పడిపోయి 12,182 వాహనాలుగా నమోదయ్యాయి. 2018 డిసెంబర్‌లో 13,545 వాహనాలను ఎగుమతి చేసింది.

మొత్తంగా 2019లోనూ తగ్గాయ్...!

మొత్తంగా 2019 లో హ్యుండాయ్ అమ్మకాలు 2.6 శాతం తగ్గి 6,91,460 వాహనాలుగా ఉన్నాయి. 2018 లో 7,10,012 వాహనాలను కంపెనీ విక్రయించగలిగింది. దేశీయ మార్కెట్‌లో కంపెనీ అమ్మకాలు 2019లో 510,260 వాహనాలుగా ఉన్నాయి. ఈ అమ్మకాలు 2018 లో నమోదైన 5,50,002 వాహనాల కంటే 7.2 శాతం తక్కువ. కంపెనీ 2019 లో 181,200 వాహనాలను ఎగుమతి చేయగా, 2018లో 1,60,010 వాహనాలను ఎక్స్‌పోర్ట్ చేసింది. అంటే అంతకుముందు ఏడాది కంటే ఈ ఎగుమతులు 13.2 శాతం ఎక్కువ.

అపోలో చూపు మెడికల్ టూరిజం వైపు

న్యూఢిల్లీ: భవిష్యత్‌లో ఎదుగుదలకు మెడికల్ టూరిజంపై దృష్టి పెట్టాలని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ నిర్ణయించింది. ఈ విభాగం నుంచి ఆదాయం బాగా పెంచుకోవాలని ప్లాన్ చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకించి ఒక డివిజన్ ఏర్పాటు చేశామని, గత ఏడాది 2 లక్షల మంది పేషెంట్లకు చికిత్స అందించామని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి చెప్పారు. మెడికల్ టూరిజం ఇండియాలో ఇంకా మొదటి దశలోనే ఉందని, కానీ భవిష్యత్ ఆశాజనకంగా కనిపిస్తోందని తెలిపారు. ఆంకాలజీ, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్, కార్డియాక్ ప్రొసీజర్స్, ఆర్థోపెడిక్స్, న్యూరోసర్జరీ వంటి వాటి కోసమే విదేశీయులు ఇక్కడకు వస్తున్నట్లు వెల్లడించారు. పసిఫిక్ ఐలాండ్స్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, ఇరాక్, కెన్యా, నైజీరియా, ఇథియోపియా, ఒమన్, యెమన్, శ్రీలంక, ఉజ్బెకిస్థాన్, మయన్మార్, నేపాల్ దేశాల నుంచి పేషెంట్లు తమ హాస్పిటల్‌కు వస్తున్నారని సంగీతా రెడ్డి చెప్పారు. మెడికల్ టూరిజం ఇండియా ఆర్థిక వ్యవస్థకు బాగా దోహదపడగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ రంగం ఎక్కువ ఫారిన్ ఎక్స్చేంజ్‌ను తెచ్చిపెట్టగలిగేదిగా నీతి ఆయోగ్ గుర్తించిందని అన్నారు. చికిత్సకు తక్కువ వ్యయం, అడ్వాన్స్డ్ మెడికల్ టెక్నాలజీ, స్కిల్డ్ మెడికల్ ప్రొఫెషనల్స్ వంటి సానుకూల అంశాలే మన దేశానికి విదేశీయులను రప్పిస్తున్నట్లు వివరించారు. వీసా రూల్స్‌ను ప్రభుత్వం ఇప్పటికే సులభం చేసిందని, కాకపోతే మెడికల్ ట్రావెలర్స్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ రూల్స్‌ను కూడా కొంత సులభం చేస్తే బాగుంటుందని సంగీతా రెడ్డి సూచించారు. ఇండియాలోకి వచ్చిన వెంటనే వీసా ఇచ్చేలా రూల్స్ ఉంటే మరింత మెరుగ్గా వుంటుందని చెప్పారు.



'నకోడ' ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ

న్యూఢిల్లీ: గుజరాత్ కంపెనీ నకోడ లిమిటెడ్‌కి చెందిన రూ. 18 కోట్ల విలువైన తొమ్మిది విండ్ టర్బైన్స్ జనరేటర్లను, ల్యాండ్‌ను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. ఈ కంపెనీ బ్యాంక్ ఫ్రాడ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ కేసును ఈడీ దర్యాప్తు చేస్తోంది. బ్యాంకులకు అప్పులను చెల్లించడంలో విఫలమయ్యింది. నకోడ లిమిటెడ్ కెనరా బ్యాంకు సహా మొత్తం 13 బ్యాంకులకు రూ. 2,107 కోట్లను చెల్లించాల్సి ఉంది. ఈ కంపెనీ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ బబుల్ జైన్, అతని కుమారుడు ఎండీ దేవేంద్ర బబుల్ జైన్‌లు ఈ బ్యాంక్ ఫ్రాడ్‌కు పాల్పడ్డారని ఈడీ గుర్తించింది. ట్రేడర్లు పునీత్ రుంగ్టా, చార్టర్డ్ అకౌంటెంట్ జగదీష్ సోమానితో కలిసి జైన్‌లు ఇద్దరూ ఫ్యాన్సీ ఫ్యాబ్రిక్ ఫేక్ సేల్స్, పర్చేజెస్‌ను నిర్వహించడం ద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని తేల్చింది.

జపాన్ పోలీసుల కన్నుగప్పి నిస్సాన్ 'కార్లోస్' జంప్

వెలుగు, బిజినెస్ డెస్క్ :

చుట్టూ ఎన్నో ఆంక్షలు... అడుగు తీసి అడుగు వేస్తే అధికారులకు తెలిసిపోతుంది.. వీడియో కనుసన్నల్లో ఉన్నారు.. అయినా కూడా భలే తప్పించుకుని పారిపోయారు నిస్సాన్ మోటార్ కంపెనీ, రెనాల్ట్ మాజీ హెడ్ కార్లోస్ ఘోస్న్. కఠినమైన నిబంధనల నుంచి తప్పించుకుని, పాస్‌పోర్ట్ లేకుండానే జపాన్ నుంచి లెబనాన్ పారిపోయారు. ఈయన పారిపోవడంపై ఒక్కొక్క మీడియా సంస్థ, ఒక్కో వార్త కథనాన్ని అల్లేస్తోంది. క్రిస్టమస్ సెలబ్రేషన్స్‌కి తన ఇంటికి వచ్చిన మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్ బ్యాండ్‌లో టోక్యోకు పారిపోయారని, ఆ తర్వాత ప్రైవేట్ ప్లేన్ ఎక్కేసి టోక్యో నుంచి లెబనాన్ చెక్కేశారని మీడియా కథనాలు వస్తూనే ఉన్నాయి. అసలు కార్లోస్ దేశం విడిచిపోయిన సంగతి, ఆయన ఈమెయిల్ విడుదల చేసేంత వరకు ఎవరికీ తెలియదు. ఇదంతా ఒక హాలీవుడ్ థ్రిల్లర్‌ను తలపిస్తున్నట్టు కొన్ని న్యూస్ పేపర్స్ పేర్కొంటున్నాయి. కార్లోస్ తన వ్యక్తిగత లబ్ది కోసం కార్పొరేట్ వనరులను వాడుకున్నారని, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని అభియోగాలున్నాయి. వీటిని కార్లోస్ కొట్టిపారేస్తున్నారు కూడా. జపనీస్ జ్యుడిషియల్ సిస్టమ్ అన్యాయానికి, రాజకీయ హింసకు పాల్పడుతోందని లెబనాన్ నుంచి కార్లోస్ ఆరోపించారు.

కార్లోస్ పారిపోవడం ఎలా సాధ్యమైందంటూ.. ప్రశ్నలే తప్ప సమాధానాలు దొరకడం లేదు. ఒకవైపు పాస్‌పోర్ట్‌లన్నీ కూడా జపనీస్ అథారిటీల స్వాధీనంలో ఉన్నాయి. ఆయన పారిపోవడానికి ఆయన భార్య కరోల్ మేజర్ రోల్ వహించారని వాల్‌స్ట్రీట్ జర్నల్ చెప్పింది. ఓ ఫ్రెంచ్ డైలీ వార్త కథనం ప్రకారం, కార్లోస్ ఘోస్న్ పారిపోవడం వెనుక ఆయన సోదరులు, టోక్యోలో వారికున్న కాంటాక్ట్‌లు సాయం చేశాయని తెలుస్తోంది. తన భర్త ఐడీ కార్డుతోనే లెబనాన్‌లోకి ఎంటర్ అయినట్టు కరోల్ చెబుతోంది. అయితే లెబనాన్‌కు చెందిన న్యూస్‌పేపర్ మాత్రం, వాటన్నింటికీ భిన్నంగా ఫ్రెంచ్ పాస్‌పోర్ట్‌తో కార్లోస్ తమ దేశంలోకి ఎంటర్ అయినట్టు పేర్కొంది. ఆయన పాస్‌పోర్ట్‌లన్నింటినీ జపనీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కార్లోస్‌కు లెబనీస్, ఫ్రెంచ్, బ్రెజిలియన్ పౌరసత్వం ఉంది. ఫోర్జ్‌డ్ పాస్‌పోర్ట్‌తో తప్పుడు ఐడెంటీ కార్డుతో కార్లోస్ జపాన్ విడిచి పారిపోయినట్టు ఫ్రెంచ్ న్యూస్‌పేపర్ లీస్ ఎకోస్ చెప్పింది. ఆ తర్వాత ఒక చిన్న ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రైవేట్ ప్లేన్‌లో లెబనాన్ చెక్కేశారని పేర్కొంది. అయితే కార్లోస్ చట్టబద్ధంగానే లెబనాన్ వచ్చారని ఆ దేశ విదేశీ మంత్రిత్వ శాఖ చెప్పింది. జపాన్ నుంచి బీరుట్ ఎలా చేరుకున్నారన్నది మాత్రం తెలియదని తెలిపింది. కార్లోస్ ఘోస్న్ పారిపోవడం ట్విటర్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. లెబనాన్‌లోని తన కొత్త ఇంటి నుంచి కార్లోస్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించబోతున్నట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో కార్లోస్ ఇన్ని రెస్ట్రిక్షన్స్ నుంచి ఎలా జపాన్ విడిచి పారిపోయారన్న దానిపై జపనీస్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్, కస్టమ్స్ అధికారులు కూడా వివరణ ఇవ్వాల్సి ఉంది.



- పాస్‌పోర్టు లేకుండానే లెబనాన్ చెక్కేశారు
- ఒక్కో మీడియా సంస్థదీ... ఒక్కో కథనం



నటాషాతో హార్దిక్ ఎంగేజ్‌మెంట్

న్యూఢిల్లీ: చుట్టూ సముద్ర జలాలు.. మధ్యలో ఓ యాట్.. అందులో అందమైన అమ్మాయి.. ఎదురుగా టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా.. కొత్త ఏడాది ఆరంభానికి అంతే కొత్తగా స్వాగతం పలుకుతూ.. తన ఎంగేజ్‌మెంట్‌ను పూర్తి చేసుకున్నాడు. చాలా కాలం నుంచి డేటింగ్ చేస్తున్న సెర్బియా నటి నటాషా స్టాంకోవిచ్ వేలికి ఉంగరం తొడుగుతూ తన జీవితంలోకి ఆహ్వానించాడు. తన ప్రియసఖితో కలిసి 'హెచ్‌పీ లవ్స్ నాట్స్' అని రాసి ఉన్న కేక్‌ను కట్ చేశాడు. ఇప్పటికే కుటుంబ సభ్యులకు పరిచయం చేసిన నటాషాను త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నట్లు సమాచారం. ఎంగేజ్‌మెంట్ వ్యవహారాన్ని పాండ్యా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్యాన్స్‌తో పంచుకున్నాడు. 'మై తేరా, తు మేరీ జాన్, సారా హిందుస్థాన్' 01.01.2020# ఎంగేజ్డ్' అని తన పోస్ట్‌కు జత చేశాడు. నటాషా కూడా తన వేలికి ఉన్న ఉంగరాన్ని చూపిస్తూ.. పాండ్యాతో 'ముద్దు'లొలికే ప్రయాణాన్ని మొదలుపెట్టింది. చాలా కాలంగా ముంబైలో నివసిస్తున్న నటాషా.. హిందీ బిగ్‌బాస్–8లో నటించడంతో పాపులర్ అయ్యింది. అప్పట్లో నటాషాకు ఓట్లేయ్యాలని కూడా పాండ్యా సూచించాడు. సత్యాగ్రహ సినిమాతో తెరంగేట్రం చేసిన నటాషా.. అద్భుతమైన డాన్సర్. ప్రస్తుతం వెబ్ సిరీస్‌లు, టీవీ షోలతో పాటు సినిమాలు కూడా చేస్తోంది.





విమర్శలు పట్టించుకోను

రెండో ఒలింపిక్ మెడల్‌పైనే ఫోకస్ • వరల్డ్ చాంపియన్ పీవీ సింధు

సుశీల్ కుమార్.. రెండు ఒలింపిక్ మెడల్స్ సాధించిన ఏకైక ఇండియన్. ఈ ఘనతను సమం చేసే అరుదైన చాన్స్.. మహిళల బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్ పీవీ సింధు ముందు ఇప్పుడుంది. రియోలో సిల్వర్ సాధించిన తెలుగమ్మాయి ఈ ఏడాది టోక్యోలో గోల్డ్ గెలవాలని టార్గెట్‌గా పెట్టుకుంది. గతేడాది వరల్డ్ చాంపియన్‌గా నిలిచినా.. మిగిలిన టోర్నీల్లో నిరాశపరిచిన ఈ స్టార్ ప్లేయర్ 2020లో తన సత్తా చూపిస్తానంటోంది. తప్పులు, ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుంటానని, గెలుపోటములతో సంబంధం లేకుండా పాజిటివ్‌గా ఉంటానని చెబుతోంది. కొత్త ఏడాదిలో తన భవిష్యత్తు ప్రణాళికల గురించి ఆమె మాటల్లోనే..

అన్నీ గెలవడం సాధ్యం కాదు..

వరల్డ్ చాంపియన్‌షిప్ గెలవడం చాలా సంతోషాన్నిచ్చింది. కానీ ఆ తర్వాత బరిలోకి దిగిన టోర్నీల్లో ఫస్ట్ రౌండ్ దాటలేకపోయా. అయినా పాజిటివ్‌గానే ఉన్నా. ప్రతీ మ్యాచ్ గెలవడం ఎవరి వల్లా కాదు. కొన్నిసార్లు చాలా తెలివిగా ఆడతాం. ఇంకొన్నిసార్లు చాలా తప్పులు చేస్తాం. ఆ తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ ఉంటా. కోర్ట్‌లోకి బలమైన ప్రత్యర్థిగా తిరిగి రావాలంటే పాజిటివ్‌గా ఉండడం చాలా అవసరం. నేను ప్రతీ మ్యాచ్ గెలవాలని ఆశిస్తారని తెలుసు. నా మీద ఎన్ని అంచనాలు ఉంటాయో కూడా తెలుసు. అయితే ఆ ఒత్తిడితోపాటు, సరిగ్గా ఆడనప్పుడు ఎదురయ్యే విమర్శలను పట్టించుకోను.

ఒలింపిక్ మెడలే లక్ష్యం

నాతోపాటు ఏ అథ్లెట్‌కైనా ఒలింపిక్ మెడలే అంతిమ లక్ష్యం. ఇందుకోసం నా టెక్నిక్, స్కిల్‌ను మెరుగుపర్చుకోవడానికి కఠోర సాధన చేస్తున్నా. అన్నీ ప్లాన్ ప్రకారం జరిగితే ఒలింపిక్ సీజన్ సాఫీగా ముగుస్తుంది. రెండు ఒలింపిక్ మెడల్స్ గెలిచిన రెజ్లర్ సుశీల్ కుమార్ దేశానికే గర్వకారణంగా నిలిచాడు. టోక్యోలో మెడల్ గెలిచి నేను ఆ స్థాయికి చేరాలని ఆశిస్తున్నా. నా మైండ్‌లో కూడా ఎప్పుడూ అదే ఉంటుంది. నేనెప్పుడూ ఒక్కో మెట్టు ఎక్కాలని అనుకుంటా. అయితే ఈసారి మెడల్ గెలవడం అంత సులువు కాదు. మలేషియా, ఇండోనేసియా ఓపెన్‌లతో సీజన్ మొదలవుతుంది. అక్కడి నుంచి ఒలింపిక్ క్వాలిఫికేషన్ వరకు ఆడే ప్రతీ టోర్నీ, ప్రతీ మ్యాచ్ నాకు కీలకమే.

పీబీఎల్ కోసం ఎదురుచూస్తున్నా..

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) కోసం ఎదురుచూస్తున్నా. ఈ నెలలోనే లీగ్ ఉండడంతో జట్లన్నీ బలంగానే ఉంటాయి. ఫలానా టీమ్ బలంగా ఉందని కచ్చితంగా చెప్పలేం. అందువల్ల ప్రతీ మ్యాచ్‌కు చాలా ప్రాముఖ్యం ఉంటుంది. ఒలింపిక్స్ సన్నాహకాల్లో భాగంగా శ్రీకాంత్, సైనా నెహ్వాల్ ఈసారి లీగ్‌కు దూరంగా ఉంటున్నారు. కానీ నా వరకు ఇవి కొన్ని అదనపు మ్యాచ్‌లు మాత్రమే. లీగ్ స్వదేశంలో జరుగుతుంది. పెద్ద సంఖ్యలో సొంత అభిమానుల మధ్య ఆడదాన్ని ఎంజాయ్ చేయాలనుకుంటున్నా. ఫేవరెట్ ప్లేయర్స్ ఆటను నేరుగా చూస్తే ఫ్యాన్స్ కూడా సంతోషిస్తారు. పైగా లీగ్ ఏడాదికోసారి మాత్రమే జరుగుతుంది. లీగ్ వల్ల టాప్ ప్లేయర్స్ నుంచి యంగ్‌స్టర్స్ చాలా నేర్చుకుంటున్నారు. పీబీఎల్ యంగ్‌స్టర్స్‌కు దొరికిన ఓ గొప్ప అవకాశం.



ఆట ఆగమాగం!

గాడి తప్పిన హైదరాబాద్ క్రికెట్

హెచ్‌సీఏలో రాజ్యమేలుతున్న అవినీతి! • చెత్తగా ఆడుతున్న అన్ని జట్లు



'డబ్బున్నోళ్లు, ఇన్‌ఫ్లూయెన్స్ చేసేవాళ్లు, పొలిటీషియన్స్ పిల్లలకే హైదరాబాద్ టీమ్స్‌లో ప్రిఫరెన్స్.

- నవంబర్‌లో హైదరాబాద్ స్టార్ క్రికెటర్ అంబటి రాయుడు హెచ్‌సీఏపై చేసిన ఆరోపణ.

'డబ్బు చెల్లిస్తే హైదరాబాద్ టీమ్‌లో ప్లేస్ ఖాయమనే స్థాయికి పరిస్థితి దిగజారింది. అండర్-23 టీమ్‌లో ఆడేందుకు ఓ17 ఏళ్ల క్రికెటర్ తండ్రి హెచ్‌సీఏకి రూ.18 లక్షలు చెల్లించాడనేది బహిరంగ రహస్యం.'

- గత నెల బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్‌కు చేసిన ఫిర్యాదులో స్టేట్ జూనియర్ సెలెక్షన్ కమిటీ మెంబర్ వివేక్ జయసింహ చెప్పిన విషయం.

కట్ చేస్తే.. రంజీట్రోఫీలో హైదరాబాద్ హ్యాట్రిక్ ఓటమితో పాటు కూచ్ బెహార్ టోర్నీ, కల్నల్ సీకే నాయుడు ట్రోఫీల్లో మన జట్ల చెత్తాట వీరిద్దరి మాటలను నిజం చేస్తున్నాయి..! ఈ మూడు టోర్నీల్లో కలిపి ఇప్పటిదాకా 11 మ్యాచ్‌లు జరగగా.. కనీసం బోణీ చేయని హైదరాబాద్ జట్ల పరిస్థితి చూస్తుంటే అజరుద్దీన్ నేతృత్వంలోని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఏవిధంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చు!

హైదరాబాద్, వెలుగు:

ఒకప్పుడు మేటి క్రికెటర్లను అందించిన హైదరాబాద్ ఆట గాడి తప్పింది. హెచ్‌సీఏలో అవినీతి, బంధుప్రీతి రాజ్యమేలుతోంది. అర్హులైన ఆటగాళ్లను కాదని, హెచ్‌సీఏ అధికారుల పిల్లలు, రాజకీయ నాయకుల బంధువుల కుమారులతో జట్లను నింపేస్తుండటంతో హైదరాబాద్ క్రికెట్ ఆగమవుతోంది. మూడు నెలల కిందటే ప్రెసిడెంట్‌గా ఎన్నికైన మహమ్మద్ అజరుద్దీన్ పాలనను గాలికి వదిలేయడంతో హైదరాబాద్ క్రికెట్ సంక్షోభంలో చిక్కుకుందనే విమర్శలు వస్తున్నాయి. రాజకీయ నేతల సాయం ఆర్జించి ఎలక్షన్స్‌లో గెలిచిన అజరుద్దీన్ అండ్‌కో.. దానికి ప్రతిఫలంగా హైదరాబాద్ జట్లలో సదరు నేతల బంధువుల పిల్లలను ఎంపిక చేయడంతోనే అన్ని జట్ల ఆట తీసికట్టుగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బోణీ కొట్టని మూడు జట్లు...

ఇండియా డొమెస్టిక్ క్రికెట్‌లో కూచ్ బెహార్ (అండర్-19), కల్నల్ సీకే నాయుడు (అండర్-23), రంజీ ట్రోఫీలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఈ మూడు టోర్నీల్లో సత్తా చాటిన క్రికెటర్లు ఐపీఎల్‌తో పాటు టీమిండియా తలుపు తడుతుంటారు. కానీ, ఈ మూడింటిలో హైదరాబాద్ ఆట రోజు రోజుకు తీసికట్టుగా మారుతోంది. ఈ టోర్నీల్లో మన జట్లు ఇప్పటిదాకా బోణీనే కొట్టలేదు. రంజీ ట్రోఫీలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన తన్మయ్ కెప్టెన్సీలోని హైదరాబాద్ పాయింట్ల ఖాతా తెరవలేదు. ఉప్పల్‌లో జరిగిన ఫస్ట్ మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో 8 వికెట్లతో చిత్తయిన మన జట్టు.. తర్వాత పంజాబ్ చేతిలో ఇన్నింగ్స్ తేడాతో మట్టికరించింది. ఢిల్లీతో జరిగిన గత మ్యాచ్‌లో పది వికెట్ల తేడాతో ఓడి ప్రత్యర్థికి బోనస్ పాయింట్ ఇచ్చుకుంది. పంజాబ్‌తో సెకండ్ ఇన్నింగ్స్‌లో 76 రన్స్‌కే ఆలౌటైన తన్మయ్ సేన.. ఢిల్లీపై ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 69 పరుగులకు ఆలౌటై తలదించుకుంది. ఒకరిద్దరి వ్యక్తిగత పెర్ఫామెన్స్‌లు తప్పితే.. జట్టుగా హైదరాబాద్ దారుణంగా విఫలమైంది.

ఇక కూచ్ బెహార్ అండర్-19 టోర్నీలోనూ ఇప్పటిదాకా ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో మన జట్టు విజయం సాధించలేకపోయింది. తొలి రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకున్న హైదరాబాద్.. మిగతా మూడింటిలో ఓడిపోయింది. 18 జట్లతో కూడిన ఎలైట్ ఎ,బి గ్రూప్‌లో ఆరు పాయింట్లతో 16వ స్థానంలో నిలిచి నాకౌట్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించింది. అండర్-23 జట్టు పరిస్థితి మరీ దారుణం. రంజీ టీమ్ మాదిరిగా కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో ఓటముల హ్యాట్రిక్ కొట్టిన మికిల్ జైస్వాల్ కెప్టెన్సీలోని హైదరాబాద్.. కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్‌తో మ్యాచ్‌ల్లో ఇన్నింగ్స్ తేడాతో చిత్తయింది. పంజాబ్‌తో జరిగిన లాస్ట్ మ్యాచ్‌లో పది వికెట్ల తేడాతో ఓడింది. గ్రూప్-ఎలో సున్నా పాయింట్లతో చివరి స్థానంలో నిలిచింది. ఈ మూడు టోర్నీల్లోనూ హైదరాబాద్ జట్లు నాకౌట్‌కు చేరుకోవడం కష్టమే. టోర్నీలు, జట్లు వేరైనా హైదరాబాద్ ఆట దిగజారడానికి కారణాలు మాత్రం సేమ్. టాలెంటెడ్ ప్లేయర్లను కాకుండా హెచ్‌సీఏ పాలకులు తమవాళ్లతో అన్ని జట్లను నింపేయడమే అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇదేనా అజర్ తెచ్చిన మార్పు..!



హైదరాబాద్ క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమంటూ ఎలక్షన్స్‌లో గెలిచిన అజర్ పాలనలో వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జట్టు బాగు కోసం రాష్ట్రం గర్వించదగ్గ ఆటగాడైన అంబటి రాయుడు గొంతెత్తితే వెంటనే నష్ట నివారణ చర్యలు తీసుకోవాల్సింది పోయి.. అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎదురుదాడికి దిగడంతోనే అజర్ ప్యానెల్ ఆలోచన విధానం ఏమిటో అభిమానులకు అర్థమైంది. ఇప్పుడు రాయుడు జట్టుకు దూరం కావడం, ప్రశ్నించే వారు లేకపోవడంతో హెచ్‌సీఏ పాలకులు ఆడిందే ఆటగా మారింది. సెలెక్షన్ కమిటీ భేటీల్లో తమ మాట చెల్లుబాటు కావడం లేదని, అజర్, సెక్రటరీ విజయానంద్ జోక్యం ఎక్కువైందని, ఆటగాళ్లనే కాకుండా కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్‌ను చివరి నిమిషాల్లో మార్చేస్తున్నారని సెలెక్టర్ జైసింహా ఇప్పటికే బోర్డుకు ఫిర్యాదు చేశారు. ఎలక్షన్స్ సందర్భంగా చేసుకున్న ఒప్పందాల్లో భాగంగా.. క్లబ్ సెక్రటరీలు, రాజకీయ పలుకుబడి ఉన్న వారి పిల్లలు అన్ని జట్లకు ఎంపిక చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బహుశా.. ప్రెసిడెంట్‌గా అజర్ తెచ్చిన మార్పు ఇదేనేమో అని ఎద్దేవా చేస్తున్నారు. 'హెచ్‌సీఏలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసు. సెలెక్షన్ ప్రకియ చాలా ఘోరంగా ఉంది. పనికి రాని వాళ్లను సెలెక్షన్ కమిటీల్లోకి తీసుకున్నారు. సెలెక్షన్ టైమ్‌లో వాళ్లు వాళ్లే కొట్లాడుకుంటున్నారు. ఇవన్నీ అజర్‌కు తెలిసే జరుగుతున్నాయి. ఆయన ఏం చేయలేడు. ఎందుకంటే ఎలక్షన్స్ అప్పుడు నీకిది.. నాకది అని ముందుగానే ఒప్పందం చేసుకున్నారు'అని హెచ్‌సీఏ మాజీ సభ్యుడు ఒకరు వ్యాఖ్యానించారు. వెస్టిండీస్ లెజెండరీ బౌలర్ కర్ట్‌లీ ఆంబ్రోస్‌ను రంజీ టీమ్‌కు బౌలింగ్ కోచ్‌గా నియమిస్తామని అంటున్న అజర్.. ముందుగా అవినీతి అరికట్టాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. ఏదేమైనా హెచ్‌సీఏ పెద్దల రాజకీయం క్రికెట్‌ను దెబ్బతీయడమే కాకుండా దేశస్థాయిలో హైదరాబాద్ పరువు తీస్తోంది. బీసీసీఐ స్పందించి.. తగిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత దిగజారేలా ఉంది.

అండర్19 వరల్డ్‌కప్‌ను మర్చిపోలేం

విలియమ్సన్ సూపర్ ప్లేయర్

న్యూఢిల్లీ: ఇంటర్నేషనల్ క్రికెట్‌లో తమ కెరీర్లను బలంగా నిర్మించుకోవడానికి 2008 అండర్-19 వరల్డ్ కప్ చాలా ఉపయోగపడిందని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. ఆ టోర్నీ తమకు కఠిన పరీక్షగా మిగిలినా.. చాలా విషయాలు నేర్పించిందన్నాడు. అప్పట్లో కివీస్ సారథి కేన్ విలియమ్సన్ ఆట సూపర్ అని కితాబిచ్చాడు. 'అప్పట్లో విలియమ్సన్ ఎదుర్కోవడం నాకు ఇంకా గుర్తుంది. ఇతర ప్లేయర్లతో పోలిస్తే అతని బ్యాటింగ్ చాలా భిన్నంగా ఉంటుంది. కేన్, స్మిత్ సహా ఆ వరల్డ్‌కప్‌లో ఆడిన చాలా మంది ఇప్పుడు నేషనల్ టీమ్‌ల్లో ఆడుతున్నారు. ఏదేమైనా ఈ వరల్డ్‌కప్ నా కెరీర్‌లోనే అతి ముఖ్యమైన మైల్‌స్టోన్. మా కెరీర్లను నిర్మించుకోవడానికి ఇది చాలా ఉపయోగపడింది. అందుకే దీనికి నా మదిలో, హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. దీనివల్ల వచ్చిన అవకాశాలను గౌరవించడం, అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం' అని విరాట్ పేర్కొన్నాడు. 2008 వరల్డ్‌కప్‌లో కోహ్లీ స్టార్‌గా నిలిస్తే, 2010 టోర్నీతో బెన్ స్టోక్స్, బట్లర్, రూట్ సూపర్ స్టార్స్ అయ్యారు. ఇండియాపై స్టోక్స్ చేసిన సెంచరీని ఎప్పటికీ మర్చిపోలేమని రూట్ గుర్తు చేసుకున్నాడు.




న్యూ ఇయర్ వేడుకల్లో అనుష్కతో కోహ్లీ

రాహుల్‌కు మూడో జీఎమ్ నార్మ్

- జీఎమ్ టైటిల్‌కు మరో 31 ఎలో రేటింగ్ పాయింట్ల దూరం

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ చెస్ ఆటగాడు రాహుల్ శ్రీవాత్సవ్ గ్రాండ్ మాస్టర్ హోదా సాధించేందుకు అడుగు దూరంలో నిలిచాడు. ఇటలీలోని వెనిస్‌లో జరిగిన మోంట్‌బెలూనా ఓపెన్‌లో సత్తాచాటిన రాహుల్.. జీఎమ్ టైటిల్‌కు కావాల్సిన చివరి, మూడో నార్మ్ అందుకున్నాడు. ప్రస్తుతం 2638 ఎలో రేటింగ్ పాయింట్లతో ఉన్న ఈ యువ ప్లేయర్.. మరో 31 ఎలో పాయింట్లు సాధిస్తే రాష్ట్రం నుంచి గ్రాండ్ మాస్టర్ అయిన మూడో ప్లేయర్‌గా నిలుస్తాడు. ప్రస్తుతం ఇటలీలోనే ఉండి మరికొన్ని టోర్నీల్లో పాల్గొనేందుకు రెడీ అయిన రాహుల్ త్వరలోనే జీఎమ్ హోదా అందుకునే చాన్సుంది. కాగా, తెలంగాణ నుంచి వరంగల్‌కు చెందిన ఇరిగైసి అర్జున్, హర్ష భరత్‌కోటి గ్రాండ్ మాస్టర్లు అయ్యారు.





యంగ్ క్రికెటర్ కల్రాపై సస్పెన్షన్

న్యూఢిల్లీ : 2018 అండర్–19 వరల్డ్‌కప్ ఫైనల్‌లో సెంచరీ చేసిన యంగ్ క్రికెటర్ మన్‌జోత్ కల్రా ఏడాది పాటు రంజీ క్రికెట్‌లో పాల్గొనకుండా సస్పెన్షన్‌కు గురయ్యాడు. అండర్-16, 19 జట్లకు ఆడే రోజుల్లో వయసు విషయంలో కల్రా మోసం చేశాడని తేలడంతో ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అంబుడ్స్‌మన్ రిటైర్డ్ జస్టిస్ దుర్రెజ్ అహ్మద్ అతనిపై చర్యలు తీసుకున్నారు. ఏజ్ గ్రూప్ క్రికెట్‌లో రెండేళ్లు, రంజీలో ఈ సీజన్ ఆడకుండా కల్రాను సస్పెండ్ చేశారు. అంతేకాక అండర్-19 స్టార్ శివమ్ మావికి చెందిన ఏజ్ ఫ్రాడ్ వ్యవహారాన్ని బీసీసీఐకి రిఫర్ చేశారు. దీంతోపాటు ప్రస్తుత ఢిల్లీ సీనియర్ టీమ్ వైస్ కెప్టెన్ నితీశ్ రాణా కూడా జూనియర్ లెవెల్‌లో వయసు విషయంలో మోసం చేసినట్టు ఆధారాలున్నాయని, లోతైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అహ్మద్ పదవీ కాలం మంగళవారంతో ముగియడం గమనార్హం.

లంక టీ20 టీమ్‌లోకి మాథ్యూస్

కొలంబో: శ్రీలంక వెటరన్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ దాదాపు పద్దెనిమిది నెలల తర్వాత టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. ఇండియాతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు శ్రీలంక బోర్డు బుధవారం ప్రకటించిన 16 మంది సభ్యుల జట్టులో మాథ్యూస్ చోటు దక్కించుకున్నాడు. స్పీడ్‌స్టర్ లసిత్ మలింగ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఇండియా, శ్రీలంక మధ్య ఫస్ట్ టీ20 గౌహతిలో ఆదివారం జరగనుంది.

జట్టు: మలింగ (కెప్టెన్), కుశాల్ పెరీరా, గుణతిలక, అవిష్క, రాజపక్స, ఒషాడ, షణక, మాథ్యూస్, డిక్‌వెలా, కుశాల్ మెండిస్, హసరంగ, కాసున్‌రజిత, లహిరు, కుశాల్ మెండిస్, లక్షణ్, ధనంజయ డిసిల్వా, ఉదాన.

బ్రీజ్ ఫ్యాక్టర్‌ను ఎదుర్కొంటేనే సరి

న్యూజిలాండ్ టూర్‌పై అజింక్య రహానె

న్యూఢిల్లీ: బ్రీజ్ ఫ్యాక్టర్ (శీతల గాలి సమస్య)ను అధిగమిస్తే న్యూజిలాండ్‌లో రాణించగలమని టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ అజింక్య రహానె అన్నాడు. మూడు వన్డేలు, ఐదు టీ20లు, రెండు టెస్ట్‌ల సిరీస్‌ల కోసం టీమిండియా త్వరలో న్యూజిలాండ్ వెళ్లబోతుంది. అయితే పరిస్థితులకు తగిన విధంగా ఆటను మార్చుకోగలిగితే కివీస్‌లో ఇండియాకు ఎదురుండదని రహానె అన్నాడు. 'శీతల గాలి వల్ల కివీస్‌లో బాల్ ఎక్కువగా టర్న్ అవుతుంది. 2014 టూర్‌లో కూడా దాన్ని చూశాం. అందువల్ల బ్రీజ్ ఫ్యాక్టర్‌ను అధిగమిస్తే పని సులువు అవుతుంది. గత టూర్‌లో వెల్లింగ్టన్‌లో ఆడాను. కానీ చాలా ఏళ్ల తర్వాత క్రైస్ట్‌చర్చ్‌లో టెస్ట్ ఆడనున్నాం. పరిస్థితులకు అనుగుణంగా మారడం కీలకం కానుంది. కివీస్ బౌలర్లలో వాగ్నర్ ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నాడు.

అయితే బ్యాటింగ్ యూనిట్‌గా ప్రతీ బౌలర్‌పైనా దృష్టిపెట్టాలి. సొంతగడ్డపై ఆడనుండడం వాళ్లకి చాలా అడ్వాంటేజ్. బౌలర్లను ఎదుర్కోవడంలో ఒక్కొక్కరు ఒక్కో పద్ధతి ఫాలో అవుతారు. అయితే న్యూజిలాండ్‌లో మాత్రం బాల్ శరీరానికి దగ్గరగా వచ్చేదాకా ఆగి ఆడాలి. బేసిక్స్‌పై దృష్టి పెడితే చాలు, టెక్నిక్ కోసం పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు' అని అన్నాడు. అయితే మెయిన్ సిరీస్‌కు ముందు ఇండియా, న్యూజిలాండ్-ఎ జట్ల మధ్య జరిగే నాలుగు రోజుల మ్యాచ్‌లో రహానె బరిలోకి దిగనున్నాడు. బీసీసీఐ చీఫ్ సౌరవ్ గంగూలీ, ఇండియా-ఎ కోచ్ రాహుల్ ద్రవిడ్ ఇండియా క్రికెట్‌ను ఉన్నత శిఖరాలకు చేరుస్తారని అజింక్య అభిప్రాయపడ్డాడు.

పైన్ మా కెప్టెన్‌గా ఫైన్: లాంగర్

సిడ్నీ: వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ టిమ్ పైన్ తమ జట్టు కెప్టెన్ అని, అందులో ఎలాంటి మార్పు ఉండదని ఆస్ట్రేలియా హెడ్ కోచ్ లాంగర్ అన్నాడు. స్టీవ్ స్మిత్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చినప్పటి నుంచి పైన్ కెప్టెన్సీపై చర్చ నడుస్తోంది. 'కెప్టెన్ మార్పుపై ఇప్పటిదాకా జట్టులో చిన్న చర్చ కూడా జరగలేదు. పైన్ కెప్టెన్సీ అద్భుతం. బెస్ట్ వికెట్ కీపర్లలో అతనొకడు. బ్యాట్స్‌మన్‌గా తన సత్తా ఏంటో లాస్ట్ మ్యాచ్‌లో చూపెట్టాడు. అతన్ని తప్పించడానికి ఒక్క కారణం కూడా లేద'ని లాంగర్ చెప్పాడు.

క్రిక్‌ఇన్ఫో వన్డే, టీ20 కెప్టెన్‌గా ధోనీ



న్యూఢిల్లీ: ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో ప్రకటించిన ఈ డెకేడ్ వన్డే, టీ20 టీమ్‌ల్లో మహేంద్ర సింగ్ ధోనీకి కెప్టెన్‌గా చోటు దక్కింది. టెస్ట్‌ల్లో మాత్రం విరాట్ కోహ్లీకి పగ్గాలు అప్పగించింది. 23 మంది సభ్యులతో కూడిన ప్యానెల్ ఈ టీమ్‌లను ఎంపిక చేసింది. 50 టెస్ట్‌లు లేదా ఆరేళ్ల యాక్టివ్ ఇంటర్నేషనల్ క్రికెట్‌ను ఐదు రోజుల ఫార్మాట్‌కు క్రైటీరియాగా తీసుకున్నారు. అదే లిమిటెడ్ ఓవర్స్‌కు వచ్చేసరికి 75 వన్డేలు, 100 టీ20లను ప్రతిపాదికగా ఎంపిక చేశారు. ఆఫ్ స్పిన్నర్ ఆర్. అశ్విన్‌కు టెస్ట్ ఎలెవన్‌లో ప్లేస్ లభించింది. కుక్, విలియమ్సన్ టీమ్‌లో ఉన్నారు. 54.97 యావరేజ్‌తో 7202 రన్స్ చేసిన విరాట్ కోహ్లీకి మూడు ఫార్మాట్లలో చాన్స్ ఇచ్చారు. వన్డేల్లో రోహిత్ శర్మకు చోటు దక్కింది. టీ20 టీమ్‌లో ధోనీతో పాటు కోహ్లీ, బుమ్రా కూడా ఉన్నారు. క్రిస్ గేల్, డ్వేన్ బ్రావో, నరైన్, పొలార్డ్, రసెల్‌ను ఎంపిక చేశారు. మహిళల వన్డే, టీ20 టీమ్‌లో మిథాలీ రాజ్, పేసర్ జులన్ గోస్వామిని చేర్చారు. ఆసీస్ క్రికెటర్ మెగ్ లానింగ్‌ను కెప్టెన్‌గా ప్రకటించారు.

కొత్త ఏడాది..
కొత్త దశాబ్ది

ఒక దశాబ్దం ముగిసింది. ఇంకో ఏడాది కరిగిపోయింది. కొత్త ఏడాది, కొత్త దశాబ్దం వచ్చేశాయి. ప్రపంచం మొత్తం ఘన స్వాగతం పలికింది. ఒక్కో చోట ఒక్కోలా, కొంచెం కొత్తగా జనం వెల్‌కం చెప్పారు.



ఆర్మీకి సరిహద్దులే ఉత్సవం

అర్ధరాత్రిళ్లు దాటే దాకా జనం కొత్త సంవత్సర పండుగ చేసుకుని ఉంటారు. మరి, ఆర్మీకి. అలాంటివేవీ ఉండవు. వాళ్లకు సరిహద్దులే పెద్ద ఉత్సవం. దేశాన్ని కాపాడడమే పెద్ద పండుగ. అలాంటి సైనికులు మైనస్ డిగ్రీల టెంపరేచర్లలో దేశానికి కాపలా ఉంటూ కొత్త ఏడాదికి, కొత్త దశాబ్దికి స్వాగతం చెప్పారు.



రాఫెల్, సుఖోయ్.. విషెస్ చెప్పినయ్

రాఫెల్ రాకతో దేశ రక్షణ మరింత పటిష్టమైంది. కొత్త సంవత్సరం కొత్తగా మొదలైంది. నింగిలోకి ఎగురుతూ దేశ ప్రజలకు కొత్త సంవత్సరపు శుభాకాంక్షలు చెప్పాయి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లోని సోల్జర్స్ రోజువారీ పనులను వివరిస్తూ వారికి ట్రిబ్యూట్‌గా ఐఏఎఫ్ ఓ వీడియోను విడుదల చేసి హ్యాపీ న్యూ ఇయర్ చెప్పింది. ‘‘దేశంపై ఉన్న ప్రేమే భయాన్ని శత్రువులను ఓడించే ఉత్సాహంగా, శక్తిగా మారుస్తుంది. దేశం కోసం పోరాడుతున్నప్పుడు తుఫాన్లూ తలవంచాల్సిందే. ఎందుకంటే నేను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సోల్జర్‌ను. శత్రువులపై ఆకాశం నుంచే కన్నేసి ఉంచుతాం మేం’’ అన్నది ఆ వీడియో సారాంశం.




హారన్లు మోగించిన రైళ్లు

ముంబై చత్రపతి శివాజీ టెర్మినల్‌లో రైళ్లన్నీ ఒకేసారి హారన్ మోగించి న్యూ ఇయర్‌కు స్వాగతం పలికాయి. ఏటా అలాగే చేస్తారట అక్కడ.



సముద్ర దేవతకు నివాళి

ఆఫ్రికాలోని యోరుబా మతానికి చెందిన వాళ్లు ఏటా సముద్ర దేవతైన యేమంజకు పూజలు చేసి నివాళులు అర్పిస్తారు. బ్రెజిల్‌లోని రియో డి జనేరో బీచ్ వద్ద సముద్ర దైవాన్ని నీళ్లలోకి వదులుతున్న వ్యక్తి. ఏటా కొత్త సంవత్సరానికి వాళ్లు ఇలాగే స్వాగతం పలుకుతారు.



బుర్జ్ ఖలీఫాపై 2020

ఎప్పటిలాగే ఈ ఏడాదీ బుర్జ్ ఖలీఫా రంగు రంగుల ఫైర్ వర్క్స్‌తో వెలిగిపోయింది. 2020కి స్వాగతం పలికింది.

ఏటా పావుకిలో.. జీవితాంతం 20 కిలోలు

- **ఇదీ మనం జీవితం మొత్తంలో తింటున్న ప్లాస్టిక్**

ఆకలేసిన పొట్టకు బువ్వ పెట్టి చల్లార్చుతున్నాం. కానీ, ఆ బువ్వలోనే మనకు కనిపించే సైజులోనే ప్లాస్టిక్ కలిసిపోతోంది. మన కడుపులో చేరిపోతోంది. ఒక్కో ప్లాస్టిక్ ముక్క నువ్వు గింజంత సైజులో ఉంటోంది. ఇటీవల మైక్రోప్లాస్టిక్స్‌పై డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్) ఇంటర్నేషనల్ ఓ స్టడీ చేసింది. సముద్రాల నుంచి ఆర్కిటిక్ దాకా, మంచు కొండల నుంచి భూమి పొరల దాకా ప్లాస్టిక్‌తో పాటు మైక్రోప్లాస్టిక్ కలిసిపోతోందని ఆ స్టడీ హెచ్చరించింది. అవి మన కడుపులోకి చేరిపోతున్నాయని చెప్పింది. మనం నేరుగా తినకపోయినా, మనం తినే ఆహార పదార్థాల్లో కలిసిపోయి మన పొట్టల్లోకి చేరిపోతున్నాయని చెప్పింది. చేపలు, మాంసం, ఇతర ఆహార ధాన్యాలతో అవి ఎక్కువగా వస్తున్నాయని తెలిపింది. దానిపైనే ‘రాయిటర్స్’ గ్రాఫిక్స్ రూపంలో మనం ఎప్పుడెప్పుడు ఎంత మైక్రోప్లాస్టిక్ తింటున్నామో వివరించింది.



వారానికి 5 గ్రాములు

వారానికి మన కడుపులోకి చేరిపోతున్న మైక్రోప్లాస్టిక్ మొత్తం ఇది. అంటే ఓ బాటిల్ క్యాప్ లేదా ఓ స్పూన్ నిండా నింపితే ఎంతైతే ప్లాస్టిక్ వస్తుందో అంత మొత్తంలో మనం ప్లాస్టిక్‌ను లాగించేస్తున్నాం.



నెలకు 21 గ్రాములు

దీని బరువు కాసినోల్లోని 5 డైస్ (స్క్వేర్‌గా ఉండే పాచికలు) అంత మొత్తం. మినీ రైస్‌బౌల్‌లో సగం. ఓ నెలలో ఆహారంతో పాటు మనం తింటున్న మైక్రోప్లాస్టిక్ 21 గ్రాములు.



6 నెలలకు 125 గ్రాములు

పిల్లలకు సిరీల్స్ తినిపించే గిన్నె నిండుగా పోస్తే వచ్చేంత బరువు. మనకు తెలియకుండానే మనం 125 గ్రాముల ప్లాస్టిక్‌ను పొట్టలోకి పంపిస్తున్నాం.



ఏటా పావు కిలో

ప్లేట్ నిండా పెట్టుకునే అన్నం బరువుతో సమానం. సరాసరి మనం పావు కిలో మైక్రోప్లాస్టిక్‌ను తింటున్నాం.

పదేళ్లకు రెండున్నర కిలోలు

ఈత నేర్చుకునేటప్పుడు మనం నడుముకు కట్టుకునే ప్లాస్టిక్ బెండు బరువుతో సమానంగా మనం పదేళ్లలో ప్లాస్టిక్‌ను హాంఫట్ అనిపించేస్తున్నాం. రెండున్నర కిలోల మైక్రోప్లాస్టిక్స్ కడుపులోకి చేరిపోతున్నాయి.



జీవితం మొత్తంలో 20 కిలోలు

ఓ చిన్న బియ్యం బస్తా బరువు 25 కిలోలుంటుంది. దాంట్లో ఐదు కిలోలు తీసేస్తే 20 కిలోల మైక్రోప్లాస్టిక్‌ను మనం భోజనంతో పాటే కానిచ్చేస్తున్నాం. చెత్తపడేసే రెండు ప్లాస్టిక్ బిన్నులకు (ఒక్కోటి పది కిలోల బరువు అనుకుంటే) సమానం.



ఇది చాలా సీరియస్

“ కొన్నేళ్ల తరబడి మనం ప్లాస్టిక్‌ను వాడుతున్నాం. కానీ, మైక్రోప్లాస్టిక్, నానో ప్లాస్టిక్‌ల వల్ల కలిగే నష్టాలు, మన హెల్త్‌పై పడే ప్రభావాలను మాత్రం అంచనా వేయట్లేదు. మనం తినే ఆహారంతో పాటే అవి మన కడుపుల్లోకి చేరిపోతున్నాయి. చేయకూడని నష్టాన్ని చేస్తున్నాయి. ఇది నిజంగా ఆందోళన చెందాల్సిన విషయమే.

- థవ పళనిస్వామి, యూనివర్సిటీ ఆఫ్ న్యూ కేజిల్, ఆస్ట్రేలియా, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ స్టడీలో పాల్గొన్న సైంటిస్ట్

చంద్రయాన్3.. వచ్చే ఏడాది

చంద్రయాన్ 3 ప్రయోగం వచ్చే ఏడాది ఉంటుందని ఇస్రో చైర్మన్ కె.శివన్ చెప్పారు. నిజానికి ఈ ఏడాదే ప్రయోగం చేపట్టాలనుకున్నా, వచ్చే ఏడాదికి వాయిదా పడే అవకాశాలే ఎక్కువని చెప్పుకొచ్చారు. ఈ ఏడాదే చంద్రయాన్ 3 ప్రయోగం ఉంటుందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇస్రో చైర్మన్ బుధవారం దానిపై క్లారిటీ ఇచ్చారు. చంద్రయాన్ 2 లాగే చంద్రయాన్ 3 ప్రయోగం ఉంటుందని స్పష్టం చేశారు. ల్యాండర్, రోవర్, ప్రొపల్షన్ మాడ్యూల్ ఉంటాయని చెప్పారు. ప్రయోగానికి 14 నుంచి 16 నెలల టైం పట్టొచ్చన్నారు. మొత్తం ప్రయోగానికి రూ.615 కోట్ల దాకా ఖర్చవుతుందని తెలిపారు. అందులో ల్యాండర్, రోవర్, ప్రొపల్షన్ మాడ్యూల్‌కు రూ.250 కోట్లు, మిషన్ లాంచ్ కోసం మరో 365 కోట్లు ఖర్చవుతాయని తెలిపారు. ఆ ప్రాజెక్టును కేంద్రం ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించిందని, ప్రాజెక్ట్ టీమ్‌ను కూడా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ప్రస్తుతం దానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని లాంచ్ ప్యాడ్‌కు తోడు తమిళనాడులోని ట్యూటికోరిన్‌లోనూ మరో లాంచ్‌ప్యాడ్‌ను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఇప్పటికే దానికి సంబంధించిన భూ సేకరణ పనులు మొదలయ్యాయన్నారు. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్‌వీ) ప్రయోగాల కోసం (సౌత్‌వార్డ్ లాంచ్) ఆ లాంచ్‌ప్యాడ్‌ను వాడుతామని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో పెద్ద ప్రయోగాలకు వాడుకుంటామన్నారు. ఈ ఏడాది మొత్తం 25 ప్రయోగాలు చేయబోతున్నామన్నారు. 2019లో చేయాలనుకుని, ఆగిపోయిన మిషన్లను ఈ ఏడాది మార్చిలో పూర్తి చేస్తామన్నారు.

వేగం కంట్రోల్ కాకనే విక్రమ్ ల్యాండ్ కాలేదు

విక్రమ్ ల్యాండర్ ఫెయిల్యూర్‌పైనా శివన్ స్పందించారు. దిగే క్రమంలో దాని వేగం కంట్రోల్ కాకపోవడం వల్లే అది కూలిపోయిందని చెప్పారు. ల్యాండర్‌లోని ఇంటర్నల్ సమస్యల వల్లే వేగం కంట్రోల్ కాలేదన్నారు. ఇక, చందమామపై విక్రమ్ ల్యాండర్ జాడను కనిపెట్టిన చెన్నై టెకీకి అభినందనలు చెప్పారు. కాగా, వచ్చే ఏడాదికి ప్రయోగం వాయిదా పడే అవకాశాలున్నాయని శివన్ చెబుతున్నా, ఇస్రో అంతర్గత వర్గాలు మాత్రం ఈ ఏడాది నవంబర్‌లోనే ప్రయోగం చేపట్టే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, ఒకవేళ అనుకోని కారణాల వల్ల ఆలస్యమైతే అవ్వొచ్చని అంటున్నాయి. అంతేగాకుండా, చంద్రయాన్2లో మాదిరి భూ కక్ష్య నుంచి చంద్రుడి కక్ష్యలోకి, అక్కడి నుంచి చంద్రుడిపై దిగేందుకు ఎక్కువ కక్ష్య మార్పులు ఉండవని చెబుతున్నాయి. చంద్రయాన్ 2లో ఆరుసార్లు భూ కక్ష్యలు మార్చిన సంగతి తెలిసిందే. చంద్రయాన్3లో మాత్రం 3 మార్పులే ఉంటాయని చెబుతున్నారు. అంతేగాకుండా లూనార్ ట్రాన్సిట్ ఆర్బిట్‌లో మార్పులూ తక్కువే ఉంటాయని అంటున్నారు. ఇక, చంద్రయాన్ 2 కన్నా చంద్రయాన్ 3 ప్రయోగ ఖర్చునూ ఇస్రో తగ్గించింది. చంద్రయాన్2కు రూ.960 కోట్లు ఖర్చు చేసిన ఇస్రో, చంద్రయాన్3కి మాత్రం రూ.615 కోట్లే బడ్జెట్ అని వెల్లడించింది.



- మిషన్‌పై ఇస్రో చైర్మన్ కె.శివన్
- వేగం కంట్రోల్ కాకనే విక్రమ్ ఫెయిల్
- గగన్‌యాన్‌కు నలుగురు ఆస్ట్రోనాట్ల ఎంపిక
- ఈ నెల మూడో వారం నుంచి రష్యాలో ట్రైనింగ్

గగన్‌యాన్‌కు నలుగురు ఎంపిక

మనిషిని అంతరిక్షానికి పంపే గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించిన పనులూ వేగంగా జరుగుతున్నాయని ఇస్రో చైర్మన్ కె.శివన్ చెప్పారు. కొన్ని పరీక్షల తర్వాత ఈ ఏడాదే ఆ ప్రయోగం చేస్తామన్నారు. అంతరిక్షంలోకి వెళ్లే ఆస్ట్రోనాట్ల ఫైనల్ లిస్టును ఖరారు చేశామన్నారు. నలుగురు ఐఏఎఫ్ సిబ్బందిని సెలెక్ట్ చేశామని చెప్పారు. జనవరి మూడో వారం నుంచి వారికి రష్యాలో శిక్షణ ఉంటుందన్నారు. ఇంత పెద్ద ప్రాజెక్ట్ ప్రభావం వేరే ప్రయోగాలపై పడబోదని స్పష్టం చేశారు. గగన్‌యాన్‌కు సంబంధించిన అన్ని మేజర్ పనులూ 2019లోనే పూర్తయ్యాయన్నారు. ప్రయోగ నమూనాల దగ్గర్నుంచి, ఆస్ట్రోనాట్ల ఎంపిక దాకా అన్ని పోయినేడాదే అయిపోయాయన్నారు. కాగా, గగన్‌యాన్ ప్రయోగం కోసం 60 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 12 మందిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ (ఐఏఎం) ఎంపిక చేసింది. వాళ్లందరికీ రష్యా అంతరిక్ష సంస్థ అయిన రాస్కాస్మోస్ స్టేట్ కార్పొరేషన్ బ్రాంచ్ అయిన గ్లావ్ కాస్మోస్ వారికి స్క్రీనింగ్ టెస్టులు చేసింది. అందులో ఫైనల్ లిస్టుకు సెలెక్ట్ అయిన నలుగురికి శిక్షణ ఇవ్వనున్నారు.



ఆస్ట్రేలియాలో ఆరని మంటలు

- బీచ్‌లో చిక్కుకున్నోళ్ల రెస్క్యూ లేట్
- వెళ్లలేకపోతున్న బలగాలు

ఆస్ట్రేలియాలో బుష్‌ఫైర్స్ ఆగడం లేదు. ఇప్పటి దాకా ఒకెత్తయితే.. ఇకపై మరిన్ని సవాళ్లు ఆస్ట్రేలియా అధికారులు ఎదుర్కోనున్నారు. ఇన్నాళ్లూ అక్కడ వింటర్ సీజన్ కాగా.. ఈ నెలలోనే వేసవి కాలం మొదలైపోయింది. రెండు నెలల పాటు అక్కడ టెంపరేచర్లు విపరీతంగా ఉండనున్నాయి. దీంతో మంటలు మరింత పెరిగే ముప్పుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మంటలు అదుపులోకి రాకపోతే పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు బీచ్‌లో చిక్కుకున్న 4 వేల మంది రెస్క్యూ లేట్ అవుతోంది. విక్టోరియాలోని మలా కూట, న్యూసౌత్‌వేల్స్‌లోని బాటెమన్స్‌బేలో టూరిస్టులు, జనం చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. మంటలు భారీగా ఎగిసిపడుతుండడంతో బలగాలు అక్కడకు వెళ్లలేకపోతున్నాయి. గాలులు వీస్తుండడంతో మంటలు వేగంగా విస్తరిస్తున్నాయి. పొగ కమ్మేస్తోంది. దీంతో హెలికాప్టర్లు, యుద్ధ విమానాల్లోనూ అక్కడకు వెళ్లే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. వారికి నేవీ షిప్పుల ద్వారా ఆహారం అందిస్తున్నారు. మంటల ధాటికి మంగళ, బుధవారాల్లో ఏడుగురు మృతి చెందారు. దీంతో ఈ సీజన్‌లో బుష్‌ఫైర్స్‌లో మరణించిన వారి సంఖ్య 13కి చేరింది.

నిరుడు 110 పులులు మృతి

- వేటగాళ్ల ఉచ్చుకే మూడోవంతు
- డబ్ల్యూపీఎస్ ఇండియా వెల్లడి
- 491 చిరుతలూ మృత్యువాత

గతేడాది దేశవ్యాప్తంగా 110 పులులు చనిపోయాయి. వీటిలో మూడోవంతు వేటగాళ్ల ఉచ్చుకే బలయ్యాయి. 110 లో 38 పులులకు సంబంధించిన కళేబరాల భాగాలను వేటగాళ్లు, స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకోగా 26 అనారోగ్యంతో, 36 తమలో తాము పోట్లాడుకొని, 3 రోడ్డు లేదా రైలు ప్రమాదాల్లో, 6 రెస్క్యూ చేస్తుండగా ప్రాణాలు కోల్పోయాయి. పులుల మరణాల్లో (29) మధ్యప్రదేశ్ తొలి స్థానంలో, మహారాష్ట్ర (22) రెండో స్థానంలో నిలిచాయి. 2018లోనూ ఈ రెండు రాష్ట్రాలే తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ లెక్కలను ఎన్జీవో వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ సొసైటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది. 2018తో పోలిస్తే 2019లో వేటగాళ్ల దెబ్బకు బలైన పులులు పెరిగాయని.. 2018లో 34, 2019లో38 చనిపోయాయని తెలిపింది. 491 చిరుత పులులూ చనిపోయాయని, 2018తో పోలిస్తే చనిపోయిన వాటి సంఖ్య 9 తగ్గిందని తెలిపింది. వీటిలో 127 వేటగాళ్ల ఉచ్చుకు బలయ్యాయని, 2018తో పోలిస్తే(169) ఈ సంఖ్య తక్కువని చెప్పింది. చిరుతల మరణాల్లో మహారాష్ట్ర (97) టాప్‌లో ఉందని.. వీటిలో 31 రోడ్డు, రైలు ప్రమాదాల్లో చనిపోయాయని వివరించింది.

వెహికిల్స్ వేగం పెరిగి..

రోడ్డు, రైలు ప్రమాదాల్లో పులులు, చిరుతలు చనిపోవడం ఆందోళన కలిగిస్తోందని డబ్ల్యూపీఎస్ సెంట్రల్ ఇండియా డైరెక్టర్ నితిన్ దేశాయ్ అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ తగ్గడం, రహదారుల వెడల్పు వల్ల వాహనాలు వేగం పెరిగి అడవి జంతువులు ఎక్కువగా చనిపోతున్నాయన్నారు. పులుల రక్షణ కోసం పర్యవేక్షణ పెరిగినా, వాటి శరీర భాగాలకు డిమాండ్ పెరగడం మరింత ఆందోళనకరమని చెప్పారు. ఎన్‌టీసీఏ, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రకారం దేశంలో 2,967 పులులున్నాయి. 526 పులులతో మధ్యప్రదేశ్ టాప్‌లో ఉంది. మహారాష్ట్రలో 2014లో 190 పులులుంటే ఆ సంఖ్య 2018 నాటికి 312కి చేరింది.

సింహాల లెక్కలకు 10 వేల కెమెరాలు

గుజరాత్‌లో 2020 సింహాల లెక్క కోసం 8 వేల నుంచి 10 వేల కెమెరాలను వాడబోతున్నారు. గతంలో 15 వేల చదరపు కిలోమీటర్ల మేర ప్రాంతాన్ని సర్వే చేయగా ఈసారి 7 జిల్లాల్లోని 25 వేల కిలోమీటర్ల మేర జల్లెడ పట్టనున్నారు. మేలో జరగబోతున్న ఈ సర్వేలో తొలిసారి వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిపుణులు పాల్గొనబోతున్నారు. గుజరాత్‌లో 2015లో సింహాల సంఖ్య 523. ఐదేళ్లలో ఈ సంఖ్య బాగా పెరిగి ఉండొచ్చని, వెయ్యి మార్క్‌ను దాటుండొచ్చని అంటున్నారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ టెక్నాలజీని సింహాల లెక్కలకు వాడబోతున్నారు. ఈ పద్ధతి ప్రకారం సర్వే ప్రాంతాన్ని మూడు కిలోమీటర్ల గ్రిడ్లుగా విభజిస్తారు. ఫస్ట్ సుమారు 2 వేల మంది ఫీల్డ్ ఆఫీసర్లు సర్వే చేస్తారు. సింహాల వెంట్రుకలు, పండ్లు, గోర్లను సేకరిస్తారు. రెండో దశలో 10 వేల కెమెరాలతో సింహాల కదలికలను గమనిస్తారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.